ప్రజాపక్షం 7th ANNIVERSARY 22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

సంపుటి 28, సంచిక: 106 | సోమవారం | 06-10-2025 | హైదరాబాద్

Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12 | వెల రూ. 5.00

## శ్రద్ధాంజలి



## కీ.శే. శ్రీమతి పురిటిపాటి విజయలక్ష్మి

(1951 – 05/10/2025)

ప్రేమకు ప్రతిరూపంగా.. ధైర్యానికి నిలువుటద్దంగా..
మా వెన్ను తట్టి నడిపించిన మీరు భౌతికంగా దూరమైనా..
మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచే వుంటారు.

భర్త
**పి. వీరా రెడ్డి**

సోదరుడు
**పి.పి. రెడ్డి - పి. రమ**

కుమారులు
**పి.వి. కృష్ణా రెడ్డి – పి. సుధారాణి**
**పి.వి. సుబ్బా రెడ్డి – పి. సుమలత**

కుమార్తె
పి. ప్రసన్న కుమారి – పి. నాగి రెడ్డి

### పెద్దకర్మ

2025 అక్టోబరు 15వ తేదీ
బుధవారం

**స్థలం:**
**హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్,**
**హైదరాబాద్.**


**meil** family

# సాహితీ విహారి

# సాహిత్యంలో 'నోబెల్' ఎవరికో?

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే నోబెల్ బహుమతి, సాహిత్యంలో ఈసారి ఎవరికి లభిస్తుందనేది ఆసక్తి రేపుతున్నది. ప్రపంచ సాహిత్యవేత్తలు ఆసక్తిగా ఎదురు చూసే 2025 నోబెల్ సాహిత్య బహుమతి ఫలితాలు ఈనెల 9వ తేదీ గురువారం నాడు, స్వీడిష్ అకాడమీ ప్రకటించనుంది. ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా పేర్లు అత్యంత రహస్యంగా ఉంచారు. అయితే, ఎప్పటిలాగానే, ఈసారి కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చర్చలు జరుగుతున్నాయి. అభిమానుల ఆత్రుత ప్రపంచ సాహిత్యవర్గాల్లో ఉత్కంఠను నింపుతున్నది. ఈసారి 'నోబెల్' ఒక ప్రసిద్ధ నవల రచయితకా? లేక లోతైన కవిత్వానికి విఖ్యాతి చెందిన కవికా? లేకపోతే సమాజానికి సవాళ్లు విసిరే వేదికపై ఆలోచనల విస్ఫోటనం చేసే నాటక రచయితకా? ఎవరిని ఈ అదృష్టం వరిస్తుందో చెప్పలేని పరిస్థితి. కొన్ని సందర్భాల్లో అకాడమీ ఊహించని రచయితలను ఎన్నుకోవడం, లేదా పలువురి మన్ననలు పొందినా ఇంతవరకు బహుమతి రాని మహాకవులను సత్కరించడం జరుగుతూ ఉంటుంది. గత ఏడాది ఈ గౌరవాన్ని దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్ గెలుచుకుంది. చరిత్రాత్మక గాయాలను లోతైన కావ్యాత్మక ప్రోజ్ ద్వారా ఎదుర్కొంటూ, మానవ జీవిత నాజూకుతనాన్ని ప్రతిబింబించే సాహిత్య సృష్టిని దృష్టిలో ఉంచుకొని ఆమెను సత్కరించారు. ఈ విజయంతో కొరియన్ సాహిత్యం ప్రపంచ వేదికపై మరింత ప్రత్యేక స్థానం సంపాదించింది. కాగా, ఈ ఏడాది ఈ ఘనమైన పురస్కారాన్ని గెలిచే అవకాశమున్నవారిగా సాహిత్య ప్రపంచంలో తరచూ చర్చకు వస్తున్న పేర్లలో, ఆస్ట్రేలియాకు చెందిన కథనతత్త్వశాస్త్రసంపన్న గద్యరచయిత జెరాల్డ్ మర్‌నేన్ ముందు వరుసలో ఉన్నాడు. హంగరీకు చెందిన ఆపోకలిప్టిక్ భావనలతో కూడిన తత్త్వభరిత నవల రచయిత లాస్లో క్రాస్నహోర్కై, జపాన్‌కు చెందిన భావోద్వేగ పూరిత, అలౌకిక కల్పిత కథల మాంత్రికుడు హరుకి మురకామి, రుమేనియాకు చెందిన సాంకేతికంగా సంక్లిష్టమైన, స్వప్నాత్మక రచయితలలో నిష్ణాతుడు మిర్చా కర్టెస్కూ, కెనడాకు చెందిన ప్రఖ్యాత కవయిత్రి, వ్యాసరచయిత్రి అన్నే కార్సన్, మెక్సికోకు చెందిన క్రిస్టినా రివేరా గార్జా, అమెరికా పోస్ట్‌మోడర్న్ మహాగిరి థామస్ పించన్, యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె), భారత మూలాలుగల మాంత్రిక వాస్తవవాద ప్రతినిధి, అభివ్యక్తి స్వేచ్ఛకు అంకితధారి సల్మాన్ రష్దీ కూడా రేసులో ఉన్నారని అంటున్నారు. ఎంతో మంది హేమాహేమీలు ఈ పురస్కారం కోసం ఎదురుచూడడం రివాజు. ప్రపంచ నోబెల్ చరిత్రలో సాహిత్య బహుమతి ఎల్లప్పుడూ ప్రతీకాత్మకమే. ఎందుకంటే ఇది కేవలం ఒక రచయితకే గౌరవం కాదు, ఆయన లేదా ఆమె ప్రాతినిథ్యం వహించే భాష, సంస్కృతి, చరిత్ర, సామాజిక అనుభవాలకూ గుర్తింపు లభిస్తుంది. ఈ అవార్డు సాధారణంగా పదుల సంవత్సరాల పాటు రహస్యంగా ఉంచిన నామినేషన్లలోంచి ఎంపిక యినా, సాహిత్యాభిమానులు తమ ఊహాగానాలను పంచుకోవడం ఆనందంగా స్వీకరించే సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఏడాది విజేత ఎవరైనా, ఆయన లేదా ఆమె రచనలు సమకాలీన ప్రపంచాన్ని లోతుగా ప్రతిబింబిస్తూ, మానవ అనుభవాన్ని మలచే శక్తి కలిగి ఉంటారన్నది మాత్రం నిజం. ప్రపంచంలోనే అత్యున్నత సాహిత్య బహుమతిగా పేర్కొనే నోబెల్ సాహిత్య పురస్కారాన్ని స్వీడిష్ అకాడమీ ప్రతి ఏటా అందిస్తుంది. ఈ పురస్కారాన్ని స్వీడన్ పరిశ్రమవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ 1895లో తన ఆఖరి రోజుల్లో ఏర్పాటు చేశాడు. ఆయన ఇందుకోసం 31 మిలియన్ స్వీడిష్ క్రోన్ల సొంత ఆస్తిని ఉపయోగించి సాహిత్యం, శాస్త్రం, శాంతి రంగాల్లో అత్యుత్తమ కృషికి సంవత్సరానికి బహుమతులు ప్రకటించాలనుకున్నారు. కాగా, నోబెల్ సాహిత్య పురస్కారం సాహిత్య రంగంలో అత్యుత్తమ, ప్రేరణాత్మక, సమకాలీన రచనలు చేసిన రచయితలకు ఇస్తారు. సాధారణంగా ఈ పురస్కారం ఒక రచయిత సమగ్ర రచనా జీవితాన్ని ఆధారంగా తీసుకుని ఇస్తారేతప్ప, కేవలం ఏ ఒక్క రచనకు కాదు. సాహిత్య పురస్కారం ఆలోచనాత్మక దిశలో అత్యుత్తమ కృషి చేసిన రచయితకి ఇవ్వాలని ఆల్ఫ్రెడ్ నోబెల్ స్పష్టం చేశాడు. 1901 నుండి ఇప్పటి వరకూ ఈ అవార్డును ప్రతి సంవత్సరం అందిస్తున్నారు. స్వీడిష్ అకాడమీ సభ్యులు, ఇతర సాహిత్య సమాజాల ప్రతినిధులు, పూర్వ నోబెల్ విజేతలు, ప్రొఫెసర్లు రచయితల పేర్లను సూచిస్తారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు పేర్లను స్వీకరిస్తారు. తర్వాత వచ్చిన జాబితాను 20 మందికి కుదిస్తారు. అనంతరం మళ్లీ చర్చించి, 'టాప్–' జాబితా సిద్ధమవుతుంది. నాలుగు నెలలు వీరి రచనలు చదువుతారు. అనంతరం కమిటీ ఓటింగ్ ద్వారా విజేతను ఎంపిక చేస్తుంది. నోబెల్ సాహిత్య పురస్కారాన్ని పొందడం అనేది సాహిత్య ప్రపంచంలో ఉన్నతమైన గౌరవంగా పరిగణిస్తారు. ఇది రచయిత, వారి రచనలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. అంతేగాక, వారి రచనలు ప్రపంచవ్యాప్తంగా పాఠకుల దృష్టిని ఆకర్షిస్తాయి. ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న, నోబెల్ మరణించిన దినంపై స్వీడన్ రాజుకు చేతులమీదుగా ఈ బహుమతి అందజేస్తారు. అందుకోసం ఒక వైభవమైన వేడుక నిర్వహిస్తారు.

**— సత్యశ్రీ**




ఇప్పటి వరకూ 25 భాషలకు చెందిన 121 మంది రచయితలు (103 మంది పురుషులు, 18 మంది మహిళలు) నోబెల్ సాహిత్య బహుమతి పొందారు. 1907లో రుద్యార్డ్ కిప్లింగ్ ఈ అవార్డును స్వీకరించినప్పుడు అతని వయసు 41 సంవత్సరాలు. ఇప్పటి వరకూ నోబెల్ పురస్కారాన్ని అందుకున్న అత్యంత పిన్న వయస్కుడు ఆయనే. గత ఏడాది దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాన్‌కు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. మె మానవత్వంపై గాఢమైన భావోద్వేగంతో పోత ప్రోసే ఎరోటిక్ ప్రోస్‌ను రాసిన రచయిత్రిగా గుర్తింపు పొందింది.


ముఖ్య నోబెల్ పురస్కార గ్రహీతలు
సలీ ప్రుధోమ్ (1901)
రుద్యార్డ్ కిప్లింగ్ (1907)
సెల్మా లాగర్‌లఫ్ (1909)
రవీంద్రనాథ్ ఠాగూర్ (1913)
ఎర్నెస్ట్ హేమింగ్వే (1954)
అబ్దుల్‌రజాక్ గర్నాహ్ (2021)
హాన్ కాంగ్ (2024)

## 'తొలి కవి' ప్రుధోమ్




నోబెల్ పురస్కారాన్ని అందుకున్న తొలికవిగా ఫ్రాన్స్‌కు చెందిన సలీ ప్రుధోమ్ చరిత్రలో నిలిచి పోతాడు. 1901లో ఈ అవార్డును స్వీకరించిన ప్రుధోమ్ సాహిత్యంలో అంతర్ముఖత, తాత్వికత, పర్నాసియన్ ఉద్యమ భావనలు స్పష్టంగా కనిపిస్తాయి. నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులు, కట్టుబాట్లను కూడా వివరిస్తాడు. అతనిని మొదటి లిరికల్ (ఆత్మాభివ్యక్తి) కవిత్వ నిపుణుడిగా పేర్కొంటారు. పర్నాసియన్ ఉద్యమంలోని వైఖరి, అంటే నిగూఢత, శ్రేణి, సౌందర్య ప్రమాణాలను పునరుద్ధరించటానికి విశేషంగా కృషి చేశాడు. ప్రుధోమ్ కవిత్వాన్ని ప్రధానంగా రెండు దశలుగా విభజించవచ్చు. మొదటి దశలో అతని కవిత్వం వ్యక్తిగత ప్రేమ విఫలతలు, విచారం, మెలాంచాలియా వంటి భావోద్వేగాలతో నిండివుంటుంది. 'లే వేస్ బ్రిస్' వంటి కవిత్వం ఈ దశకు ఉదాహరణ. తర్వాత అతను వ్యక్తిగత భావోద్వేగాలను వదిలి, తత్త్వ, విజ్ఞానం, న్యాయ నిర్మాణాలపై అధ్యయనం చేసే దిశగా ఆలోచనలు మార్చుకున్నాడు. అతని 'లా జస్టిస్' (న్యాయం), 'లే బొన్హర్' (సంతోషం) వంటి కవితలు ఈ తాత్త్విక భావాలకు అద్దం పడతాయి. ప్రుధోమ్ తన కవిత్వంలో శాస్త్ర ఆధారిత, తాత్త్విక అంశాలను ప్రవేశపెట్టడం ద్వారా సాహిత్యంలో సైన్సును తాత్త్వికతతో కలిపే ప్రయత్నం చేశాడు. సాహిత్య శైలిలో అతని కవిత్వం సున్నితమైన ఆలోచనలను ప్రతిబింబిస్తుంది. అతని బాణీలలో ఒక త్యాగసూత్రం ఉంది. ప్రుధోమ్ రచనలు ప్రారంభంలో వ్యక్తిగత ప్రేమపై దృష్టి పెట్టినప్పటికీ, కాలానుగుణంగా అతను సమాజానికి, న్యాయానికి, మానవ శక్తికి ప్రతీకలుగా మారాయి. కొత్త అంశాలను పాఠకులకు పరిచయం చేయడంతో పాటు, వాటిపై ఆలోచించేలా గొప్ప కవిత్వం రాశాడు. అతని రచనలు భావోద్వేగాల అతి సూక్ష్మ మైన వ్యక్తీకరణతో పాటు హృదయానికి హత్తుకొనే తాత్త్వికత కలిగి ఉంటుంది. మొత్తం మీద, ప్రుధోమ్ సాహిత్యం పర్నాసియన్ ఉద్యమ ఆశయాలను ప్రతిబింబిస్తూ, కళను శాస్త్రం, తత్వం, మానవీయతతో సంయోగపరిచే ఒక ప్రత్యేక శైలిగా ముద్రపడింది. ఈ లక్షణమే అతనిని 19వ శతాబ్దపు ఫ్రెంచ్ కవులలో ముఖ్యస్థానంలో నిలబెట్టింది.

## లోతైన భావం..




సలీ ప్రుధోమ్ ప్రసిద్ధ రచన 'లే వేస్ బ్రిస్' (పగిలిన జాడీ) అత్యంత భావ గర్భితమైనది. రచయిత ఇందులో గొప్ప ప్రయోగం చేస్తాడు. ప్రుధోమ్ జాతీని తీసుకొని, దానిపై దుమ్మును పోగొట్టడానికి ఊదుతున్నప్పుడు, సన్నటి చారికలా ఉన్న పగులు కనిపిస్తుంది. మనిషి హృదయానికి తగిలిన గాయంతో రచయిత ఆ పాత్రకు ఉన్న పలుగును పోలుస్తాడు రచయిత. ఆ పలుగు ఎవరికీ కనిపించదు. జాడీలోని నీరు కూడా బయటకు రాదు. అన్నిటినీ తట్టుకుంటూ, గాయాన్ని భరిస్తున్న ఆ జాడీని అతను హృదయం గాయపడిన మనిషితో పోలుస్తాడు ప్రుధోమ్. గిన్నెలో అతి సున్నితమైన లోపం ఉంటుంది. ఎవరైనా బలంగా పట్టుకుంటే ముక్కచెక్కలైపదోతుంది. అత్యంత జాగ్రత్తగా దానిని చూసుకోవాలి. ఈ లక్షణాలను అతను విఫల ప్రేమకు, పగిలిన గుండె పడే వేదనకు, అనవసర దెబ్బరు హృదయ మరణాన్ని శాసించే విధానానికీ ముడిపెడతాడు. ఈ కవితలో ప్రుధోమ్ భావప్రయోగం సున్నితమైన మెలాంచాలియా, గాఢమైన మానసిక వేదనకు అద్దకాలు వేసి, మనిషి హృదయ సున్నితత్వాన్ని వివరిస్తాడు. హృదయానికి తగిలే దెబ్బ కూడా గిన్నె (వేస్)పై ఉన్న పగులు మాదిరిగానే ఎవరికీ కనిపించదు. పలిగిందనే సందేహం కూడా ఎవరికీ రాదు. కానీ, చిన్నపాటి ఒత్తిడికి ముక్కలైపోతుంది... గుండెమాదిరిగానే. ప్రేమ హృదయానికి చెందిన పరిమితి, అధిగమించలేని విచారం... కలిసిపోయే ఆశల మధ్య సాన్నిహిత్యం. సాధారణ దృక్కోణానికి అతని పరిశీలన పూర్తి భిన్నం. మరణ ఊహలను, వివక్ష, దయనీయత భావాలను ఆలోచించ చేయడం ప్రుధోమ్ కవిత్వ లక్షణం. ప్రేమ, న్యాయం, మానవ స్వభావం వంటి సున్నితమైన అంశాలను అతను నర్మగర్భంగా చెప్తాడు. తన సాహితీ ప్రస్థాన తొల్దిశలో అతని తాత్విక ధోరణికి 'లే వేస్ బ్రిస్' తిరుగులేని ఉదాహరణ.

## కాలాతీత కవిత్వం




## సాహిత్యానికి ఠాగూర్ 'గీతాంజలి'

ప్రపంచ సాహితీ రంగానికి రవీంద్రనాథ్ ఠాగూర్ అందించిన 'గీతాంజలి' అతనికి ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ సాహిత్య పురస్కారాన్ని అందించింది. ఇది భారతీయ కవిత్వానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన తేజోమయమైన సంపుటి. బెంగాలీ భాషలో 1910లో వెలువడిన గీతాంజలి పద్యాలను ఠాగూర్ స్వయంగా ఆంగ్లంలోకి అనువదించాడు. ఆ కవితా సంపుటి ఆంగ్ల అనువాదం కారణంగా ప్రపంచమంతటా విస్తరించింది. విశేష ఆదరణ పొందింది. 'గీతాంజలి: సాంగ్ ఆఫరింగ్స్' పేరుతో 1912లో ప్రత్యేక ఆంగ్ల సంపుటి ముద్రితమైంది. ఐరిష్ కవి డబ్ల్యుబి ఏట్స్ ముందుమాట రాసిన ఈ సంకలనాన్ని కవిత్వం, సంగీతం, భక్తి, తాత్వికతల మిశ్రమంగా వెలిసిన ఈ కావ్యంగా పేర్కోవచ్చు. ఈ కావ్యంలో మొత్తం 157 బెంగాలీ పద్యాల్లోంచి 53ను, ఇతర రచనల నుండి మరికొన్ని కలిపి మొత్తం 103 ఆంగ్ల కవితలను ఠాగూర్ స్వయంగా సంకలనం చేసి, ముద్రించారు. యూరప్ సాహిత్యములోనూ తన కవితావ్యాఖ్యానాలకు ప్రాముఖ్యత సంపాదించారు. భక్తి – ప్రేమ – ప్రకృతి – జీవన తాత్వికత అనేవి ఈ భావపల్లవితమైన కవితా సంకలనంలో కీలకాధారాలు. ఠాగూర్ కవిత్వంలోని అత్యద్భుత సౌందర్యం, స్వచ్ఛమైన దైవానుభూతి, జీవన పరమార్థం, స్వేచ్ఛత, ప్రజల సుఖదుఃఖాల్లో వెదజల్లే మానవీయత మెరుపులు ప్రతి పంక్తిలో దర్శనమిస్తాయి. గీతాంజలిలోని ముఖ్యాంశాలపై పరిశీలిస్తే, ఠాగూర్ పేర్కొన్న దేవునితో సంభాషణ – భగవత్ భక్తి – ప్రకృతిని మానవుతో మిళితం చేయడం కనపడుతుంది. అతి సాధారణ పదాల్లో ప్రగాఢ భావనలకు రూపమిస్తోంది. దేశభక్తి, జీవిత మాధుర్యం, లేక లోకానికి వ్యక్తిగత వెతలు, లోతైన తాత్విక ప్రశ్నలు ఈ కవితల్లో ప్రతిధ్వనిస్తాయి. దేశాన్ని శాంతిమయంగా, భయరహితంగా మారుస్తుందనే ఆశ సుస్పష్టంగా కనిపిస్తాయి. ఈ సంకేత సమాలోచనలే గీతాంజలి మహాత్వాన్ని నిరూపించాయి. ఠాగూర్ అత్యంత సరళమైన భాషను ప్రయోగించి మహత్తర భావజాలాన్ని వ్యక్తీకరించగలిగాడు కాబట్టే, ఇది ఖండాంతరాలను దాటుకొని పరుగలు తీసింది. 'విశ్వకవి'గా నిలబెట్టింది. ఆంగ్ల అనువాదంలోనూ ఆయన పదజాలంలో ఉన్న మాధుర్యాన్ని, భావగంభీరతను దీర్ఘంగా నిలిపారు. పాటలైన గీతాంజలి కవితలు స్వాంతానాన్ని, భక్తిని, ఔన్నత్యాన్ని ప్రతిబింబించే గీతాలుగా మారాయి. ఆంగ్ల అనువాదమే కాకుండా, తెలుగు సహా అనేక భారతీయ భాషల్లోకి వివిధ కలం కవులు అనువదించారు. తెలుగులో ఎంతో మంది గీతాంజలిని అనువదించారు. అయితే, చలంగా సుప్రసిద్ధుడైన గుడిపాటి వెంకట చలం అనువాదాన్ని ప్రముఖంగా పేర్కొంటారు. గీతాంజలిని అప్పటి భారతీయ సమాజంలోని ఆధ్యాత్మిక చైతన్యానికి, మానవీయ విలువలకు పట్టం కట్టింది. సంపుటిలో ఎన్నో జీవన సందేశాల్ని ఆనవాళ్ళుగా నిలుస్తాయి. క్షణిక సుఖాన్ని కంటే సార్వకాలిక మౌలిక సత్యాలపై ఠాగూర్ దృష్టి.... తాత్విక దృష్టికోణం... నిరాశను అధిగమించే ఆశాభావం ప్రతి పద్యంలోనూ దర్శనమిస్తాయి. గీతాంజలిలో ప్రకృతి అంతర్గతంగా, జీవిత భాగంగా ఉంటుంది. ప్రకృతి దృశ్యాలు, సుగంధాలు, పక్షులు, నదులను కేవలం పక్కన ఉన్న వస్తువులుగా కాక, జీవాత్మతో కలిసిపోలిన భాగంగా ఠాగూర్ ప్రస్తావిస్తాడు. ప్రకృతికి, జీవజాలానికి ఉన్న అనుబంధాన్ని అన్వేషించినట్లు కవిత్వం వ్యక్తమవుతుంది. ఠాగూర్ కవిత్వంలో మానవీయతా కోణం కూడా కనిపిస్తుంది. జీవితం సుఖదుఃఖాల సమీకరణమని అంటాడు ఠాగూర్. తనను తాను శోధించుకుంటూ, అన్వేషించుకుంటూ ఉంటాడు. జీవితం, మరణం, సృష్టి, అదృశ్య నిజాలు, ఆశ, నిరాశ వంటి భావాలను గొప్పగా ఆవిష్కరిస్తాడు ఠాగూర్. వ్యక్తిగత స్వాధీనం, స్వేచ్ఛ భావనలను 'గీతాంజలి' ద్వారా ప్రధానంగా ప్రతిపాదించాడు. జీవితంలో దైవ సేవ, మానవ సేవ మధ్య సమతుల్యత, అలాగే ఆత్మలోని వెలుగును గుర్తించడం, వెలుగును వదిలిపెట్టకుండా పోరాడడం ఆయన భావన. స్వేచ్ఛ అనేది కేవలం బాహ్య పరిమితుల నుండి విముక్తి మాత్రమే కాక, అంతఃస్వరూపం నుంచి వెలువడి దిగుబడుకోగలకి సామర్థ్యమని ఈ భావం చెపుతుంది. వసుధైక కుటుంబాన్ని, నిస్వార్థ ప్రేమను, అంతులేని కరుణను, ప్రకృతికి జీవుడి ఆత్మసమర్పణను ఠాగూర్ గీతాల్లో గొప్పగా వ్యక్తీకరించాడు. భక్తితత్వం కనిపించినా, అది ఏదో ఒక మతానికి పరిమితంగా చెప్పడానికి వీలులేదు. అదే విధంగా వసుధైక సూత్రం కూడా కులమతాలకు అతీతంగా ఉంటుంది. ఈ రెండు అంశాలే 'విశ్వకవి' ఠాగూర్ కీర్తిని నిలబెట్టాయి. అతనికి నోబెల్ బహుమతిని సంపాదించి పెట్టాయి.

## ప్రధాన సమస్యలపైనే నైపాల్ రచనలు

భారత మూలాలున్న విద్యాధర్ సూరజ్‌ప్రసాద్ నైపాల్ (విఎస్ నైపాల్) ట్రినిడాడ్ అండ్ టొబాగోలోని చగువానాస్‌లో జన్మించాడు. యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లో స్థిరపడ్డాడు. 2001లో నోబెల్ సాహితీ పురస్కారాన్ని అందుకున్నాడు. వలసరాజ్యాల పతనం తర్వాత పుట్టుకొచ్చిన ఉదారవాద విధానాలపై నిరంతరం సందేహాలు వ్యక్తం చేసిన వ్యక్తి నైపాల్. అతని రచనల్లోనూ ఇవే అంశాలు కీలకంగా ఉంటాయి. సమకాలీన కీలక సమస్యలపై తన అభిప్రాయాలను వెల్లడించడానికి నైపాల్ ఎప్పుడూ భయపడలేదు. పరిస్థితులతో రాజీ పడలేదు. కొంతమంది అతనిని ధైర్యవంతుడిగా పేర్కొంటే, మరి కొంత మంది వివాదాస్పద రచయిగా ముద్ర వేశారు. ఏరకంగా చూసినా, నైపాల్ మాదిరి తన ప్రతిష్టను తానే దెబ్బతీసుకునే రీతిలో రచనలు చేసిన వ్యక్తులు చాలా అరుదు. వలసవాదం నుండి ఇస్లాం వరకు దేనినీ అతను విడిచిపెట్టలేదు. ఆఫ్రికాలో జాతీయవాదం అపహాస్యానికి గురవుతున్న విషయాన్ని సైతం అతను ప్రస్తావించాడు. 20వ శతాబ్దపు చివరి దశాబ్దంలో, యువతరం పాఠకులు ఆయన సాహిత్యానికి విపరీతంగా ప్రభావితమయ్యారు. అణచివేతకు గురైన చరిత్రలను ఆయన రచనల్లోనే తెలుసుకున్నారు. నైపాల్ రచనలు అశాంతికి, మానసిక సంఘర్షణకు నిదర్శమని పేర్కొనేవారు కూడా ఉన్నారు. ప్రారంభ జీవితం వలసరాజ్యాల ఒప్పంద చరిత్ర.. తత్ఫలితంగా దక్షిణాసియా ఉపఖండం నుండి ఆఫ్రికా, కరేబియన్ ప్రాంతాలకు ప్రజల బలవంతపు తరలింపు వంటి సంఘటనల నడుమ గడిచింది. 1833 (బానిసత్వం రద్దు) తర్వాత, 1922 వరకూ ఐరోపా దేశాల వలసపాలన కింద ఉన్న ప్రాంతాలలో చెరకు తోటల్లో పని చేయడానికి సుమారు 35 లక్షల మంది భారతీయులను బలవంతంగా తరలించారు. రుణ బకాయిలు చెల్లించడంలో విఫలం కావడమే వారు చేసిన నేరం. ఈ విధంగా వెళ్లిన భారతీయులు, ఇండియన్, పసిఫిక్ మహాసముద్రాలకు ఆవల వివిధ దీవుల్లో శ్రామికులుగా చేరాల్సి వచ్చింది. దక్షిణాఫ్రికా, ట్రినిడాడ్, ఫిజి వంటి భిన్నమైన దేశాలలో స్థానిక సంప్రదాయలకు, భారతీయ విశ్వాసాలకు మధ్య వారు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. ఎంతో ఘర్షణను చవిచూశారు. మానసిక, శారీరక బాధలను దిగమించి, బతుకు పోరాటం సాగించారు. ఇలాంటి లక్షలాది కుటుంబాల్లో నైపాల్ కుటుంబం కూడా ఒకటి. నైపాల్ తండ్రి సీపర్సాడ జర్నలిస్టుగా మారాడు. గార్డియన్ పత్రికకు తొలి ఇండో–ట్రినిడాడియన్ రిపోర్టగా పని చేశాడు. కుటుంబాన్ని ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలన్న ఆశతో చిన్నచిన్న కథలు రాసేవాడు. అనంతరం లండన్‌కు తరలివెళ్లాడు. కుటుంబంతోపాటు యుకె చేరుకున్న నైపాల్ అక్కడే పెరిగాడు. చిన్నతనంలో తాను చూసిన సామాజిక పరిస్థితులు, ఎదుర్కొన్న సమస్యలు అతని సాహిత్యానికి ప్రధాన ఇతివృత్తాలుగా మారాయి. 'ఎ హౌస్ ఫర్ మిస్టర్ బిశ్వాస్', 'ఫ్లాగ్ ఆన్ ది ఐలాండ్', 'ది సఫరేజ్ ఆప్ ఎల్విరా', ది మిస్టిక్ మాస్సూర్' వంటి రచనలు నైపాల్‌కు కీర్తిప్రతిష్టలను ఆర్జించిపెట్టాయి. ట్రినిడాడియన్ జీవితాల రిజిస్టర్‌ను సార్వత్రికంగా మార్చేందుకు నైపాల్ చేసిన కృషిని నేటికీ కొంతమంది పోస్ట్‌కలోనియల్ రచయితలు గుర్తిస్తున్నారు. ఆ ఆశయాన్ని ఆచరిస్తున్నారు. నైపాల్‌కు మన దేశంతో సంబంధం లేకపోయినా, అతని రచనల్లో భారతీయ సామాజిక, ఆర్థికాది అంశాలు లేకపోయినా, కేవలం భారత మూలాలు ఉన్నందుకే అతనిని మన జాబితాలోనే చేర్చుకుంటున్నాం. ఇలావుంటే, దేశానికి స్వాతంత్ర్యం రాకముందు, 1907లో రుడ్యాండ్ కిప్లింగ్ కూడా నోబెల్ సాహిత్య అవార్డును స్వీకరించాడు. మన దేశంలో కాలం గడిపిన కారణంగా, ఆ పేరును కూడా భారతీయుల జాబితాలో చేర్చడం అలవాటుగా మారింది.



ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భారత దేశానికి సంబంధించి ఇప్పటి వరకూ 13 మందికి నోబెల్ పురస్కారం లభించింది. అయితే, భారత పౌరసత్వంతో, భారత్‌లోనే ఉంటూ నోబెల్‌ను పొందిన వారు రవీంద్రనాథ్ ఠాగూర్ (సాహిత్యం, 1913), సివి రామన్ (భౌతికశాస్త్రం, 1930), మదర్ థెరిసా (శాంతి, 1979), అమర్త్య సేన్ (ఆర్థిక శాస్త్రం, 1998), కైలాష్ సత్యార్థి (శాంతి, 2014) మాత్రమే. కాగా, హర్ గోవింద్ ఖోరానా (మెడిసిన్, 1968), సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ (భౌతిక శాస్త్రం, 1983), వెంకట్రామన్ రామకృష్ణన్ (రసాయన శాస్త్రం, 2009), అభిజిత్ బెనర్జీ (ఆర్థిక శాస్త్రం, 2019) విదేశాల్లో స్థిరపడిన భారత మూలాలు ఉన్న వ్యక్తులు. వీరితోపాటు, భారత్‌తో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉన్నవారిలో రొనాల్డ్ రోస్ (వైద్యరంగం, 1902), రుడ్యాండ్ కిప్లింగ్ (సాహిత్యం, 1907), 14వ దలైలామా (శాంతి, 1989), విఎస్ నైపాల్ (సాహిత్యం, 2001) కూడా నోబెల్ అందుకున్నారు.

ఈ వారం కవితలు

## బ్రతుకు బహిరంగ రహస్యం!

బ్రతుకుతాయి జీవులు తావులలో
బ్రతుకుతాయి ఏదో ఒక ఆదేరువులో
బ్రతుకుకు బ్రతుకు ఒక క్రతువు
బ్రతుకు బ్రతుకుది ఓ తెరువు !

తెరువు అది అవసరాల దరువు
దరువు తెరువులే బ్రతుకు పరువు

దారి తెన్ను లేని బ్రతుకు బరువు
పరువు బరువు దరువుల బ్రతుకు పరుగు!

బ్రతుకు బ్రతుకు ఒక విచిత్రం
రంగస్థలంపై ఆడే నీడల చిత్రం
చిత్రం ఓ చిత్రాతి విచిత్రం
చిత్రమైన బ్రతుకు నిత్య కొత్త చిత్రం!

బ్రతుకు నిత్య కొత్త సమరం
బ్రతుకు బాధ్యతలు నిరంతరం
తపనులతో సాగు బ్రతుకు తరంతరం
పట్టుదల పెట్టుబడే కలల సాకారం!
బ్రతుకు పరిమళ పథ లాస్యం
పండిన బ్రతుకుల హాస్యం
బ్రతుకుదెరువు చెప్పలేని జోశ్యం

బ్రతుకు కనిపించని బహిరంగ రహస్యం!

**— బక్కారెడ్డి పట్లోళ్ల**

## కోరిక

అలసిసొలసిన వేళ
ఒక్కోసారి అనిపిస్తుంది....
కాలం వెనక్కొస్తే బాగుండునని,
గడచిన అనుభూతులను
తిరిగి పొందడానికి.

శిశువునైతే బాగుండుననుకుంటున్నా,
అమ్మ ఒడిలో మళ్లీ ఆడుకోడానికి.

బాలుడనై స్కూలుకెళ్లాలనుకుంటున్నా,
చిన్ననాటి స్నేహితులతో
సంతోషంగా గడపడానికి.

కాలేజీకి వెళ్లే
విద్యార్థినైతే ఎంతబావుంటుందో!
నా స్థాయి తెలుసుకోడానికి.

అనుకుంటున్నాను నాటి
నూతనోద్యోగిగా మారాలని,
తొలి జీతం తీసుకున్న ఆనందక్షణాలు
తిరిగిపొందడానికి.

నాటి... వరుడ్నై బాగుంటుంది
యవ్వనానుభూతులను తిరిగి
ఆస్వాదించడానికి.

నా బిడ్డ ఇంకా చిన్నవాడిగా ఉంటే
ఎంత బాగుండునో!
ఇంకా ఎక్కువ కాలం వాడితో గడపొచ్చుగా.

మరింతకాలం బతకాలనిపిస్తోంది,
సమాజానికి ఇంకా ఏమివ్వగలనో
తెలుసుకోడానికి.

మిత్రులారా!
ప్రవహించే నదిలో నీళ్ల వెనక్కిరానట్లే
గడచిన కాలమూ తిరిగిరాదని గుర్తెరిగి,
ప్రతి క్షణాన్నీ మధురానుభూతులను
మిగిల్చేదిగా మలచుకుందామా మరి!

**— వేమూరి శ్రీనివాస్**

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 106 | సోమవారం | 06-10-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


మహిళల వన్డే ప్రపంచకప్

## పాకిస్తాన్‌ను చిత్తుచేసిన భారత్

88 పరుగుల తేడాతో గెలుపొందిన ఇండియా

భారత్‌కు రెండో వరుస విజయం 09



## ఇవిఎంలో అభ్యర్థుల కలర్ ఫొటోలు

ఈసారి నుంచే దేశవ్యాప్తంగా పెద్ద సీరియల్ నెంబర్ ఫాంట్లు

బిహార్ ఎన్నికల్లో అనేక కొత్త కార్యక్రమాలు : సిఇసి



## బిహార్ సిఎం నితీశ్ మానసిక ఆరోగ్యంపై సందేహాలు

ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్

## దగ్గు మందుతో చిన్నారుల మృతి.. మధ్యప్రదేశ్ వైద్యుడి అరెస్టు

05




## ఉద్యమ గుమ్మం నుంచి
# రణనినాదం

- ప్రజాస్వామ్య పరిరక్షణకు పునరంకితం
- చరిత్రలో నిలిచిపోయేలా శత వసంత ముగింపు సభ
- దేశ భక్తులుగా చెలామణి అవుతున్న దేశ ద్రోహులు

**సిపిఐ శత వసంత బహిరంగ సభ ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశంలో వక్తలు**

ప్రజాపక్షం/ ఖమ్మం

ఉద్యమ గుమ్మం నుంచి రణ నినాదంతో పునరుత్తేజంతో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి జరగాలని సిపిఐ జాతీయ నాయకులు పిలుపునిచ్చారు. రానున్న కాలం కమ్యూనిస్టులదేనని కమ్యూనిస్టులు లేని వ్యవస్థ మనజాలదని విస్తరణకు పునరంకితం కావడమే మనముందున్న కర్తవ్యమని వక్తలు పేర్కొన్నారు. సిపిఐ శత వసంతాల ముగింపు సభ డిసెంబర్ 26న జరగనున్న నేపథ్యంలో సన్నాహక సమావేశం ఆదివారం ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా॥ కె. నారాయణ మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో ఖమ్మంకు ఒక ప్రత్యేక స్థానం తరువాయి 12లో



స్థానిక సంస్థల ఎన్నికల్లో

# గెలుపే లక్ష్యం

## అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపకల్పన చేసి పనిచేయాలి

- సిపిఐ శ్రేణులకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజల్లోకి పార్టీని తీసుకువెళ్లాలని సూచన
- బిసి రిజర్వేషన్లపై బిజెపి దొంగాట ఆడుతుందని మండిపాటు




ప్రజాపక్షం/ ఖమ్మం

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి అందుకనుగుణంగా పని చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం ఆదివారం ఖమ్మం సరిగమ ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం జిల్లా సిపిఐ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కూనంనేని కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర, జాతీయ మహాసభల నిర్ణయాలను వెల్లడించిన కూనంనేని స్థానిక పరిస్థితులకనుగుణంగా ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్లాలని సైద్ధాంతిక పార్టీ భావజాల ప్రచారం జరగాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. బిజెపి బిసి రిజర్వేషన్ల విషయంలో దొంగాట ఆడుతుందని కూనంనేని ఆరోపించారు. బిసి రిజర్వేషన్ల పట్ల రాజకీయ పార్టీలు ద్వంద్వ విధానాన్ని అవలంబిస్తున్నాయన్నారు. పార్టీ శత సంవత్సర ముగింపు చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, జాతీయ నాయకులు అజీజ్ పాషా, చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు టి. శ్రీనివాసరావు, ఇటి నర్సింహా, ఎంఎల్‌సి నెల్లకంటి సత్యం, బాగం హేమంతరావు తదితరులు పాల్గొన్నారు. దేశంలో ఈ ఏడాది చివరిలో వచ్చే ఏడాది మొదటి త్రైమాసంలో పలు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగనున్నాయని ఎన్నికల్లో లబ్ది కోసమే బిజెపి ఎన్నికల బొనాంజ పేరుతో ఆర్థిక లబ్ది చేకూరుస్తుందని తరువాయి 12లో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌పై

# బలమైన వాదనలు వినిపిద్దాం



- సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున గట్టిగా వాదనలు వినిపించాలని మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- తగిన సమాచారం మంత్రులకు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశం
- సుప్రీంకోర్టులో బిసి రిజర్వేషన్లపై విచారణ నేపథ్యంలో ఢిల్లీ వెళ్లిన ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొన్నం, వాకిటి తదితరులు

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు (జిఓ) ఇచ్చిన నేపథ్యంలో సుప్రీంకోర్టులో బిసిల రిజర్వేషన్లపై పిటిషన్ దాఖలు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించడానికి సిద్ధమైంది. సుప్రీంకోర్టులో ప్రభుత్వ వాదనలను గట్టిగా వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత మంత్రులకు సూచించారు. ఈ మేరకు తగిన సమాచారాన్ని మంత్రులకు అందుబాటులో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు. కోర్టులో వ్యవహరించాల్సిన అంశాలపై న్యాయ కోవిదులతో సలహాలు, సూచనలు స్వీకరించి ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించేలా కార్యాచరణను రూపొందించేందుకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఆదివారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు వారు న్యాయవాదులకు అవసరమైన సూచనలు, సమాచారాన్ని ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తరువాయి 6లో



## జూబ్లీహిల్స్‌పై కాంగ్రెస్‌లో కాక

టికెట్ ఎవరిని వరిస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి ఎంపికలో కాంగ్రెస్‌లో కాక పుట్టిస్తుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికే కాంగ్రెస్ సవాల్‌గా మారిందని పార్టీలో ప్రచారం జరుగుతోంది. దీంతో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ ఎవరిని వరిస్తుందనేది సర్వత్రా ఆసక్తి రేపుతోంది. ఆశావాహుల జాబితా పెరిగిపోవడంతో పార్టీ పరిశీలకులు అభ్యర్థి ఎంపిపై గత కొన్ని రోజులుగా తర్జనబర్జన పడుతున్నారు. అభ్యర్థి ఎంపికపై తరువాయి 6లో

డార్జిలింగ్‌లో

# భయోత్పాతం



- భారీ వర్షాలకు విరిగిపడిన కొండచరియలు
- 20 మంది మృతి, మరికొంత మందికి గాయాలు
- కొట్టుకుపోయిన ఇళ్లు, దెబ్బతిన్న రోడ్లు
- మారుమూల గ్రామాలకు నిలిచిన రాకపోకలు



**డార్జిలింగ్ :** పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర భాగంలో ఆదివారం భారీ వర్షాలు భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. మిరిక్, డార్జిలింగ్‌హిల్స్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో అనేకమంది చిన్నారులు సహా 20 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. వరదలకు పలు ఇళ్లు కొట్టుకుపోయాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని వారు చెప్పారు. సర్సాలి, జస్బిర్గావ్, మిరిక్ బస్తీ, ధార్ గావ్ (మేచి), నాగరకత, మిరిక్ సరస్సు ప్రాంతం వంటి అనేక ప్రదేశాలో మరణాలు సంభవించినట్లు ఎన్‌డిఆర్ఆఫ్, జిల్లా అధికార యంత్రాంగం నివేదించాయి. కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలోని మిరిక్‌లో కనీసం 11 మంది మరణించారని, గాయపడిన ఏడుగురిని రక్షించామని ఎన్‌డిఆర్‌ఎఫ్ ఒక ప్రకటన తెలిపింది. డార్జిలింగ్ జిలా, ఉత్తర సిక్కింలో రోడ్డు కనెక్టివిటీ తీవ్రంగా దెబ్బతిన్నదని, సిలిగురిని మిరిక్–డార్జిలింగ్ మార్గంతో కలిపే ఇనుప వంతెన కూప్పకూలగా, ఈ ప్రాంతానికి రాకపోకలు తెగిపోయాయని తరువాయి 6లో

## నేపాల్‌లో వరద విలయం

- 51 మంది మృతి
- ప్రమాదస్థాయి దాటి ప్రవహిస్తున్న ఎనిమిది నదులు

**ఖాట్మండు:** రెండు రోజులుగా భారీ వర్షాలు, వరద బీభత్సం నేపాల్‌ను అతలాకుతలం చేశాయి. ఈ వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ఆకస్మిక వరదలు, సంబంధిత ఇతర ప్రమాదాల్లో దేశవ్యాప్తంగా మొత్తం 51 మంది మరణించారు. శనివారంనాడు విమానాల రాకపోకలను రద్దుచేశారు. ప్రధాన జాతీయ రహదారులపై కొండచరియలు విరిగిపడటంతో త్రిభువన్ విమానాశ్రయం నుండి ఆదివారం 140 దేశీయ విమానాల రాకపోకలను తరువాయి 6లో

## మూడు రోజులు భారీ వర్షాలు

నేడు పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు

పలు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీచేసిన వాతావరణ కేంద్రం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకావం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఆదివారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం తరువాయి 6లో

## తిరుగుప్రయాణం నరకప్రాయం



దసరా సెలవులు ముగియడంతో పల్లెల నుంచి హైదరాబాద్‌కు తిరిగివస్తున్న ప్రజలు

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహన రద్దీ

**హైదరాబాద్ :** బతుకమ్మ, దసరా పండుగలు ముగియడంతో సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. సెలవులు ముగియడంతో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహన రద్దీ నెలకొంది. పల్లెల నుంచి నగరాల వైపు ప్రజలు తిరిగి వెళ్లడం ప్రారంభించడంతో రద్దీ ఏర్పడింది. కార్లు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి రావడంతో చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరాయి. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఎపి, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి హైదరాబాద్‌కు వస్తుండటంతో ఆదివారం, సోమవారం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సేవలు అందిస్తుంది. బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి హైదరాబాద్ చేరే క్రమంలో వారికి ఎలాంటి తరువాయి 6లో

సంపద కేంద్రీకరణకు

# మోదీ సర్కార్ ప్రోత్సాహం

**ఈ చర్య ప్రజాస్వామ్య ఆత్మపై ప్రత్యక్ష దాడి : కాంగ్రెస్ తీవ్ర విమర్శ**



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతుందని కాంగ్రెస్ ఆరోపించింది. ఇది కేవలం ఆర్థిక వ్యవస్థకు సమస్య మాత్రమే కాదని, ప్రజాస్వామ్య ఆత్మపైనే ప్రత్యక్ష దాడి అని పేర్కొంది. భారతదేశం ఇప్పుడు బిలియనీర్ల నూతన హబ్‌గా మారుతోందని, దేశంలో ధనవంతుల సంఖ్య సంవత్సరం సంవత్సరానికి వేగంగా పెరుగుతోందని పేర్కొన్న మీడియా నివేదికను కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ ఎక్స్‌లో పంచుకున్నారు. భారతదేశంలో విస్తృతమైన సంపద కేంద్రీకరణ గురించి ఒకదాని తర్వాత ఒకటి నివేదికలు హెచ్చరిస్తున్నాయని, లక్షలాది మంది భారతీయులు రోజువారీ అవసరాలను తీర్చడానికి కష్టపడుతున్నప్పటికీ, కేవలం 1,687 మంది మాత్రమే దేశ సంపదలో సగం కలిగి ఉన్నారని జైరామ్ రమేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఈ భారీ సంపద కేంద్రీకరణ మన దేశంలో భారీ తరువాయి 6లో



# జనరల్
STATE & REGIONAL NEWS

## బస్సు చార్జీల కనీస ధరను రూ.10లు పెంచడం దుర్మార్గం : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జంట నగరాల్లో ఆర్‌టిసి బస్సు కనీస ఛార్జీలను రూ.10లు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దుర్మార్గమని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నిందనిఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతున్న తరుణంలో ఈ ఛార్జీల పెంపు పిడుగులాంటిదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జంటనగరాల్లో కాంగ్రెస్ పార్టీని పూర్తిగా తిరస్కరించారనే కసితోనే రేవంత్ రెడ్డి ఈ ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తుస్సుమన్న ఉచిత బస్సు పథకంతో ఆర్‌టిసి సంస్థను దివాళా తీయించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రయాణికుల నడ్డి విరచాలని చూడటం క్షమించరానిదని తెలిపారు.



## ‘మైనారిటీల విద్యారంగం’లో విప్లవాత్మక మార్పులు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మైనారిటీల విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రతి ముస్లిం మైనారిటీ విద్యార్థి కూడా ఉన్నత స్థాయిలో నిలవాలని ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌తో కలిసి లక్ష్మణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాల తెలంగాణ మైనారిటీల విద్యా పునరుజ్జీవనంలో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. విద్య అనేది సామాజిక. సమానత్వానికి, ఆర్థిక స్వావలంబనకు ప్రధాన శక్తిగా ఉంటుందన్నారు. మైనారిటీ విద్యార్థులు కూడా ఐఐటి, ఎన్‌ఐటి, ఎఐఐఎంఎస్ వంటి సంస్థల్లో స్థానం సంపాదించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని అన్నారు. ఈ దిశగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ) ఏర్పాటు ద్వారా మైనారిటీలకు కూడా అందరితో సమాన స్థాయిలో పోటీపడే విధంగా శిక్షణ అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు 205కు పెరిగి, దాదాపు 1.33 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పుడు చదువుకుంటున్నారని వివరించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మైనారిటీ విద్యాలయాల్లో సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి పేద మైనార్టీ కుటుంబాల పిల్లలలో ఉన్న ప్రతిభను గుర్తించి సరైన దిశలో మలచడమే తమ ప్రత్యేకత అని అన్నారు. ప్రొఫెషనల్ కోర్సులలో మైనారిటీ విద్యార్థుల ప్రవేశం గతంతో పోలిస్తే 22 శాతం పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయని చెప్పారు.




## బస్సుచార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలి : రూప్ సింగ్ నాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సిటీ బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్‌సింగ్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, బస్సుల సంఖ్యను గణనీయంగా తగ్గించి, బస్సు ప్రయాణాన్ని ఇబ్బందికరంగా మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జాగృతి నాయకులు శ్రీకాంత్ రావు, శివారెడ్డి, పాండురంగారెడ్డి, సత్యనారాయణ, జితేందర్, రవి రాథోడ్, పాలె నిష తదితరులు పాల్గొన్నారు.

### ‘పిజి వైద్యవిద్య’ మేనేజ్‌మెంట్ కోటాలో..

## 85 శాతం స్థానిక రిజర్వేషన్లు అమలు చేయండి

సిఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పిజి వైద్య విద్యా ప్రవేశాల్లో రిజర్వేషన్ లేకపోవడంతో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, తక్షణమే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానిక రిజర్వేషన్‌ను అమలు చేయాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం విడుదల చేసిన పిజి ప్రవేశాల నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని, కొత్త జిఒను జారీ చేసి, తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను రక్షించే విధంగా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని కోరారు. ఈ మేరకు హరీశ్‌రావు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పిజి సీట్లు ఉన్నాయని, వీటిలో 50 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద వెళ్తాయని, మిగిలిన 50 శాతం రాష్ట్ర కోటాలో ఉండే సీట్లలో 25 శాతం (సుమారు 450 సీట్లు) మేనేజ్‌మెంట్ కోటాగా ఉంటాయని వివరించారు. ఈ సీట్లలో స్థానిక రిజర్వేషన్ అమలు చేయకపోవడంతో మొత్తం సీట్లు ఆల్ ఇండియా విద్యార్థులకు వెళ్ళిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపిలో ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానిక విద్యార్థులకే రిజర్వేషన్ కల్పిస్తూ, కేవలం 15 శాతం సీట్లు మాత్రమే నాన్ లోకల్ విద్యార్థులకు కేటాయించిందని పేర్కొన్నారు. తెలంగాణ వైద్య విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే మొద్దు నిద్ర విడాలని, వెంటనే తగిన చర్యలు చేపట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ఆర్‌టిసి ఛార్జీల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి

సిపిఐ(ఎం) డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్, సికింద్రాబాదు జంట నగరాలలో ఆర్‌టిసి బస్సు చార్జీల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మొదటి మూడు స్టేజీలకు రూ.5 లు, నాలుగవ స్టేజీకి రూ.10ల చొప్పున పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించింది. కొత్త డిపోలు, కొత్త ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటుకు రూ.392 కోట్లు ఖర్చు అవుతుందని, ఈ ఛార్జీలను పెంచుతున్నట్లు, అందుకు ప్రజలు సహకరించాలని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమని సిపిఐ(ఎం) పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాదులో ఎలక్ట్రికల్ బస్సు చార్జీలను, బస్సు పాస్ చార్జీలను భారీగా పెంచిందని, అలాగే పండగల పేరుతో ప్రజల నుండి 50 శాతం ప్రత్యేక చార్జీలు వసూలు చేస్తూనే ఉన్నారని , . మౌలిక సదుపాయాలకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా ప్రజలపై మరోసారి అదనంగా భారాలు వేయడం సమంజసం కాదని తెలిపింది. ఆర్‌టిసికార్గో సర్వీసులను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తున్నట్లు వార్తలొస్తున్నాయని ఆలాంటి ప్రయత్నాలను విరమించుకొని కార్గోసేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తేవాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని సిపిఐ(ఎం) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

# ‘కూటమి –2028’ ఆపరేషన్

అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యం

హైదరాబాద్‌లో తిష్ట వేసిన 40 మంది ఎపి నిఘా అధికారులు

మాజీ టిడిపి, ఆయా పార్టీల్లో నారాజ్ నేతలతో మంతనాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఎపిలోని కూటమి ప్రభుత్వం పావులు కదులుపుతుంది. ‘కూటమి–2028’ ఆపరేషన్‌లో భాగంగా ఎపి ఇంటెలిజెన్స్ అధికారులను రంగంలోకి దించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందు కోసం 40 మంది ఎపి ఇంటెలిజెన్స్ అధికారులు హైదరాబాద్‌లో మకాం వేసినట్లు సమాచారం. వీరిలో ఐదుగురు సిఐ స్థాయి అధికారుల కాగా ఏడుగురు ఎస్‌ఐ స్థాయి అధికారులతో పాటు హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరంతా ఉమ్మండి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ జిల్లాలో పట్టుకలిగిన అధికారులేనని తెలుస్తుంది. వీరైతేనే ఇక్కడి రాజకీయ పార్టీల నేతలతో పాటు అసెంబ్లీ, పార్లమెంట్, జిల్లా, మండల నేతలతో గతంలో ఉన్న సంబంధాల అనుభవాల నేపథ్యం ఇప్పుడు ఉపయోగించుకోవాలని ఎపి కూటమి ప్రభుత్వం భావించినట్లు తెలిసింది. 2028లో తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేనా కలిసి పోటీ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఈ మూడు పార్టీల కూటమికి తెలంగాణలో కలిసొచ్చే అంశాలను నిర్ధారించడంపై నిఘా వర్గాలు దృష్టి సారించాయి. దీంతో పాటు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ప్రభుత్వంలో ఒక ఊపు ఊపిన తెలంగాణలోని టిడిపి మాజీ మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ఛైర్మన్‌లు, జెడ్‌పిసి, మండల పరిషత్ సభ్యుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. వీరి వ్యక్తిగత బలాలు, బలహీనతలపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. దీంతో పాటు ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎపి బిజెపి మంత్రులు హైదరాబాద్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఈ సమయంలో నిఘా వర్గాలు ఇచ్చిన నివేధిక ప్రకారం తెలంగాణ నేతలతో సంప్రదింపులు కూడా జరుపుతున్నట్లు తెలిసింది. గతంలో ఏఏ నియోజక వర్గాల్లో టిడిపి బలం ఉందో ఆ నియోజక వర్గాల్లో ప్రస్తుతం పార్టీ పరిస్థితులను నిఘా వర్గాలు క్షుణ్ణంగా విశ్లేసిస్తున్నాయి. అయితే ప్రస్తుతం తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో చాపకింద నీరులా పనిచేయాలని కూటిమి నేతలు ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి బి ఫారమ్ లభించని నేతలకు గాలం వేయాలనే ఆలోచన కూడా ఉంది. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలో ఎపి ఇంటెలిజెన్స్ అధికారులు ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిసింది. ఇక్కడ సుమారు 24 అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండడం, ఈ నియోజక వర్గాల్లో బిజెపి, టిడిపికి మంచి పట్టు ఉండడం, ఆ పార్టీల అధినేతల సామాజిక వర్గానికి చెందిన ప్రజలకు కూడా ఎక్కువగానే ఉన్నారు. దీంతో పాటు పవన్ కళ్యాణ్ అభిమానులు కూడా ఉండడం భవిష్యత్తులో కూటమి బలం పుంజుకోవడానికి ఉపయోగపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలోని 119 నియోజక వర్గాల్లో కూటమి నేతల జాబితాతో పాటు ఇతర రాజకీయ పార్టీల్లో నిరాశతో ఉన్న నేతల జాబితాపై ఎపి నిఘా వర్గాలు దృష్టి సారించాయి. పొరుగు రాష్ట్రంలో ఇంటెలిన్స్ అధికారులు ఇంత పెద్ద సంఖ్యలో ఉండడం ఎపి నిఘా వర్గాలకే దక్కింది. పొరుగు రాష్ట్రాల్లో నిఘా పెడతారు అయితే వారానికో పక్షం రోజులకో ఒక సారి నిఘా అధికారులు పర్యటించి వెళ్లిపోవడం సహజం. అయితే ఎపి నిఘా అధికారులు మాత్రం ఏకంగా 40 వరకు ఇక్కడే తిష్ట వేయడంపై విస్మయం వ్యక్తం అవుతుంది.



## కార్మికుల హక్కుల రక్షణకు పోరాటాలు నిర్మించాలి

ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రధాని మోదీ ప్రభుత్వం అంబాని, అదాని వంటి కార్పొరేట్ గ్రూప్‌లకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల ప్రయోజనాలను, హక్కుల రక్షణ కోసం అప్పటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బలమైన పోరాటాలు నిర్మించాలని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవ రెడ్డి పిలుపునిచ్చారు. ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి ట్రేడ్ యూనియన్స్ జెఎసి చైర్మన్ మొగుళ్ళ రాజిరెడ్డి నేతృత్వంలో నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జెఎసి స్టీరింగ్ కమిటీ సభ్యులు టిజెఈయు ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, అల్లి శ్రవాన్ కుమార్, ఎండి.జహంగీర్, ఈ.చంద్రశేఖర్ తదితరులు హైదరాబాద్ బర్కత్‌పురలోని డాక్టర్ జి.సంజీవ రెడ్డి నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సన్మానించి, దసరా శుభాకాంక్షలు తెలిపారు. జలమండలిలో ఇటీవల జరుగుతున్నటువంటి పరిణామాలు, గుర్తింపు సంఘం ఎన్నికలు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అనేక కార్మికుల సమస్యలను డాక్టర్ సంజీవ రెడ్డి దృష్టికి మొగుళ్ళ రాజిరెడ్డి తీసుకెళ్లారు. జలమండలి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానని డాక్టర్ సంజీవ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# పత్తి కొనుగోళ్లపై నేడు కీలక సమావేశం

రాష్ట్ర సచివాలయంలో సిసిఐ సిఎండి, జినింగ్ మిల్లర్లుతో సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పత్తికొనుగోళ్లకు సంబంధించి నెలకొన్న ప్రతిస్థంభనకు నేడు స్పష్టత రానుంది. ఇందుకు సంబంధించి సోమవారం (నేడు) రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు కీలక సమావేశం జరగనుంది. పత్తికొనుగోళ్లకు గాను సిసిఐ కాటన్ కార్పొరేషన్ ఇండియా విడుదల చేసిన లింట్ పర్సంటేజ్ L1 స్లాట్ బుకింగ్ ఏరియా మ్యాపింగ్ అంశంలో మార్పుల చేర్పులకారణంగా రాష్ట్రంలో ఉన్న 341 జిన్నింగ్ మిల్లులు ఇప్పటి వరకు టెండరు ప్రక్రియలో పాల్గొన్నలేదు.. దీంతో రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లకు సంబంధించి ప్రతిస్థంభన కొనసాగుతోంది. దీంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇప్పటికే కేంద్ర అధికారులతో పాటు సిసిఐ సిఎండితో సమావేశమై ఈ అంశంలో కొంత వెసులుబాటు కల్పించాల్సిందిగా కోరారు.

దీంతో ఈ ఏడాది కొత్తగా తీసుకువచ్చిన నిబంధనలలో ఒకటి,రెండు నిబంధనల్లో కొంతమేర సడలింపులు ఉంటాయని, మిగతావన్నీ యధాతథంగా అమలు చేయస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సిసిఐ సిఎండితో పాటు జినింగ్ మిల్లర్లతో రాష్ట్ర సచివాలయంలో సోమవారం సమావేశం కానున్నారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఈ సమావేశంలో స్పష్టత రానుంది. సిసిఐ రాష్ట్రంలో ఎప్పటి నుంచి పత్తి కొనుగోలు చేయనుందో కూడ తేలనుంది. మద్దతు ధరకే పత్తి కొనుగోలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో పత్తి రైతులకు ఎవరూ అన్యాయం చేయాలని చూసిన ఉపేక్షించబోమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

## బస్సు ఎక్కడమే పాపమా : కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి బస్ చార్జీలను అమాంతం పెంచేశారని,బస్సు ఎక్కడమే పాపం అన్నట్టుగా ప్రజల జేబులను గుల్ల చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. గ్రీన్ జర్నీ పేరుతో సామాన్యుల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నారని ఆమె ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. సామాన్య ప్రజలంటే ఎందుకింత కోపం అంటూ సిఎంను ప్రశ్నించారు. ఇది వరకే సిటీ బస్‌పాస్‌ల ధరలు భారీగా పెంచి చిరుద్యోగులు, నగర ప్రజలపై పెనుభారం మోపారని పేర్కొన్నారు.

# తోట వెంకటమ్మ మృతికి సిపిఐ నాయకుల నివాళులు



**ప్రజాపక్షం/పరకాల :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజెఐజెయు) హనుమకొండ జిల్లా కార్యదర్శి, ప్రజాపక్షం హనుమకొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ తోట సుధాకర్ మాతృమూర్తి తోట వెంకటమ్మ అనారోగ్యం కారణంగా ఆదివారం మృతిచెందారు. నడికుడ మండలం చౌటపర్తి గ్రామానికి చెందిన తోట వెంకటమ్మ భౌతిక కాయాన్ని సిపిఐ, బిఆర్‌ఎస్ నాయకులు ఆదివారం సందర్శించి నివాళులు అర్పించారు. వెంకటమ్మ భౌతిక కాయంపై ఎర్ర వస్త్రం కప్పి నివాళులర్పించారు. శాంతి సంఘీభావ సంఘ రాష్ట్ర నాయకులు మేడిపల్లి శోభన్ బాబు, నేదునూరి శ్రీహరి, నాగవరపు శ్రీధర్, మెతుకు శ్రీనివాస్, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చందు, సిపిఐ జిల్లా నాయకులు బుస్సా రవీందర్, నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, జర్నలిస్టు సంఘ నాయకులు, చౌటుపర్తి గ్రామ స్థులు పలువురు తోట వెంకటమ్మ మరణం పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. వెంకటమ్మ కుమారులు తోట సాంబయ్య, తోట బాబురావు, తోట మల్లయ్య, తోట లక్ష్మయ్య, తోట సుధాకర్ లను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.





## మేఘా ఎండి కృష్ణారెడ్డికి మాతృవియోగం

### పురిటిపాటి విజయలక్ష్మికి ప్రముఖుల నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.కృష్ణా రెడ్డి మాతృమూర్తి పురిటిపాటి విజయలక్ష్మి (76) ఆదివారం కన్నుమూశారు. పురిటిపాటి విజయలక్ష్మి, పురిటిపాటి వీరారెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు కృష్ణా రెడ్డి, సుబ్బా రెడ్డి, ఒక కుమార్తె పి.ప్రసన్న కుమారి ఉన్నారు.

విజయలక్ష్మి అంత్యక్రియలు ఆదివారం కృష్ణా జిల్లా దోకిపర్రులో జరిగాయి. వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు విజయలక్ష్మి అంత్యక్రియలలో పాల్గొని నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి కొట్టు రవీంద్ర, ఎంపి సిఎం.రమేష్, ఎంఎల్‌ఎ రాము, ఎపి రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారులు డాక్టర్ కెవిపి.రామచంద్ర రావు, మాజీ ఎంఎల్‌ఎ వంశీ, కోడాలి నాని తదితరులు విజయలక్ష్మి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు.

# ఆగని పోలీసు ఆత్మహత్యలు

రాష్ట్రంలో ఏటా 15-25 మంది

హైదరాబాద్,రంగారెడ్డి, వరంగల్,ఖమ్మం,మహబూబ్ నగర్, నల్గొండలోనే ఎక్కువ

డ్యూటీ షెడ్యూల్‌ను హ్యూమన్ ఫ్రెండ్లీగా మారిస్తే సత్ఫలితాలు

(బి.వాసుదేవరాజు)

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర పోలీస్ శాఖలో ఆత్మహత్యల ఘటనలు ఆందోళన కలిగించే స్థాయిలో చోటు చేసుకుంటున్నాయి. ఈ పదేళ్లలో 175 నుంచి 200 మంది వివిధ కారణాల వల్ల విధినిర్వహణలో ఉన్న పోలీసులు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. శాంతి భద్రతల కోసం 24 గంటలూ డ్యూటీలో ఉంటూ ప్రజల రక్షణలో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది వ్యక్తిగత, మానసిక, ఉద్యోగ సంబంధ ఒత్తిడులతో చివరికి తమ ప్రాణాలపై చేయి వేసుకోవడం సమాజానికి మెలకువ కలిగించే విషయం. పోలీసులు ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తారు. కానీ వారి అంతరంగంలో నడిచే మానసిక పోరాటాలను సమాజం గమనించదు. తెలంగాణలో చోటుచేసుకుంటున్న పోలీసుల ఆత్మహత్యలు ఒక అలారమ్ బెల్ లాంటివి. పోలీసు వ్యవస్థలో మానసిక ఆరోగ్యం ప్రాధాన్యత పొందేలా చర్యలు తీసుకోవడమే దీర్ఘకాలిక పరిష్కారం అవుతుంది.2014 – 2024 మధ్య సగటు అంచనా ప్రతి సంవత్సరం 15 నంచి 25 మంది వరకు తెలంగాణలో పోలీసులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు వివిధ నివేదికలు చెబుతున్నాయి.



వీరిలో ఎక్కువ శాతం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ స్థాయి సిబ్బందే. వయస్సు పరంగా చూస్తే 25–40 ఏళ్ల వయసు గల యువ సిబ్బంది ఎక్కువగా ఈ ఘటనలకు పాల్పడుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో ఎక్కువ కేసులు నమోదయ్యాయి.202124 మధ్య కాలంలో సిఆర్‌పిఎఫ్‌లో దేశ వ్యాప్తంగా 181 మంది ఉద్యోగులు ఆత్మహత్యకు పాల్పడ్డారని గణాంకాలు తెలియజేస్తున్నాయి.ఇందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్, బీహార్, హార్యనా, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్నాయి. అన్ని పోలీసు విభాగాల కంటే సిఆర్‌పిఎఫ్‌లోనే ఆత్మహత్యలు పెరుగుతున్నాయి.డ్యూటీ షెడ్యూల్ ను హ్యూమన్ ఫ్రెండ్లీగా మార్చినట్లయితే మంచి ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు.

### చోటుచేసుకున్న కొన్ని ఘటనలు..

నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో కానిస్టేబుల్ తేజావత్ రాజు (30) ప్రేమ వ్యవహార సమస్యలతో డిప్రెషన్లోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెళ్లి విషయంలో కుటుంబ ఒత్తిడి ప్రధాన కారణం.

కామారెడ్డిలో డిసెంబర్ 26, 2024లో ఎస్‌ఐ సాయికుమార్, కానిస్టేబుల్ శృతి, ఆపరేటర్ నిఖిల్ ముగ్గురు కలిసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

**సంఘటన : 2024, కామారెడ్డి**

> మీర్పేట్ పోలీసు స్టేషన్‌లో ఈ ఏడాది మనీషా అనే మహిళా కానిస్టేబుల్, కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. భర్త వేధింపుల నేపథ్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

> రంగారెడ్డి జిల్లాలో ఆన్లైన్ గేమ్స్ కారణంగా మానసిక ఒత్తిడితో తుపాకితో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఒక కానిస్టేబుల్.

> పరేటర్ కలిసి ఒక చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

> హస్తినాపూర్‌కు చెందిన ఆకులా దీపిక (38) నాగోల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్, ఆర్థిక ఒత్తిడితో బాధపడుతూ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

> అనారోగ్య కారణాల వల్ల మల్కాజ్‌గిరి స్టేషన్ కానిస్టేబుల్ యాచారంకు చెందిన వినోద్ జూన్ 10, 2023లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

> ములుగు జిల్లాలో డిసెంబర్ 2, 2024లో వాజేడు మండల ఎస్‌ఐ రుద్రారపు హరీష్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారమే కారణమని తెలిసింది.

> సిరిసిల్లా జిల్లా 17వ బెటాలియన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ బండారి బాలకృష్ణ (34) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

> కొల్చారం పోలీసు స్టేషన్‌కు చెందిన సాయికుమార్ (50) గత ఏడాది డిసెంబర్ 30న ఆత్మ హత్యకు పాల్పడ్డాడు.

### ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు..

డ్యూటీలో పనిఒత్తిడి..దీర్ఘకాలం నిరంతరంగా పని చేయడం, సెలవులు లభించకపోవడం, కుటుంబ సమస్యలు – ఆర్థిక ఇబ్బందులు, గృహ కలహాలు, ఆరోగ్య సమస్యలు – మానసిక ఒత్తిడి, డిప్రెషన్, నిద్రలేమి. సర్వీస్ సంబంధ సమస్యలు – బదిలీలు, పదోన్నతులు ఆలస్యం కావడం, సీనియర్ అధికారి ప్రెజర్, ఆత్మస్థైర్యం లోపం – కౌన్సిలింగ్, మానసిక సహాయం లోపం.

### ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పోలీసు హెల్త్ వెల్ఫేర్ వింగ్ ను బలోపేతం చేసింది. సైకలాజికల్ కౌన్సిలింగ్ సెంటర్లు కొన్ని జిల్లాలలో ఏర్పాటు చేశారు.

ప్రతి సంవత్సరం కనీసం 30 రోజుల సెలవులను ఉపయోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసు సిబ్బందికి స్ట్రెస్ మేనేజ్‌మెంట్, యోగా, మెడిటేషన్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నారు.

### నిపుణుల అభిప్రాయాలు...

ప్రతి పోలీస్ సిబ్బందికి క్రమం తప్పకుండా మానసిక పరీక్షలు జరగాలి అని అంటున్నారు నిపుణులు. డ్యూటీ షెడ్యూల్ ను హ్యూమన్ ఫ్రెండ్లీగా మార్చాల్సిన అవసరం ఉందని కూడా అభిప్రాపడుతున్నారు. వారి వ్యక్తిగత ఇబ్బందులు తెలుసుకుని సహచరులు, అధికారులు మద్దతు ఇవ్వడం చాలా అవసరమని అంటున్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS


## కరూర్ తొక్కిసలాట.. ప్రచారరథం సీజ్..

### డ్రైవర్‌పై కేసు నమోదు

**కరూర్ :** కరూర్ తొక్కిసలాట ఘటనకు ముందు టివికె చీఫ్, నటుడు విజయ్ ప్రచారరథం ఇద్దరు యువకులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆ ప్రచారరథాన్ని సీజ్ చేశారు. ఆ వాహనం నడిపిన డ్రైవర్‌ను విచారిస్తున్నారు. ఇటీవల తమిళనాడులోని కరూర్ జిల్లాలో విజయ్ నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఎందుకంటే ఈ ఘటనలో ఏకంగా 41 మంది మరణించారు. 80 మందికి పైగా గాయపడ్డారు. ఇదిలావుంటే ఈ ఘటనపై దర్యాప్తు కోసం ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలో పోలీసులు మరో కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

## ఇవిఎంలో అభ్యర్థుల కలర్ ఫొటోలు

### ఈసారి నుంచే దేశవ్యాప్తంగా పెద్ద సీరియల్ నెంబర్ ఫాంట్లు
### బిహార్ ఎన్నికల్లో అనేక కొత్త కార్యక్రమాలు : సిఇసి




**పాట్నా :** బిహార్ ఓటర్ల జాబితాను 22 సంవత్సరాల తర్వాత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) శుద్ధి చేసిందని సిఇసి జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికలకు అనేక కొత్త కార్యక్రమాలు చేపడుతున్నామని, వీటిని తగిన సమయంలో దేశవ్యాప్తంగా పునరావృతం చేస్తామన్నారు. ఇవిఎంలపై సీరియల్ నెంబర్ ఫాంట్ పెద్దదిగా, అభ్యర్థుల ఫోటోలు కలర్‌లో ఉంటాయని, ఈ ప్రక్రియ బిహార్ ఎన్నికల నుంచే మొదలవుతోందిని చెప్పారు. ఇవిఎంలలో బ్యాలెట్ పెపర్ ఇన్‌సర్ట్ చేసినప్పుడు ఫోటో బ్లాక్ అండ్ వైట్‌లో ఉంటే గుర్తించడం కష్టమవుతోందని, ఎన్నికల గుర్తుల విషయమూ అంతేనని అన్నారు. ఈసారి నుంచి దేశవ్యాప్తంగా సీరియల్ నెంబర్ ఫాంట్లు పెద్దవిగా ఉండేలా, అభ్యర్థుల ఫోటోలు కలర్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఎన్నికల కమిషన్ చురుకుగా సమావేశాలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో రెండ్రోజుల పర్యటనలో భాగంగా శనివారంనాడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించగా, ఆదివారంనాడు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో పాట్నాలో ఎన్నికల కమిషన్ సమావేశమైంది. స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ పథకంపై సమీక్ష జరిపింది. అనంతరం చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి, సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రతినిధులతో సమావేశమంది. ఆ వెంటనే చీఫ్ సెక్రటరీ, డెరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఇతర బ్యూరోక్రాట్లతో రాష్ట్ర స్థాయిలో సమన్వయంపై సమీక్ష జరిపింది. రాష్ట్ర పర్యటనను ముగించే ముందు పాట్నాలో విలేకరుల సమావేశంలో జ్ఞానేష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమాలలో ఇపిఐసి కార్డులు రిజిస్ట్రేషన్ అయిన 15 రోజుల్లోపు ఓటర్లకు అందజేయబడతాయని, నిర్ధారించుకోవడానికి కొత్త ఎస్‌ఒపి (ప్రామాణిక ఆపరేటింగ్ విధానం), పోలింగ్ బూత్‌లలో మొబైల్ డిపాజిట్ సౌకర్యం ఉన్నాయని చెప్పారు. 243 మంది సభ్యులున్న అసెంబ్లీకి నవంబర్ 22న దాని పదవీ కాలం ముగిసేలోపు ఎన్నికలు పూర్తవుతాయని ఆయన అన్నారు. 243 నియోజకవర్గాల్లో ప్రతి దానికి ఒక ఒక ఇఆర్‌ఒ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) ఉన్నారని, ఎస్‌ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయడంలో వారికి 90,207 మంది బిఎల్‌ఒలు సహాయం చేశారన్నారు. ఇది 22 సంవత్సరాల తర్వాత ఓటర్ల జాబితాను శుద్ధి చేసిందన్నారు. రాష్ట్రంలో చివరిసారిగా ఓటర్ల జాబితా సవరణ 2003లో జరిగిందన్నారు. ఛాత్ పండుగను ఎంత ఉత్సాహంగా జరుపుకుంటామో అంతే ఉత్సాహంతో బిహార్ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియ విజయవంతమైనందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. కాగా, ఎన్నికల కమిషన్‌తో జరిపిన సమావేశంలో బిహార్ ఎన్నికలు ఒకటి లేదా రెండు విడతల్లో పూర్తి చేయాలని వివిధ పార్టీలు కోరారు. ఒకే దశలో ఎన్నికలు నిర్వహించాలని నితీష్ సారథ్యంలోని జనతాదళ్ యునైటెడ్ (జెడియు) కోరగా, జెడియు భాగస్వామ్య పార్టీగా ఉన్న బిజెపి ఒకటి లేదా రెండు దశల్లో ఎన్నికలు జరపాలని సూచించింది. లాలూ ప్రసాద్ యాదవ్ ఆర్‌జెడి ఒకటి లేదా రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సుముఖత తెలిపింది.

## కలైనర్ యూనివర్సిటీ బిల్లు- 2025పై గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ...
## 'సుప్రీం'ను ఆశ్రయించిన తమిళనాడు ప్రభుత్వం

### రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 (సమ్మతి మంజూరు)ను అమలు చేసేలా గవర్నర్‌ను ఆదేశించాలని అప్పీల్





**న్యూఢిల్లీ :** రాష్ట్ర మంత్రివర్గం సూచించిన విధంగా ప్రతిపాదిత చట్టానికి ఆమోదం తెలిపే బదులు కలైనర్ విశ్వవిద్యాలయం బిల్లు 2025ను రాష్ట్రపతి నిర్ణయానికి రిజర్వ్ చేయాలన్న గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్‌చేసింది. గవర్నర్ నిర్ణయాన్ని, దాని ఫలితంగా ఉత్పన్నమయ్యే అన్ని పర్యవసాన చర్యలను 'చట్టవిరుద్ధమైనవి', 'రాజ్యాంగ విరుద్ధమైనవి', 'చెల్లనివి'గా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానం నుంచి ఆదేశాలను అభ్యర్థించింది. మంత్రి మండలి సలహా మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 (సమ్మతి మంజూరు)ను అమలు చేయాలని గవర్నర్‌ను ఆదేశించాలని కూడా తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది.గతంలో రాష్ట్ర శాసనసభ ఆమోదించిన కలైగ్నర్ యూనివర్సిటీ బిల్లు 2025 ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరిశీలన కోసం తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి రిజర్వ్ చేశారు. అరియలూరు, నాగపట్టినం, తంజావూర్, తిరువారుర్ జిల్లాల విద్యార్థుల ఉన్నత విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారతీదాసన్ విశ్వవిద్యాలయాన్ని విభజించడం ద్వారా కుంబకోణంలోని కలైనర్ యూనివర్సిటీ ఏర్పాటు బిల్లును ప్రతిపాదించింది. దీనికి దివంగత మాజీ ముఖ్యమంత్రి, ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) వ్యవస్థాపకులు ఎం. కరుణానిధి పేరు పెట్టారు. ఆయన ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తండ్రి. ఆమోదం పొందిన తర్వాత దాని మొట్టమొదటి వైస్‌చాన్సలర్‌గా స్టాలిన్ వ్యవహరిస్తారు. ఈ బిల్లు రాష్ట్రపతికి సూచించిన రెండింటిలో ఒకటి. రెండవది తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ మరియు స్పోర్ట్ యూనివర్సిటీ చట్టానికి సంబంధించినది. ఈ చట్టాన్ని సవరించి రాష్ట్ర ప్రభుత్వానికి స్పోర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను నియమించే అధికారం కల్పించాలని చూస్తున్నదని ఒక అధికారి తెలిపారు. ఈ రెండు బిల్లులను ఏప్రిల్‌లో అసెంబ్లీ ఆమోదించి అటు పిమ్మట గవర్నర్ ఆమోదం కోసం పంపించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మంత్రి గోవిచెజియాన్ అంతకుముందు మాట్లాడుతూ కొత్త విశ్వవిద్యాలయం 2025–26 విద్యా సంవత్సరం నుండి కార్యకలాపాలను ప్రారంభిస్తుందని ప్రకటించారు. అయితే అనుమతి పొందడంలో జాప్యం ప్రారంభోత్సవానికి ఆటంకం కలిగించిందని అధికారి చెప్పారు.

## బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ మానసిక ఆరోగ్యంపై సందేహాలు

### ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్



**పాట్నా:** బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మానసిక ఆరోగ్యంపై సందేహాలు పొడసూపుతున్నాయని, ఇంకెంతోకాలం ఆయన ప్రభుత్వాన్ని నడిపించే శక్తిసామర్థ్యాలు ఆయనలో కనిపించడం లేదని ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ విమర్శించారు. న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో నితీశ్ కుమార్ తన నివాసం నుండే దృశ్యమాధ్యమ పద్ధతిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రవర్తనకు సంబంధించిన ఒక వీడియోను తేజస్వి యాదవ్ ఎక్స్‌వేదికగా అప్‌లోడ్ చేశారు. దీనిపై ఆయన వ్యాఖ్యానిస్తూ, మోదీ సభలో నితీశ్ ప్రవర్తన చూస్తే ఆయన మానసిక ఆరోగ్యంపై, ఒక ప్రభుత్వాన్ని ముందుకు నడిపించడంలో ప్రదర్శించే శక్తిసామర్థ్యాలపైన తాజాగా కొత్త సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. గతంలో తేజస్వి యాదవ్ బీహార్ ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉన్నారు. తేజస్వి యాదవ్ విలేకరులతో కూడా మాట్లాడుతూ, కొద్దికాలంగా ముఖ్యమంత్రి ప్రవర్తన సరిగ్గా లేదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, తన తల్లి రబ్రీదేవిపైన కూడా నితీశ్ కుమార్ క్రూరమైన వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. ఒక సందర్భంలో వెనకాల జాతీయ గీతాలాపన జరుగుతుంటే నితీశ్ కుమార్ మూర్ఖత్వంగా ప్రవర్తించారని కూడా గుర్తుచేశారు. "నిన్ననే మనం ఒక తాజా ఉదాహరణ చూశాం, ఆయన ప్రవర్తనలో లోపం ఉందని అందరికీ తెలిసింది, ఒకవైపు బిజెపి నాయకుడు, ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధురి కంప్యూటర్ స్క్రీన్ మీద మాట్లాడుతూ ఉంటే నితీశ్ కుమార్ చేతులు జోడించి నిలబడి ఉన్నారని, ఇది ఆయన ప్రవర్తనా లోపానికీ, మానసిక లోపానికీ ఒక మచ్చుతునక అనీ అన్నారు. ఒక ఎంతోకాలం ఆయన ప్రభుత్వాన్ని నడిపించే శక్తిసామర్థ్యాలు ఉన్నట్లు కనిపించడంలేదని, ఈ కూటమి బద్దలవుతుందని, త్వరలోనే ఈ విషయాలన్నీ బయట పడతాయని అన్నారు.

తేజస్వి యాదవ్ ఈ విధంగా నితీశ్ కుమార్‌పై విమర్శలు చేసిన కొద్దిసేపటికే జెడి (యు) అధికార ప్రతినిధి, ఎంఎల్‌సి నీరజ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. బీహార్ రాష్ట్ర రాజకీయ,సామాజక, ఆర్థిక ఆరోగ్యాన్ని చక్కదిద్ది, వాటిని పునరుద్ధరించిన ఘనత నితీశ్ కుమార్‌దేనని అన్నారు. ఆయన ఆరోగ్యం విషయంపై తేజస్వి యాదవ్ అంతగా బాధపడి, ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని అన్నారు. అనారోగ్యంతో ఉన్న ఆయన తండ్రి, ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం గురించి ఆయన బాధపడాలని సూచించారు. కేంద్ర హోంశాఖా సహాయమంత్రి నిత్యానంద్ రాయ్‌తో కలిసి పాట్నాలో పత్రికాగోష్ఠిలో మాట్లాడిన నీరజ్ కుమార్ లాలూప్రసాద్ యాదవ్ బీహార్ ముఖ్యమంత్రిగా ఉండగా 15 ఏళ్ళ పాలనలో విచ్చలవిడిగా కొనసాగిన అవినీతి చర్యలను గుర్తుచేశారు. లాలూప్రసాద్ బీహార్‌ను అవినీతి రాష్ట్రంగా మార్చారని, ఆ తర్వాత రబ్రీదేవి కూడా అవినీతిలో కూరుకుపోయారని విమర్శలు గుప్పించారు. దీనిపై తేజస్వి యాదవ్ తిరిగి స్పందిస్తూ, బీహార్‌లో ఇరవై ఏళ్ళుగా బిజెపి అధికారంలో భాగస్వామిగా కొనసాగుతోందని, కానీ ఆ పార్టీ చేసింది గోరంతేనని, ఇక భవిష్యత్తు విషయంలో ఆ పార్టీకి ఎలాంటి అవగాహనా లేదని, చివరకు ప్రతిపక్షాలపై బురద జల్లుతోందని విమర్శించారు.

## దగ్గు మందుతో చిన్నారుల మృతి...
## మధ్యప్రదేశ్ వైద్యుడి అరెస్టు




### కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ అమ్మకాలను నిషేధించిన ప్రభుత్వం

**భోపాల్ :** మధ్యప్రదేశ్ చింద్వారాలో 14 మంది పిల్లలు మూత్రపిండ వైఫల్యం కారణంగా మరణించిన విషయం తెలిసిందే. అయితే నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై పోలీసులు ఒక వైద్యుడిని అరెస్టు చేశారు. విషపూరిత దగ్గు సిరప్ తయారీదారుపై కేసు నమోదు చేశారని అధికారులు ఆదివారం తెలిపారు. అదే విధంగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ అమ్మకాలను నిషేధించింది. ఔషధ నమూనాలలో అత్యంత విషపూరితమైన పదార్థం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరణించిన పిల్లలలో 11 మంది పరాసియా సబ్‌డివిజన్‌కు చెందినవారు ఉండగా, ఇద్దరు చింద్వారా నగరానికి చెందినవారు, ఒకరు చౌరాయ్ తహసీల్‌కు చెందినవారు ఉన్నారు. తమిళనాడు కాంచీపురంలోని శ్రేసన్ ఫార్మాస్యూటికల్ తయారు చేసిన కోల్డ్రిఫ్ దగ్గు సిరప్, చింద్వారా జిల్లాలోని పరాసియా ప్రాంతంలో 11 మంది పిల్లల మరణానికి కారణమని పోలీసు సూపరింటెండెంట్ అజయ్ పాండే విలేకరులకు తెలిపారు. కంపెనీపై, ప్రభుత్వ వైద్యుడు అయినప్పటికీ ఒక ప్రైవేట్ క్లినిక్‌లో ప్రాక్టీస్ చేస్తూ సిరప్‌ను సూచించిన డాక్టర్ ప్రవీణ్ సోనిపై పరాసియా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని ఆయన చెప్పారు. శనివారం రాత్రి చింద్వారాలోని రాజ్‌పాల్ చౌక్‌లో డాక్టర్ సోనీపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత కొత్వాలి పోలీసుల ప్రత్యేక బృందం ఆయనను అరెస్టు చేసిందని ఎస్‌పి తెలిపారు. దాదాపు నెల రోజులుగా పిల్లలపై ప్రతికూల ప్రభావాలు చూపినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించి మందును సూచించినందుకు వైద్యుడిపై కేసు నమోదు చేశారని, పరీక్ష నివేదిక ప్రకారం, కలుషితమైన సిరప్‌ను సరఫరా చేస్తున్నందున తయారీదారుపై అభియోగాలు మోపినట్లు పాండే పిటిఐకి తెలిపారు. ఆదివారం ప్రభుత్వం డాక్టర్ సోనీని కూడా సస్పెండ్ చేసింది. జబల్‌పూర్‌లోని ఆరోగ్య శాఖ ప్రాంతీయ అధికారికి ఆయనను అటాచ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం తెలిపారు. కల్తీ మందులను వాడటం వల్ల మరణానికి కారణమయ్యే డ్రగ్స్ అండ్



కాస్మెటిక్స్ చట్టం, 1940లోని సెక్షన్ 27ఎ కింద కూడా వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ చట్టం ప్రకారం కల్తీ మందులు వాడటం వల్ల మరణానికి 10 సంవత్సరాలకు పైగా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించబడుతుంది. శనివారం, మరణించిన 14 మంది పిల్లల కుటుంబాలకు ప్రభుత్వం రూ.4 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేసింది. కాగా, మధ్యప్రదేశ్‌లో అనుమానిత మూత్రపిండాల ఇన్ఫెక్షన్ల కారణంగా మరణాలు, రాజస్థాన్‌లో కనీసం మూడు ఇలాంటి మరణాలు సంభవించిన నివేదికల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం శుక్రవారం కోల్డ్రిఫ్‌ను నిషేధించింది. బాధిత పిల్లల నుండి నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. అయితే సిరప్ కల్తీ, కాలుష్యంపై మరిన్ని పరీక్షలు జరుగుతున్నాయి. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) ఆరు రాష్ట్రాలలోని దగ్గు సిరప్‌లు, యాంటీబయాటిక్‌లతో సహా 19 ఔషధాల తయారీ యూనిట్లలో రిస్క్‌ఆధారిత తనిఖీలను ప్రారంభించిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది.

## పికప్ వ్యాన్ ఢీకొని నలుగురు మృతి

### 15 మందికి గాయాలు

**పటాన్ (గుజరాత్) :** గుజరాత్‌లోని పటాన్ జిల్లాలోని రాధన్‌పూర్ సమీపంలో ఆదివారం ట్రక్కు, రెండు ద్విచక్ర వాహనాలను పికప్ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, 15 మంది గాయపడ్డారని ఒక పోలీసు అధికారి తెలిపారు. మోతీ పిప్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఉదయం 10 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసు సూపరింటెండెంట్ వసంత్ నాయి తెలిపారు. రహదారి నిర్మాణ పనుల కారణంగా ఒక వైపు ట్రాఫిక్ నిలిచిపోయిన ప్రాంతంలో సుమారు 15 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న పికప్ వ్యాన్ ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ట్రక్కును ఢీకొట్టింది. ఈ క్రమంలో, వ్యాన్ రెండు ద్విచక్ర వాహనాలను కూడా ఢీకొట్టింది, అందులో నలుగురు వ్యక్తులు ఉన్నారని ఎస్పీ చెప్పారు. మృతులలో ఇద్దరు వ్యాన్ ప్రయాణికులు, ఇద్దరు మోటార్ సైకిల్ నడిపేవారు ఉన్నారు. పదిహేను మందికి గాయాలు అయ్యాయి, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని ఆయన తెలిపారు. మృతులను లక్ష్మణ్ దేశాయ్, యష్ ఉంచోసన్, కను రావల్, నసీబ్ ఖాన్‌గా గుర్తించినట్లు రాధన్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు.

## లేహ్ నిరసనకారుల మృతిపై న్యాయవిచారణ

### వాంగ్‌చుక్ డిమాండ్



**జోథ్‌పూర్:** లద్దాఖ్ ప్రజలు రాష్ట్ర హోదా కోసం చేపట్టిన పోరాటాన్ని గాంధేయవాద పద్ధతిలో అహింసా మార్గంలో కొనసాగించాలని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కోరారు. లేహ్ నిరసనల్లో నలుగురు మృతి చెందడంపై ఆయన స్వతంత్ర న్యాయ విచారణకు డిమాండ్ చేశారు. లద్దాఖ్‌లో హింసాత్మక ఘటనల అనంతరం జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద అరెస్టయిన వాంగ్‌చుక్ ప్రస్తుతం రాజస్థాన్‌లోని జోథ్‌పూర్ జైలులో ఉన్నారు. వాంగ్‌చుక్‌ను ఆయన అన్నయ్య డోర్జీ లే, న్యాయవాది ముస్తఫా హాజి జైలులోనే కలుసుకున్నారు. తన లాయర్ ద్వారా వాంగ్‌చుక్ లద్దాఖ్ వాసులను ఉద్దేశించి తాజా ప్రకటన చేశారు. 'నేను శారీరకంగా, మానసికంగా బాగున్నా. నా కోసం ఆందోళన చెందుతున్న వారందరికీ కృతజ్ఞతలు. లెహ్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన నలుగురు లద్దాఖ్ వాసుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా. వారి మృతిపై స్వతంత్ర న్యాయ విచారణ జరగాలి. ఇది జరగనంత వరకూ నేను జైలులోనే ఉండేందుకు సిద్ధంగా ఉన్నా' అని వాంగ్‌చుక్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర హోదా డిమాండ్‌కు తాను బలంగా కట్టుబడి ఉన్నట్టు వాంగ్‌చుక్ తెలిపారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించడం, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో దానిని చేర్చడం అనే న్యాయబద్ధమైన డిమాండ్లకు సంబంధించి అపెక్స్ బాడీ, కెడిఎకు బాసటగా నిలుస్తానని, లద్దాఖ్ ప్రజల ప్రయోజనాల కోసం అపెక్స్ బాడీ ఏ నిర్ణయం తీసుకున్నా తాను వెన్నంటి ఉంటానని చెప్పారు. ప్రజలు గాంధేయవాద పద్ధతిలో శాంతియుతంగా పోరాటం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. లెహ్‌లో శాంతియుత నిరసనలు హింసాత్మకంగా మారడంతో ఒక జవానుతో సహా నలుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఘటన జరిగిన రెండ్రోజుల తర్వాత వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం కింద పోలీసులు అరెస్టు చేశారు. లద్దాఖ్ గతంలో జమ్ముకశ్మీర్‌లో భాగంగా ఉండగా, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను తొలగిస్తూ రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా కేంద్రం విభజించడంతో 2019లో లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతమైంది. కాగా, వాంగ్‌చుక్‌ను ఎన్ఎస్ఎ కింద అరెస్టు చేయడం అన్యాయమంటూ ఆయన భార్య గీతాంజలి జె అంగ్మో.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం నాడు విచారణకు రానుంది.

## మళ్లీ కలుసుకున్న థాక్రే సోదరులు



**న్యూఢిల్లీ :** థాక్రే సోదరులు మరోసారి ముంబయిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆదివారం నాడు కలుసుకున్నారు. శివసేన యుబిటి అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) వ్యవస్థాపకుడు రాజ్ థాక్రే ముంబయిలో జరిగిన సంజయ్ రౌత్ మనవడి నామకరణోత్సవానికి హాజరయ్యారు. సోదరులిద్దరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. త్వరలో మహారాష్ట్రలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో శివసేన యుబిటి–ఎంఎన్ఎస్ కలిసి పోటీ చేయనున్నాయనే ఊహాగానాల నేపథ్యంలో థాక్రే సోదరులు మరోసారి సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉద్ధవ్ థాక్రే, రాజ్‌థాక్రే, ఆదిత్య థాక్రే, ఉద్ధవ్ శివసేన నేతలు అనిల్ దేశాయ్, మిలంద్ నార్వేకర్ సందడిగా నామకరణోత్సవంలో పాల్గొన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మహారాష్ట్ర విజయ్ ర్యాలీ గత జులైలో జరిగినప్పుడు థాక్రే సోదరులిద్దరూ ఒకే వేదికపైకి వచ్చారు. అప్పటి నుంచి కూడా ఇద్దరు నేతలూ పలుమార్లు సమావేశమయ్యారు. గత నెలలో రాజ్ నివాసమైన శివ్‌తీర్థ్‌కు ఉద్ధవ్ వెళ్లి కలుసున్నారు. దీనికి ముందు గణేశ్ చతుర్థి ఉత్సవాల సందర్భంగానూ ఇద్దరూ కలిసారు. గత ఆగస్టులో బిఎస్‌టి ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో యుబిటి, ఎంఎన్ఎస్ కలిసి పోటీ చేసాయి. అయితే బిజెపి చేతిలో 21 సీట్లు కోల్పోయాయి. 21 మందిలో 18 మందిని యుబిటి నిలబెట్టగా, ఎంఎన్ఎస్ ఇద్దరిని పోటీకి దింపింది.

## మావోయిస్టు భావజాలం తుడిచిపెట్టేందుకు
## కేంద్ర హోంశాఖ చర్యలు

### బస్తర్‌లో 10వేల రేడియోలు పంపిణీ

**న్యూఢిల్లీ/బిజాపూర్:** నక్సల్స్ హింసాత్మక కార్యకలాపాల బారిన పడిన దూరంగా విసిరేసినట్టుండే మారుమూల ప్రాంతాలకు 10,000 పైగా రేడి యో సెట్లను సిఆర్‌పిఎఫ్ పంపిణీ చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ఏరియాలో ఉన్న ప్రజల్లో జాతీయ భావాలను, జాతీయస్థాయి ఆలోచనలను పెంపొ ందించేందుకు వీలుగా ప్రత్యేకంగా సిఆర్‌పిఎఫ్ ప్రజల్లో ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రాంతంలోని ప్రజల్లో ఉన్న మావోయిస్టు భావజాలాన్ని తుడిచిపెట్టేందుకు ఈ రేడియోసెట్లను పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రాంతం లో క్రమంగా వామపక్ష ఉగ్రవాద కార్యకలాపాలు క్షీణిస్తున్న సాక్ష్యాధారాలు కనిపిస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. పారామిలిటరీ బలగాలు ఈ రేడియో సెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తి చేసింది. నాలుగు నెలలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాలలో ప్రజలను సమీకరించి వందలసంఖ్యలో అనేక చిన్న, పెద్ద కార్యక్రమాలను పారామిలిటరీ దళాలు నిర్వహించాయి. బస్తర్ ప్రాంతంలోని ఏడు జిల్లాలలో ప్రత్యే క పౌర కార్యచరణ చర్యలను నిర్వహించారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఈ ఏడాది ఆరంభంలోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికోసం రూ.1.62 కోట్లు బడ్జెట్ కూడా కేటాయించింది. హోంశాఖ సీనియర్ అధికారి ఒకరు ఢిల్లీ లో పిటిఐ ప్రతినిధికి ఈ విషయం చెప్పారు. ఒక్కొ క్క రేడియో ఖరీదు రూ.1500 ఉంటుంది. వీటిని నేరుగా పవర్‌బోర్డుకు కనెక్టు చేయవచ్చు. ఎఫ్‌ఎం, ఎండబ్ల్యు, ఎస్‌డబ్ల్యు మోడ్‌లలో ఈ రేడియోలు పనిచేస్తాయి. బస్తర్ జిల్లాలో ఉన్న సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ కమాండర్ ఈ విషయంపై మాట్లాడుతూ, బస్తర్ ఏరియాలో 10,800 రేడియో సెట్లను పంపిణీ చేశామని, 180 కంపెనీల పారామిలిటరీ సిబ్బందిని ఈ ప్రాంతంలోని మారుమూల గ్రామాలలో మోహరించామని చెప్పారు. ఐదుగురు కుటుంబ సభ్యులను ఒక యూనిట్‌గా తీసుకుని దాదాపు 54,000 మంది వ్యక్తులను అనుసంధానం చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. స్థానికులకు ఈ రేడియోలను పంపిణీ చేస్తున్నామన్నారు. బస్తర్ ఏరియాలో గ్రామీణ ప్రజలను జాతీయ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. "కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి నాటికి ఈ ప్రాంతంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుబడి ఉంది, ఒక వైపు ఈ లక్ష్యం సాధించేందుకు పనిచేస్తూ మరోవైపు ప్రజలను ప్రధాన జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చే కార్యక్రమాలను కూడా చేపడుతున్నాం, ఈ ప్రాంతం నుండి మావోయిస్టు భావజాలాన్ని తుడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం, ఇందుకు స్థానిక కమ్యూనిటీల సహకారం తీసుకుంటున్నాం, వారి సంక్షేమ చర్యలకు చొరవ తీసుకుంటున్నాం'' అని సిఆర్‌పిఎఫ్ మరో అధికారి చెప్పారు. ప్రభుత్వం ప్రజలకోసం అమలు చేస్తున్న వివిధ వినోద కార్యక్రమాల గురించి స్థానిక ప్రజలకు ఈ బలగాలు తెలియజేస్తున్నాయని, రేడియోద్వారా వచ్చే కార్యక్రమాల వివరాలు వాటి ప్రయోజనాలను చెబుతున్నారని చెప్పారు. ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమం దగ్గర నుండి అనేక అంశాలు రేడియోలో వస్తున్న విషయాన్ని స్థానికులకు ముందుగా తెలియజేస్తున్నామన్నారు. మరిన్ని రేడియో టవర్లను ఈ సుదూర గ్రామీణ ప్రాంతాలలో నిర్మించాలని కూడా కేంద్ర ప్రభుత్వం ఈ దళాలను కోరింది. మొత్తం 180 సిఆర్‌పిఎఫ్ కంపెనీలు ఈ ప్రాంతంలో పనిచేస్తుండగా, ఒక్కొక్క కంపెనీకి 60 రేడియోలు ఇచ్చి ప్రజలకు పంపిణీ చేసే బాధ్యతలు అప్పగించారు. చాలా తీవ్రస్థాయిలో నక్సలైటు కార్యకలాపాలు కొనసాగే మారుమూల ప్రాంతాలలో, గ్రామాలలో ఈ దళాలను కేంద్ర ప్రభుత్వం మోహరించింది.

## ఖలిస్థానీ ఉగ్రవాదులకు నిధులపై
## నిఘా పెట్టిన కెనడా

**కెనడా :** ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థల నెట్‌వర్క్‌కు నిధులు వస్తున్న మార్గాలపై కెనడా ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా వేశాయి. కెనడాలోని సేవా సంస్థలకు వస్తున్న నిధులను ఉగ్ర కార్యకలాపాలకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలతో కెనడా సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. కెనడా ఆర్థికశాఖకు చెందిన మోర్స్ నివేదిక ఖలిస్థానీ ఉగ్రవాదాన్ని హమాస్, హెజ్‌బొల్లాతో పోల్చింది. వేర్పాటువాదులు సేవా సంస్థల నిధులను ఉగ్ర కార్యకలాపాలకు వాడుతున్నారని ఆరోపించింది. స్థానిక రేడియో స్టేషన్ అధిపతి మణీందర్ ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ సహా పలువురు నాయకులకు కొన్నాళ్ల క్రితం లేఖ రాశారు. సామాజిక సేవకు వచ్చే విరాళాల దుర్వినియోగంపై ఫిర్యాదు చేశారు. గత పాలకులు దీనిపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని వెల్లడించారు. కెనడాలోని నాన్‌ప్రాఫిట్ ఆర్గనైజేషన్‌లో ఉగ్ర స్లీపర్ సెల్స్ ఉంటున్నాయనే అనుమానాలు వ్యక్తంచేశారు. ఇప్పటికే బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ ఉగ్ర సంస్థ సభ్యుడు తల్వీందర్ సింగ్ పర్మర్ కుమారుడు సురిందర్ సింగ్ పర్మర్ కేసు ఈ కోవలోనే పరిశీలిస్తున్నారు. సురిందర్ కెనడాలోని నాన్ ప్రాఫిట్ సంస్థలోనే పనిచేస్తున్నాడు. ఆ సమయంలో అతడు తన పూర్తి పేరును వెల్లడించలేదని తేలింది. ఇతడికి కూడా బబ్బర్ ఖల్సాతో సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో కెనడా ప్రభుత్వం ఈ అంశంపై నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని భావిస్తోంది. ఛారిటబుల్ సంస్థలకు వచ్చే నిధుల దుర్వినియోగంపై దృష్టి పెట్టనుంది. భారత్–కెనడా భద్ర తా సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకొన్నాయి. ఈ క్రమంలోనే కెనడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్ర సంస్థగా ప్రకటించింది.



# ప్రపంచం
WORLD NEWS

## లండన్ పాలస్తీనా ర్యాలీ 500 మంది అరెస్టు

**లండన్ :** లండన్‌లో వేలాదిమంది పాలస్తీనా అనుకూల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న 500 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం ఆదివారం ఉదయం ఈ విషయం వెల్లడించింది. నిషేధిత పాలస్తీనా అనుకూల గ్రూప్‌కు చెందినవారుగా పోలీసులు అనుమానించి ర్యాలీలో పాల్గొన్న 500 మందిని అరెస్టు చేశారు. పాలస్తీనా అనుకూల ప్రదర్శకులపై లండన్ పోలీసులు అనేక ఆంక్షలు విధించారు. నిషేధిత పాలస్తీనా యాక్షన్ అనుకూల ప్రదర్శకులను ఎక్కువమందిని పోలీసులు అరెస్టు చేశారు. అసమ్మతిని తెలియజేసే హక్కు ఉన్నప్పటికీ తరచుగా ప్రదర్శనలు చేయడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారని హోంశాఖ కార్యాలయం ప్రకటించింది.

ఈ స్వేచ్ఛ సమతుల్యంగా ఉండాలని పేర్కొంది. ఇటీవలికాలంలో సెంట్రల్ లండన్‌లో అనేకసార్లు పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ ప్రదర్శనలవల్ల వివిధ మతాలవారు అభద్రతకు గురవుతున్నారని పోలీసులు ప్రకటిస్తున్నారు.



## సిరియాలో తొలిసారి ఎన్నికలు

**డమాస్కస్ :** మధ్యధరాసముద్ర తూర్పుప్రాంత సిరియా (సిరియన్ అరబ్ రిపబ్లిక్) దేశంలో దాదాపు దశాబ్దంన్నర కాలం తర్వాత మొదటిసారి ప్రజలు ఆదివారం పోలింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ ప్రక్రియ సాయంత్రానికి పూర్తయింది. వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఫలితాలు వెల్లడవుతాయి. 210 స్థానాలకుగాను మూడింట రెండు వంతుల సీట్లకు ప్రజలు ప్రతినిదులను ఎన్నుకుంటారు. మిగిలిన స్థానాలకు అంటే 70 స్థానాలకు దేశాధ్యక్షుడే నేరుగా ప్రతినిధులను ఎంపికచేసి నియమిస్తారు. కానీ ఈ విధంగా చేయడంవల్ల పార్లమెంటుపై దేశాధ్యక్షుడే పెత్తనం చెలాయిస్తాడని దేశంలో ఉన్న 12 పౌర సంఘాల గ్రూపులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఖుర్దిష్ తెగల ఆధిపత్యంలో కొనసాగే రెండు రాష్ట్రాలలో, డ్రూజ్‌లు ఆధిపత్యంగల రాష్ట్రంలో భద్రతాకారణాల రీత్యా ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించచడంలేదు. అంటే రక్కా, హస్సకేష్, సువైదా రాష్ట్రాలలో ఉన్న 10 జిల్లాలో ఎన్నికలు నిర్వహించచడంలేదు. ప్రస్తుతం 50 జిల్లాల్లో మాత్రమే 120 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. దాదాపు 1500 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మాజీ ప్రభుత్వ మద్దతుదారులు, ఉగ్రవాద సంస్థలను ఎన్నికలనుండి బహిష్కరించారు. 2010లో సేకరించిన జనాభా లెక్కల ప్రకారం 60 జిల్లాలకు పీపుల్స్ అసెంబ్లీలో స్థానాలను కేటాయించారు. సిరియా అంతర్యుద్ధంలో 6,00,000 మంది మరణించారు. మరో 12,00,000 మంది నిరాశ్రయులయ్యారు. నియంత్రుత్వపాలనతో అతలాకుతలమైన సిరియాలో ప్రస్తుతం పీపుల్స్ అసెంబ్లీకి తాత్కాలికంగా ప్రత్యక్ష ఎన్నికల విధానం లేదు. దేశంలో 13 సంవత్సరాలపాటు అంత్యరుద్ధం కొనసాగిన తర్వాత గత ఏడాది డిసెంబరు 8వ తేదీన నియంత అస్సాద్ పరిపాలన కుప్పకూలింది. అల్–షారా నాయకత్వాన పదినెలలక్రితం తిరుగుబాటుదారులు ప్రభుత్వాన్ని కూల్చివేశారు. ప్రస్తుతం తాత్కాలిక రాజ్యాంగం అమలులో ఉంది. అహ్మద్ అల్–షారా అధ్యక్షతన ఈ ఏడాది మార్చి 29న తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అల్ షరా ప్రభుత్వం ప్రపంచంలో తిరిగి సిరియాను అనుసంధానం చేసేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులోభాగంగా అంతర్జాతీయ పర్యవేక్షకుల సమక్షంలో మొదటిసారి ఎన్నికలు జరుగుతున్నాయి. సిరియా నాయకుడు ఒకరు దాదాపు 60 సంవత్సరాల తర్వాత మొదటిసారి ఇటీవల ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలలో ప్రసంగించారు. తాత్కాలిక అధ్యక్షుడు అల్–షారా గతనెలాఖరున జనరల్ అసెంబ్లీలో మాట్లాడుతూ, సిరియాలో నియంత పాలనలో అణచివేతకు గురైన ప్రతి ఒక్క మనిషికీ న్యాయం చేస్తామన్నారు. సిరియాలో చట్టాలను, మానవహక్కులను, వ్యవస్థలను సరికొత్తగా పునర్నిర్మిస్తామన్నారు.

# జార్జియాలో ప్రభుత్వ కూల్చివేత యత్నం విఫలం

### స్థానిక ఎన్నికల్లో అధికారపార్టీ ఘన విజయం

**తిబ్లిసి :** జార్జియాలో ప్రజల నిరసన ప్రదర్శనలు, అధికార డ్రీమ్ పార్టీ ప్రభుత్వాన్ని శాంతియుతంగా కూల్చివేసేందుకు జరిగిన ప్రయత్నాల మధ్య దేశవ్యాప్తంగా మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. ఆదివారం వెలువడిన ఈ ఎన్నికల ఫలితాల్లో అధికారపార్టీ ఘన విజయం సాధించింది. అధికార పార్టీని అధికారం నుండి తొలగించాలని ప్రతిపక్షాలు కంకణం కట్టుకున్నాయి. వేలాదిమంది ప్రతిపక్ష అనుకూల ప్రదర్శకులు, మద్దతుదారులు శనివారంనాడు పార్లమెంటు భవంతిలోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. వారిపై నీటి గొట్టాలను, బాష్పవాయువును ప్రయోగించారు. వారిని చెల్లాచెదురు చేశారు. ప్రతిపక్ష నాయకుడు ఖబీష్విలీని పోలీసులు అరెస్టు చేశారు. వేలాదిమంది పార్లమెంటు భవనంలోకి జొరబడి పార్లమెంటును ధ్వంసంచేసి ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారని, ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు ప్రతిపక్షాల సహాయంతో జరిగిన ఈ ప్రజా దుందుడుకు హింసాత్మక చర్యలను విజయవంతంగా నిరోధించామని జార్జియా డ్రీమ్‌పార్టీ (కోట్సెబీ)కి చెందిన ప్రధానమంత్రి ఇరాక్లీ కోబాకిట్జే చెప్పారు. ఐతే ప్రతిపక్షాలు ఈ స్థానిక ఎన్నికలను బహిష్కరించాయి. ఈ ఎన్నికల్లో తమ డ్రీమ్ పార్టీ జిడి కోట్సెబీకి 10.10 లక్షల ఓట్లు లభించాయని, గత ఏడాది ఎన్నికల్లో తమ పార్టీ విజయానికి ఎంతమాత్రం తగ్గకుండా ప్రజాదరణను నిలబెట్టుకున్నామని చెప్పారు. రాజధాని తిబ్లిసిలో జరిగిన ఎన్నికల్లో తమపార్టీ బ్రహ్మాండమైన రికార్డు సాధించిదని, ఇక దేశవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో తమ పార్టీ 70 శాతం పైగా ఓట్లు సంపాదించుకుందని ప్రధానమంత్రి కోబాకిట్జే చెప్పారు.





### అవినీతి నిర్మూలన, విద్య, వైద్యం కోసం
## మొరాకోలో కొనసాగుతున్న జనరేషన్ జెడ్ నిరసన




**రబాత్ :** ఆఫ్రికా వాయువ్యప్రాంత దేశం మొరాకోలో ప్రజల నిరసన ప్రదర్శనలు ఆదివారంనాటికి ఎనిమిదో రోజుకు చేరాయి. దేశంలో విద్యా సదుపాయాలు, ప్రజారోగ్య సదుపాయాలు ఉత్తమస్థాయిలో అందించాలని కోరుతూ ఆన్‌లైన్‌లో యువకులు ఎనిమిది రోజులుగా నిరసన తెలియజేస్తున్నారు. ఇటీవలి సంవత్సరాలలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, ఇండోనేసియా, మడగాస్కర్ తదితర దేశాలలో ఒకేవిధమైన పద్ధతులలో జనరేషన్ జెడ్ ఉద్యమాలు జరుగుతున్నాయి. ఇప్పుడు మొరాకోలో కూడా ప్రారంభమైంది. జనరేషన్ జెడ్ పేరుతో అసమ్మతి వ్యక్తం చేస్తున్నవారి సభ్యత్వం 1.80 లక్షలుపైగా ఉంది. అగాదిర్ నగరంలోని ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం లభించక ఎనిమిది మంది గర్భవతులు మరణించడంతో ఈ ఉద్యమం తొలుత సెప్టెంబరులో ప్రారంభమై అనేక చోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. తర్వాత ఉద్యమం మెల్లగా ఉద్ధృతం అవుతున్నది. ప్రభుత్వ సేవల్లో ఏ మాత్రం నాణ్యత లేదని, ఈ విషయాన్ని జనరేషన్ జెడ్ చూస్తూ కూర్చోదని, ప్రభుత్వాన్ని నిలదీస్తామని వారు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా మొరాకో రాజరిక పాలనతో యువకుల జోక్యం ఉండదు. కానీ వారం రోజులుగా ఆన్‌లైన్‌లో యువకులు జెనరేషన్ జెడ్ 212 పేరుతో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. జనరేషన్ జెడ్ యువకులు భౌతికంగా కూడా పలుచోట్ల గుమిగూడి అవినీతి నిర్మూలించాలని, ప్రజా సదుపాయాలను మెరుగుపరచాలని, ప్రజలకు స్వేచ్ఛ, హక్కులు, గౌరవ మర్యాదలు, సామాజిక న్యాయం కావాలని డిమాండ్ చేస్తున్నారు. మొరాకో పశ్చిమప్రాంత నగరం కాసబాంకలో విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని ప్రజలు నినాదాలు చేస్తున్నట్లు స్థానిక మీడియా తెలియజేసింది. మరోవైపు రాజధాని రబాత్‌లో పెద్దసంఖ్యలో ప్రజలు పార్లమెంటు ఎదున గుమిగూడి శాంతియుత పద్ధతులలో నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఐతే ఇంతవరకూ ఈ జెనరేషన్ జెడ్ 212 వ్యవస్థాపకుడు ఎవరో బాహాటంగా తెలియరాలేదు. 14 నగరాలలో తొలుత ఆన్‌లైన్ ద్వారా జెనరేషన్ జెడ్ 212 ప్రదర్శనలకు పిలుపు ఇచ్చింది. రబాత్, అగాదిర్ సహా అనేక నగరాలు, చిన్న చిన్న పట్టణాలలో వందలసంఖ్యలో ప్రజలు శుక్రవారం భారీ ప్రదర్శనలు జరిపారు. చిన్న చిన్న పట్టణాలలో స్వల్ప ఘర్షణలు కూడా జరిగాయి.

## ఉక్రేన్‌పై రష్యా దాడి : ఐదుగురు మృతి

**కీవ్ :** ఉక్రేన్‌పై రష్యా ఆదివారం మరోసారి భారీ దాడులకు దిగింది. ఈ దాడుల్లో ఐదుగురు మరణించారు. మరో ఆరుగురు గాయపడ్డారు. తూర్పు డోనెట్స్కలోని సోవియన్స్క ప్రాంతంలో జరిగిన దాడుల్లో ఆరుగురు గాయపడ్డారు. పౌర ప్రాంతాలు, పౌర మౌలిక సదుపాయాలపై ప్రధానంగా రష్యా క్షిపణులు గురిపెట్టి దాడులు చేశాయని ఉక్రేన్ విమర్శించింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జెపోరిఝియాలో 73,000 మంది ప్రజలు అంధకారంలో ఉండిపోయారు. దాదాపు 50కి పైగా బాలిస్టిక్ క్షిపణులు, 500 డ్రోన్లుతో రష్యా దాడులకు దిగిందన ఉక్రేన్ సైనిక వర్గాలు తెలిపాయి. మరణించినవారిలో 15 ఏళ్ళ టీనేజర్ కూడా ఉన్నారు. రాజధాని కీవ్, ఇతర ప్రాంతాలపై ఈ క్షిపణులు పడ్డాయి.

## జెకొస్లొవేకియా ప్రధానమంత్రిగా ఎఎన్‌ఓ పార్టీ నేత బాబిస్ గెలుపు

**ప్రాగ్ :** మధ్య యూరప్ దేశం జెక్ రిపబ్లిక్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ఎఎన్‌ఓ మితవాద పార్టీ నాయకుడు మాజీ ప్రధాన మంత్రి ఆండ్రేజ్ బాబిస్ (75) తిరిగి ఎన్నికయ్యారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఆయన ఇతర భావసారూప్యత గల పార్టీలతో లాంఛనంగా ఆయన చర్చలు జరుపుతారు. గ్రీన్ డీల్ మోటారిస్ట్స్, ఫ్రీడం అండ్ డైరెక్ట్ డెమోక్రసీ పార్టీలు ఇప్పటికే ఆయనతో టచ్‌లో ఉన్నాయి. ఆయన ఆ దేశంలో కుబేరుడు, వ్యాపారవేత్త. 2017 నుండి 2021 వరకూ ఇంతకుముందు ఆయన ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహించారు. అంతకుముందు 2014 నుండి 2017 వరకు ఆయన ఆర్థికమంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా పనిచేశారు. ప్రాథమిక ఫలితాల్లో ఎఎన్‌ఓ పార్టీకి 35 శాతం ఓట్లు లభించాయి.

200 స్థానాలు ఉన్న పార్లమెంటు దిగువసభలో ఎన్ఎన్‌ఓకు 80 స్థానాలు లభించాయి. ఇంతకుముందు ఎన్నికల్లో బాబిస్ పార్టీ 72 సీట్లు మాత్రమే గెలుచుకుంది.

## మోదీ సర్కార్ ప్రోత్సాహం
(3వ పేజీ తరువాయి)

ఆర్థిక అసమానతను సృష్టిస్తోందని, ఈ అసమానత విస్తృతమైన సామాజిక అభద్రత, అసంతృప్తికి దారితీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర దేశాలలో ఇటీవలి జరిగిన ఘటనలను చూస్తే ఇదే తీవ్రమైన ఆర్థిక అసమానత, వికలాంగ ప్రజాస్వామ్య సంస్థలు రాజకీయ అరాచకానికి ఉత్ప్రేరకంగా మారినట్లు తెలుస్తోందన్నారు. ఈ ప్రభుత్వం భారతదేశాన్ని కూడా అదే దారిలోకి నెడుతోందని రమేష్ ఆరోపించారు. అధికార సంబంధాల కారణంగా కొంతమంది పారిశ్రామిక వేత్తలు మరింత ధనవంతులుగా మారుతున్నారని, ప్రధానమంత్రి విధానాలు ఆయన కొద్దిమంది పారిశ్రామిక స్నేహితుల ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారించాయని ఆరోపించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన ఎంఎస్ఎంఇ రంగం అపూర్వమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని, ఈ ఒత్తిడి దేశీయ విధానాల వల్లనే కాకుండా విదేశాంగ విధాన వైఫల్యాల వల్ల కూడా సంభవిస్తుందని ఆయన పేర్కొన్నారు. సాధారణ ప్రజలకు సంపాదన అవకాశాలు తగ్గిపోతుండగా, ద్రవ్యోల్బణం చాలా ఎక్కువగా పెరిగిపోయిందని, ఉపాధి పొందుతున్న వారు కూడా పొదుపుకు బదులుగా అప్పుల బారిన పడుతున్నారని మండిపడ్డారు. విద్య, ఆరోగ్యంలో పెట్టుబడులు క్రమంగా తగ్గుతున్నాయని, సామాజిక భద్రతా పథకాలు బలహీనపడుతున్నాయన్నారు. లక్షలాది మందికి సామాజిక, ఆర్థిక భద్రతా వలయాన్ని అందించిన ఉపాధిహామీ పథకం వంటి విజయవంతమైన పథకాలు ఇప్పుడు వేతన సంక్షోభాలతో సతమతమవుతున్నాయని, కార్మికులకు సకాలంలో జీతాలు కూడా అందడం లేదన్నారు. ఇంత తీవ్రమైన సంపద కేంద్రీకరణ ఆర్థిక వ్యవస్థకు సమస్య మాత్రమే కాదు, ప్రజాస్వామ్యం ఆత్మపైనే ప్రత్యక్ష దాడిగా ఆయన అభివర్ణించారు. ఆర్థిక శక్తి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైనప్పుడు, రాజకీయ నిర్ణయాలు కూడా వారికి అనుకూలంగా మారడం మొదలవుతాయన్నారు. ఇది సామాజిక, ఆర్థిక అసమానతలకు దారితీస్తోందన్నారు. దీని ఫలితంగా మిలియన్ల మంది పౌరులు క్రమంగా ప్రజాస్వామ్యం, అభివృద్ధి ప్రక్రియ నుండి మినహాయించబడుతున్నారని రమేష్ అన్నారు. ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025లో ఉన్నవారి సంచిత సంపద రూ. 167 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది భారతదేశ జిడిపిలో దాదాపు సగానికి సమానం. ఈ జాబితాలో రూ. 1,000 కోట్ల సంపద కలిగిన 1,687 మంది వ్యక్తులు ఉన్నారు. వీరి సంఖ్య 284 మందికి పెరగగా, అందులో కొత్తగా 148 మంది ప్రవేశించారు. గత రెండు సంవత్సరాలుగా భారతదేశం ప్రతి వారం ఒక బిలియనీర్‌ను సృష్టించిందని, జాబితాలో ఉన్నవారు ప్రతిరోజూ రూ. 1,991 కోట్ల సంపదను పెంచుతున్నారని హురున్ అన్నారు.

## వరద విలయం
(3వ పేజీ తరువాయి)

అనుమతించారు. సప్తకోషి నది ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం కోషి నది బ్యారేజీకి ఉన్న 56 గేట్లు తెరిచి నీటికి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ గేట్ల నుండి సెకనుకు 3.30.060 క్యూబిక్ మీటర్ల నీరు దిగువకు ప్రవహిస్తోంది.భక్తపూర్‌కు చెందిన నలుగురు పర్వతారోహకులు బేరింగ్ ఖోలా వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. నేపాల్ సైన్యం, పోలీసులు సహాయచర్యల్లోపాల్గొంటున్నారు. ఆదివారంనాటి తాజా సమాచారం ప్రకారం, ఇలామ్ జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీ ప్రాంతాల పరిధిలో శనివారంరాత్రి కొండ చరియలు విరిగిపడి 37 మంది మరణించారు. మరో నలుగురు గల్లంతయ్యారు. కొండచరియలువిరిగిపడటంతో జాతీ య రహదారులపై రాకపోకలు స్తంభించాయి. డ్యూమైలో ఎనిమిదిమంది, మైజోగ్మైలో మరో ఎనిమిది మంది కొండచరియలు పడి మరణించారు. ఇలాం మున్సిపాలిటీలో ఆరుగురు మరణించారు. కోషి నది ఉగ్రరూపం దాల్చింది. ఎనిమిది నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయని జనవనరుల మంత్రిత్వశాఖాధికారులు ప్రకటించారు. భాగ్మతి, సన్‌కోషి, అరుణ్, తమోర్, కోషి, బుధికోలా,సున్సారీ,బైరింగ్‌ఖోలానదుల్లో నీటి ప్రవాహం ప్రమాదస్థాయిని దాటినట్లు అధికారులు ఆదివారం ఉదయం ప్రకటించారు. ఖోషీ రాష్ట్రంలో నదీనీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. భాగ్మతి,మాధేష్‌రాష్ట్రాలలోనదీ ప్రవాహాలు స్థిరంగా ఉన్నాయి. ఇలామ్ జిల్లాలో భారీ వర్షాలు అదే పనిగా కురుస్తూ ఉండటంతో కొండచరియలు విరిగిపడ్డాయి. గల్లంతైనవారికోసం తీవ్ర గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. విరిగిపడిన కొండచరియలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. కొండచరియలు విరిగిపడటంవల్ల నువాకోట్, హిటౌడాలకు వెళ్ళే జాతీయ రహదారులు మూసుకుపోయాయి. పృథ్వి జాతీయ రహదారిపై ఒకవైపు వెళ్ళే దారి మాత్రమే పనిచేస్తోంది.రద్దీ నెలకున్నది. రెండు రోజుల తర్వాత వాతావరణంలో కొద్దిగా మార్పు రావడంతో ధాడింగ్,నువాకోట్, దక్షిణకాళిలలో జాతీయ రహదారుల పునరుద్ధరణ కార్యక్రమాలు సాగుతున్నాయని సీనియర్ పాలనాధికారిణి సుజన్ కుమారి బర్దేవా ఆదివారం చెప్పారు.

## మూడు రోజులు భారీ వర్షాలు
(3వ పేజీ తరువాయి)

పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు.

### హైదరాబాద్‌లో భారీ వర్షం

హైదరాబాద్ నగరంలో పలు చోట్ల వర్షం కురిసింది. నగరంలోని పంజాగుట్ట, అమీర్‌పేట్, ఫిలింనగర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసుఫ్ గూడ, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లక్డీకపూల్, లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లోయర్ ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్, కుత్బుల్లాపూర్, చింతల్ సాయినగర్, మల్కాజిగిరి, ముషీరాబాద్, సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షాలకు రోడ్లు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ పరిసర ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. జిహెచ్ఎంసి, డిఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

## భయోత్పాతం
(3వ పేజీ తరువాయి)

పేర్కొంది. అదే విధంగా డార్జిలింగ్‌లో ఏడుగురు మరణించారు. పోలీసులు, స్థానిక అధికారులు, విపత్తు ప్రతిస్పందన బృందాల సహాయంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షాల కారణంగా డార్జిలింగ్ సబ్‌డివిజన్‌లో సంభవించిన భారీ కొండచరియల కారణంగా ఏడుగురు మరణించారు. సహాయ, ఉపశమన చర్యలు కొనసాగుతున్నాయని డార్జిలింగ్ సబ్‌డివిజనల్ ఆఫీసర్ (ఎస్‌డిఒ) రిచర్డ్ లెప్చా పిటిఐకి తెలిపారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బాధితులకు పరిహారం ప్రకటించారు. అయితే ఎంత మంది చనిపోయారు, పరిహారం ఎంత ఇస్తారు అనేది స్పష్టంగా పేర్కొనలేదు. సోమవారం ఆమె ఉత్తర బెంగాల్‌ను సందర్శించి, పెద్ద సంఖ్యలో పర్యాటకులు ప్రభావితమైన ప్రాంతంలో పరిస్థితిని అంచనా వేయనున్నారు. నగరకటలోని ధార్ గావ్‌లో భారీ బురద అనేక ఇళ్లను నేలమట్టం చేయగా, ఆ శిథిలాల నుండి 40 మందిని రక్షించారు. ప్రాణ నష్టం బాధాకరమని ఉత్తర బెంగాల్ అభివృద్ధి మంత్రి ఉదయన్ గుహా అన్నారు. మిరిక్–సుఖియాపోఖ్రి రహదారితో సహా కీలక మార్గాల్లో కొండచరియలు విరిగిపడటంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అదే సమయంలో అనేక కొండచరియల స్థావరాలకు కమ్యూనికేషన్ లైన్లు తెగిపోయాయి. భూటాన్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఉత్తర బెంగాల్‌లోకి నీరు పొంగిపొర్లిందని, ఈ విపత్తు దురదృష్టకమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు తమ నియంత్రణకు మించినవి, ప్రధాన కార్యదర్శితో పాటు ఐదు ప్రభావిత జిల్లాల అధికారులతో వర్చువల్ సమావేశాలు నిర్వహించానని, ఉదయం 6 గంటల నుండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి సోమవారం మధ్యాహ్నం ఉత్తర బెంగాల్‌కు బయలుదేరి, ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్‌తో కలిసి సిలిగురి నుండి పరిస్థితిని పర్యవేక్షిస్తానని చెప్పారు. బెనర్జీ పేర్కొన్న మేరకు కేవలం 12 గంటల్లోనే 300 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది, దీని వలన కనీసం ఏడు ప్రదేశాలలో తీవ్ర వరదలు, కొండచరియలు విరిగిపడ్డాయి. గత నెలలో కోల్‌కతాలో పండుగల సీజన్‌లో వచ్చిన తీవ్రమైన వరదలతో ఆమె పరిస్థితినిపోల్చారు. కొండచరియలు విరిగి పడటం, రోడ్డు అడ్డంకులు కారణంగా ఈ ప్రాంతం అంతటా వేలాది మంది పర్యాటకులు చిక్కుకుపోయారని, వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. పర్యాటకులు భయపడడంగానీ, బయలుదేరడానికి తొందరపడవద్దని విజ్ఞప్తి చేశారు. విపత్తులో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వ పరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి లభిస్తుందని బెనర్జీ ప్రకటించారు. ఒక సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ భారీ, నిరంతర వర్షం సహాయక చర్యలకు తీవ్రంగా ఆటంకం కలిగించిందని అన్నారు. అనేక ఇళ్ళు దెబ్బతిన్నాయని, నష్టం ఎంత ఉందో ఇంకా అంచనా వేయలేదన్నారు.ముందు జాగ్రత్త చర్యగా మిరిక్‌లోని అనేక కుటుంబాలను సురక్షిత ప్రదేశాలకుతరలించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థలు, జిల్లా పరిపాలన సమన్వయంతో తాత్కాలిక సహాయ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈనెల 6 వరకు హిమాలయ ప్రాంతంలోని డార్జిలింగ్, కాలింపాంగ్‌తో సహా పశ్చిమ బెంగాల్‌లో అతి భారీవర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్ జారీ చేసింది.

### మృతులకు రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి 18 మంది ప్రాణాలు కోల్పోవడంతో వారి మృతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటంచారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరిగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. బాధితులకు సాధ్యమైనంత సహాయం అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## బలమైన వాదనలు వినిపిద్దాం
(3వ పేజీ తరువాయి)

తీసుకున్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, ఈడబ్ల్యుస్ రిజర్వేషన్లకు నష్టం కలిగించేదికాదని పిటిషనర్లకు మరోసారి విజ్ఞప్తి చేశారు. బలహీనవర్గాలకు చేయూతగా ఉండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను ముందుకు తీసుకుపోతున్నదని, రాజ్యాంగంలో ఎస్‌సి, ఎస్‌టిలకు ఉన్న హక్కు మాదిరిగానే బిసిలకు కూడా హక్కు ఉండాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని మంత్రి స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు మద్దతుతో ఏకాభిప్రాయంతో ఈ బిల్లు ముందుకు పోయిందని, అన్ని రాజకీయ పార్టీలు న్యాయస్థానాల్లో రాజకీయ పార్టీల మద్దతే ప్రజల మద్దతు అని చెప్పాలన్నారు. బలహీనవర్గాల సామాజిక న్యాయానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు. కొంతమంది వ్యక్తిగతంగా రెడ్డి జాగృతి పేరుతో చేస్తున్నప్పటికీ అందరికీ సంబంధంలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కల్మషం ఏర్పడే పరిస్థితులలో బలహీనవర్గాలకు పెద్దలంతా మద్దతుగా ఉండాలన్నారు. ఇదిలా ఉండగా, బిసి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన అఫిడవిట్, తాజాగా పరిణామాలపై బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌కు వివరించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఎంఎల్‌ఏ క్వార్టర్స్‌లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో సమావేశమై బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన అంశాలు, తాజాగా జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై సోమవారం సుప్రీంకోర్టులో కేసు విచారణతో పాటు 8వ తేదీన రాష్ట్ర హైకోర్టులో కూడా బిసి రిజర్వేషన్లపై విచారణ ఉన్న నేపథ్యంలో వారు ఈ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## నరకప్రాయం
(3వ పేజీ తరువాయి)

ఇబ్బందులు ఎదుర్కొకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అందుకు తగిన ఏర్పాట్లను సైతం అధికారులు ఇప్పటికే చేశారు. ప్రత్యేకంగా కరీంనగర్, ఆదిలాబాద్, హనుమకొండ, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున ప్రయాణికులు చేరుకుంటున్నారు. జూబ్లీ బస్టాండ్‌తో పాటు ఎంజిబిఎస్ వద్ధ ప్రయాణికుల రద్దీ కనిపించింది.

### హైవేపై బస్సుల మధ్య ఇరుక్కుని నుజ్జయిన కారు

నల్లగొండ జిల్లా చిట్యాల వద్ద విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన గుర్రె జోష్ కుమార్, పైల మురళితో పాటు హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన చల్లా శ్రీహర్ష సాఫ్ట్‌వేర్ జాబ్‌లు చేస్తున్నారు.ఈ ముగ్గురూ ఆదివారం తెల్లవారుజామున కారులో నందిగామ నుంచి హైదరాబాద్ నగరానికి బయలుదేరారు. చిట్యాలకి చేరుకున్న టైంలో కల్వర్టు వద్ద ముందు వెళ్తున్న ప్రైవేట్ బస్సు అకస్మాత్తుగా ఆగింది. దాని వెనుకే వెళ్తున్న కారు కూడా ఆగింది. అదే టైంలో వెనుక నుంచి వచ్చిన మరో ప్రైవేట్ బస్సు కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో 2 బస్సుల మధ్య కారు ఇరుక్కుని నుజ్జునుజ్జు అయింది. కారులో ఉన్న చల్లా శ్రీహర్ష తలకు బలమైన గాయం అయింది. జోష్ కుమార్‌కి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను వైద్యం కోసం నార్కెట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీహర్షను హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## జూబ్లీహిల్స్‌పై కాంగ్రెస్‌లో కాక
(3వ పేజీ తరువాయి)

ఆదివారం తుది కసరత్తు చేసినట్లు తెలిసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఆదివారం ప్ర జాభవన్‌లో జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ హాజరై నేతలకు మార్గనిర్ధేశం చేశారు. ఈ సమావేశానికి ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, కార్పొరేషన్ చైర్మన్‌లు, స్థానిక డివిజన్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని, గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని మహేశ్ కుమార్ గౌడ్ దిశానిర్ధేశం చేశారు.

### తుది దశకు అభ్యర్థి ఎంపిక

అయితే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియో జకవర్గ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకునట్లు తెలిసింది. అభ్యర్థి ఎంపికపై రాష్ట్ర నాయకత్వం తన కసరత్తును పూర్తి చేసి, నలుగురు ఆశావహుల పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేసినట్లు విశ్వస నీయంగా తెలిసింది. ఈ జాబితాను పార్టీ అధిష్ఠానానికి పంపనుం డటంతో, ఇప్పుడు అందరి దృష్టీ ఢిల్లీ పెద్దల నిర్ణయ ం పైనే నిలిచింది. పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఖరారు చేసిన తుది జాబితాలో మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, నవీన్ యాదవ్, కార్పొరేటర్ సిఎన్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేర్లు ఉన్నాయి. ఈ నలు గురిలో ఒకరిని ఎఐసిసి ఎంపిక చేసి అధికారికంగా ప్రకటిస్తుందని పార్టీ వర్గా లు చెప్పుతున్నాయి. స్థానికంగా బల మైన, గెలుపు గుర్రం అని భావించిన వారికే టికెట్ దక్కే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది. నాలుగురి పేర్లు ఖరారు చేసిన విషయం పార్టీ వర్గాల్లో గుప్పుమనంగా టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన ఇతర ఆశావాహులు సైతం తమ ప్రయత్నాలు కొనసాగిస్తునే ఉన్నారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, యూసుఫ్ గూడ మాజీ కార్పొరేటర్ మురళి గౌడ్ సైతం ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఎలా పరిణామాలు మలుపు తిరుగు తాయో, ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తారనే విషయం ప్రస్తుతం పార్టీ వర్గాల్లో ఉత్కంఠతంగా మారింది.

## గూడురు శ్రీగురుపీఠంలో కాకడ హారతి

ప్రజాపక్షం/శివ్వంపేట : మండలంలోని గూడురు శ్రీగురుపీఠంలో ట్రస్టు ఛైర్మన్, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో శ్రీషిరిడి సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సాయిబాబా అభిషేకం, విష్ణు సహస్త్రనామం, అనంతరం సాయినాథుడికి అభిషేకం అష్టోత్తర అర్చనలను గురుపీఠం ప్రధాన అర్చనలను గురుపీఠం ప్రధాన అర్చకులు శక్తితివారి, ఆశీష్ తివారి ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది. షోడోపచార పూజ ప్రారంభంలో ట్రస్టు మెంబర్లతో సహా దాతలు అందరి పేర్లతో గోత్ర నామాలతో సంకల్పపూజ నిర్వహించడం జరిగింది. శ్రీదత్తాత్రెయ మహాస్వామి పంచాయత గురుపరంపర దత్తావతారుల దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, మంగళహారత సమర్పించడం జరిగింది. ప్రతిరోజు మద్యాహ్నం 12 గంటలకు శ్రీషిరిడి సాయిబాబా మధ్యాహ్న హారతి ఉంటుందని సాయంత్రం 6 గంటలకు దూప్ హారతి రాత్రి 8.30 గంటలకు షేజ్‌హారతి ఉంటుందని ట్రస్టు ఛైర్మన్ శివకుమార్‌గౌడ్ తెలిపారు. ప్రతినిత్యం ఆద్యాత్మిక సూక్తులు ప్రజలకు తెలియజేయాలనే ఒక సదుద్దేశ్యంతో భజన కీర్తనలు భక్తులు ఆలపించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## కల్వర్టు లేక వాహనదారుల ఇక్కట్లు

ప్రజాపక్షం/వీపనగండ్ల: చెరువు నుంచి వచ్చే నీరు రోడ్డుపై పారుతుండటంతో ద్విచక్ర వాహనదారులు పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని బొల్లారం నుండి కొర్లకుంట వెళ్లే ప్రధాన రహదారిపై చింతల చెరువు అలుగు పారి రోడ్డుపై ప్రవహిస్తుండటంతో పాచి పేరుకుపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు పాదాచారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు చర్యలు తీసుకొని నిధులు మంజూరు చేసి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## వంతెనపై ప్రమాదం.. వ్యక్తి మృతి



ప్రజాపక్షం/కృష్ణ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కృష్ణ మండల శివారులోని కృష్ణనది వంతెనపై ఆదివారం మధ్యా హ్నం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కర్ణాటక దేవాసుగురు చెందిన ఖాజాహుస్సేర్ (40) దేవాసుగురులోని జనతా కాలనీలో నివాసం ఉంటున్నాడు తెలిపారు. ఆదివారం టైరోడ్డు నుంచి దేవాసుగురు తిరిగి వెళ్తున్న సమయంలో కృష్ణనది వంతెనపై అదుపు తప్పి వంతెన ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని రాయచూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని ఎస్సై ఎస్ఎమ్ నవీద్ తెలిపారు.

## ఎమ్మెల్యే వాహనాన్ని ఢీ కొట్టిన ద్విచక్ర వాహనం



ప్రజాపక్షం/జడ్చర్ల/మిడ్జిల్ : జడ్చర్ల నుండి కల్వకుర్తి వైపు బైకు పై వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు ఎమ్మెల్యే కారును ఢీకొట్టడంతో స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం... జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వాడ్యాల గూటు సమావేశంలో మాజీ ఎంపిటిసి సభ్యులు నరసింహ కుటుంబ సభ్యులు శుభకార్యంలో పాల్గొనడానికి వచ్చారు. ఎమ్మెల్యే కారు దిగి ఫంక్షన్ హాల్ వైపు వెళ్లారు. అదే సమయంలో ఎమ్మెల్యే డ్రైవర్ కారును రోడ్ సైడ్ తీస్తుండగా జడ్చర్ల నుండి కల్వకుర్తి బైక్‌పై వెళ్తున్న గణేష్ కారును ఢీకొట్టడంతో స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడ్డ గణేష్ తొలకొండపల్లి మండలం గట్టిపల్లి గ్రామానికి చెందిన యువకుడు. వెంటనే స్పందించిన స్థానిక కాంగ్రెస్ నాయకులు మిడ్జిల్ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. గాయపడ్డ గణేష్‌ను ఎమ్మెల్యే హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను సూచించారు. స్వల్పంగా గాయపడడంతో నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.


## ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు

ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి



ప్రజాపక్షం/మక్తల్ : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మక్తల్ మండల కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు. ఆదివారం మక్తల్ బస్టాండు ప్రధాన చౌరస్తాలలో మక్తల్ పోలీసులు ఆనంద్, శ్రీహనిలు ఆకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/ఉట్కూర్ : ఉట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003–04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం. భాస్కర్ రెడ్డి ఉపాధ్యాయులు అన్నపూర్ణ, శోభారాణి మాట్లాడుతూ, అంతంత మాత్రమే సదుపాయాలు ఉన్న నాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఆనంద్ కుమార్, గణేష్ కుమార్, మొహమ్మద్ వాహెద్ రహ్మత్, మోహన్, జి.షంషేర్, ఆరిఫ్, రమేష్ కుమార్, మల్లెపల్లి రవీందర్ పాల్గొన్నారు.

## కులగణన సమయంలో... 'వ్యక్తిగత' ప్రశ్నలు అడగొద్దు

అధికారులకు డిప్యూటీ సిఎం డి.కె.శివకుమార్ సూచన

బెంగళూరు : 'కులగణన'గా విస్తృతంగా పిలవబడే సామాజిక, విద్యా సర్వేను నిర్వహించే సమయంలో 'వ్యక్తిగత' స్వభావం గల కొన్ని ప్రశ్నలను అడగవద్దని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అధికారులకు సూచించానని ఆదివారం వెల్లడించారు. సర్వేలో ప్రజలు పాల్గొనాలని శివకుమార్ పిలుపునిచ్చారు కర్ణాటక రాష్ట్ర వెనకబడిన తరగతుల కమిషన్ ఈ సర్వేను నిర్వహిస్తోంది. సెప్టెంబరు 22న ప్రారంభమమైన ఈ సర్వే అక్టోబరు 7వరకూ కొనసాగుతుంది. 'ఎవరైనా ఏదైనా అభ్యంతరం లేవనెత్తనివ్వండి. అది (సర్వే) జరగాలి. సర్వే స్వచ్ఛందంగా జరుగుతుందని, ప్రజలు తమకు నచ్చిన దానికి సమాధానం చెప్పవచ్చని, ఏప్రశ్నకు అయినా సమాధానం ఇవ్వకూడదు అనుకుంటే ఇబ్బంది పడకూడదు అని కోర్టు చెప్పింది' అని సర్వే సమయంలో అడిగిన ప్రశ్నలకు సంబంధించి అభ్యంతరాల గురించి అడిగినప్పుడు శివకుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరులో నివసించే ప్రజలు ఎంతమంది కోళ్లు, గొర్రెలు, మేకలను పెంచుకుంటున్నారో, వారి వద్ద ఎంత బంగారం ఉంది అనే విషయమై అడగవద్దని నేను అధికారులకు చెప్పాను.

# దళారుల నుంచి భూమిని కాపాడుకుందాం

గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ నాయక్



ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల మండలం నియోజకవర్గంలోని వివిధ తండాలు గ్రామాలలో దళారులు భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని వాటిని కాపాడుకునేందుకు గిరిజన విద్యార్థి సంఘం నుంచి ముందుండి నడిపిస్తానని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వైద్య రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం నాడు జడ్చర్ల మండల పరిధిలోని కొత్త తండా మాచారం తదితర ప్రాంతాలలో కబ్జాకు గురైన భూములను జిల్లాకు సంబంధించిన అధికారులు పరిశీలించారని ఎక్కడైనా అన్యాక్రాంతమైన భూములు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కబ్జా భూములను పరిరక్షణ కొరకు తాము ముందుండి నడిపిస్తామని ఆయన అన్నారు. అదే విధంగా జడ్చర్ల పట్టణంలోని వివిధ ప్రాంతాలలో రిలేటెడ్ వ్యాపారులు గ్రామపంచాయతీ మున్సిపాలిటీలకు సంబంధించిన భూములు కబ్జా చేసుకున్నారని వారందరూ తిరిగి ప్రభుత్వానికి 10 శాత భూములు అప్పగిస్తేనే వదిలిపెడతామని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇదిలా ఉండగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రభుత్వానికి చెందాల్సిన భూమిని కబ్జా చేశారని ఇందులో కొంతమంది వివిధ రాజకీయ పార్టీ నేతలు ఉండగా మరికొందరు రిలేటెడ్ వ్యాపారులు ఉన్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగం తమదైన సరిలో విచారణ జరిపించి భూములను కావాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఆయన తెలిపారు.

# పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



ప్రజాపక్షం/ఉట్కూర్ : తెలంగాణ ప్రభుత్వం వెంటనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా ఆదివారం బిజ్వార్ గ్రామంలో విజ్ఞప్తి చేశారు. అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడి చాలా తగ్గిందని తెలిపారు. గత సంవత్సరం సరాసరి ఎకరాకు 10 క్వింటాళ్లు అయితే ఈ సంవత్సరం 4 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు అని తెలిపారు. పత్తి విత్తనాలకు, ఎరువులకు, పిచికారి మందులకు, కలుపు, పత్తి తీయుటకు మొత్తం ఖర్చు లెక్కిస్తే ఎకరాకు 30 వేల పెట్టుబడి అయ్యిందని తెలిపారు. దానికి తోడు ప్రైవేట్‌గా దళారులు క్వింటాలు పత్తికి 5000 కొనడం వలన కూలీల ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి సిసిఐ అధికారులతో మాట్లాడి పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు, ఉప్పు ఆంజనేయులు, బడేసాబ్, గుడిసె రామాంజనేయులు, మ్యాకలి ఆంజనేయులు పాల్గొన్నారు.

# బిసిలకు 50 శాతం రిజర్వేషన్ కేటాయించాలి

బ్లూ ఇండియా పార్టీ డిమాండ్



ప్రజాపక్షం/జడ్చర్ల : తెలంగాణ రాష్ట్రంలోని బిసిలకు అన్యాయం జరుగుతుందని బ్లూ ఇండియా పార్టీ పేర్కొంది. బిసి సంఘాలన్నీ ఏకతాటిపైకొచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బిసిలకు చట్టసభల్లో విద్యాపరంగా ఉద్యోగపరంగా బిసిలకు 50 శాతం రిజర్వేషన్ కావాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే అందుకుగాను స్థానిక సంస్థల బిసిల రిజర్వేషన్ కోసం 42% రిజర్వేషన్ జీవో జారీ చేస్తూ గవర్నర్‌కు పంపడం జరిగింది. రెడ్డి సామాజికవర్గానికి చెందినవారు హైకోర్టులో, సుప్రీంకోర్టులో 50%కి మించి రిజర్వేషన్ అమలు చేస్తున్నారని కోర్టులో కేసు వేయడం జరిగింది. దీనిని బ్లూ ఇండియా పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. బిసిలు రాజకీయపరంగా ఎదగకూడదని బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ చూస్తున్నారు. అందుకుగాను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. బిసిల ఓట్లతో గెలిచిన పార్టీలు బిసిలకు విద్యాపరంగా రాజకీయపరంగా, ఆర్థికపరంగా, ఉద్యోగపరంగా, సామాజిక సమానత్వ ఇవ్వకుండా బిసిలకు కాంగ్రెస్ అయినా బిజెపి అయినా టిఆర్ఎస్ అయినా తీవ్రంగా అన్యాయం చేస్తున్నాయి. దీనిని సహించేదే లేదని బ్లూ ఇండియా పార్టీ ముక్తకంఠంతో హెచ్చరిస్తున్నాం. బిసిలతో ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన పార్టీలు ఈరోజు అదే బిసిలకు అన్యాయం చేస్తుంటే బ్లూ ఇండియా పార్టీ చూస్తే ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. ఏ ప్రభుత్వమైనా ఏ పార్టీ అయినా బిసిలకు గాని ఎస్సీలకు గాని ఎస్టీలకు గాని వెనుకబడిన ప్రజలగాని మౌలిక సదుపాయాలు గాని ప్రజల అవసరాలు తీర్చడానికి ప్రభుత్వాలు పని చేయాలి అంతేగాని తమ ఇష్టం వచ్చినట్లు కొందరికి రిజర్వేషన్లు ఇస్తూ కొందరికి రిజర్వేషన్లు ఇవ్వకుండా చోద్యం చేస్తుంటే వచ్చే ఎలక్షన్లో బిసిల సత్తా ఏమిటో బ్లూ ఇండియా పార్టీ సత్తా ఏమిటో మీకు చూపిస్తుంది. గతంలో టిఆర్ఎస్ పార్టీ బిసిలకు రిజర్వేషన్ ఇవ్వకుండా ఉన్న రిజర్వేషన్ల కోత విధిస్తూ 2018లో 32% ఉన్నారు. రిజర్వేషన్‌ని 18 శాతానికి తగ్గిస్తూ జీవో జారీ చేసింది. బీసీలకు అన్యాయం చేసింది బీసీలను విద్యాపరంగా, ఉద్యోగ పరంగా, సామాజికపరంగా, ఆర్థికంగా, అభివృద్ధి చేయవలసిన టిఆర్ఎస్ పార్టీ బీసీలకు గొర్రెలు, గేదెలు, చేపలు ఇస్తాం అని బిసిలను అవమానపరిచింది. దానికి అనుగుణంగా 2023లో బిసిలు అందరు ఏకతాటిపైకి వచ్చి టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని బిసిలు బొంద పెట్టినారు. మరి ఈరోజు బిజెపి బిసిలపై కపట ప్రేమ చూపిస్తుంది. బిసిలపై ఏమాత్రం ప్రేమ ఉన్న ఈ మూడు పార్టీలు గవర్నర్ దగ్గరికి వెళ్లి 42% రిజర్వేషన్ మీద సంతకం పెట్టమని పెట్టమని గవర్నర్‌ని మూడు పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్ కోరాలని బ్లూ ఇండియా పార్టీ గట్టిగా డిమాండ్ చేస్తుంది. బిసిలపై కపట ప్రేమ చూపిస్తూ రిజర్వేషన్ ఏమాత్రం తగ్గిన ఈ మూడు పార్టీలు రాబోయే ఎలక్షన్‌లో 2029 ఎలక్షన్ లో మూలం చెల్లించుకొక తప్పదు అని అన్నారు.

## ఘనంగా దుర్గామాత శోభాయాత్ర



ప్రజాపక్షం/బిజినేపల్లి : మండలపరిధిలోని పాలెం గ్రామంలో శనివారం శ్రీఅలివేలు మంగసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో రాత్రి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత శోభాయాత్ర అత్యంతవైభవంగా టీచర్స్ కాలనీ, రామాలయం, కాలేజిరోడ్, గాంధీచౌక్, రచ్చకట్టనుండి పెంటోని చెరువులో నిమజ్జనం చేశారు. శ్రీపద్మావతి మాతృమండలి ఫ్రెండ్స్‌యూత్‌క్లబ్ సభ్యులు అభిషేకంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కొరివిరామానుజచార్యులు, జయంత్, వంశీకృష్ణచార్యుల ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ, దుర్గాహోమం, పూర్ణహుతి శ్రీసూక్తం ఆధారంగా వేదమంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో పద్మావతిమాతృమండలి సభ్యులు రాజేశ్వరి, రజిత, మంజుల, పద్మ, లక్ష్మి దేవమ్మ, కవిత, వానిభాయ్, ఫ్రెండ్స్ యూత్‌క్లబ్ సభ్యులు ప్రమోద్‌కుమార్, ఆనంద్, వినయ్, ఆనంద్‌సింగ్, కార్తీక్‌కుమార్, నర్సింహ్మా, శ్రీనివాస్, శేఖర్, కృష్ణతేజ పాల్గొన్నారు.

## చిన్నారెడ్డి ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు పట్టణ కేంద్రంలో శ్రీశ్రీశ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి పెబ్బేరు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. మండల నాయకులు చిన్నారెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, పెబ్బేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ మన్యం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సహదేవుడు, కృపాకర్ రెడ్డి, మహేష్ కుమార్ రెడ్డి, ఆనంద్ సాగర్, ఎల్లస్వామి, తిరుపతయ్య, రాజునాయక్, సతీష్, మహేష్ శెట్టి, సుబ్బయ్యశెట్టి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



ప్రజాపక్షం/ఉట్కూర్ : ధ్వంసమైన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని భాజపా సీనియర్ నాయకులు బిజ్వార్ మహేష్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పులిమామిడి నుంచి బిజ్వార్ మీదుగా అవసలోనిపల్లి, పెద్ద జట్రం వెళ్లే రహదారితో పాటు, మగ్ధంపూర్ నుంచి ఉట్కూరు అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా ధ్వంసం అయ్యాయని వాహనదారులు ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారని తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు పూర్తిగా దెబ్బతిన్న రహదారులను పర్యవేక్షించి వెంటనే మరమ్మతులు చేసి ప్రయాణికులు ఇబ్బందులు తొలగించాలని మహేష్ గౌడ్ కోరారు.

# ఢిల్లీలో వేర్వేరు దాడుల్లో 1,700 కిలోల బాణసంచా స్వాధీనం



న్యూఢిల్లీ : దేశ రాజధాని అంతటా జరిగిన వేర్వేరు ఆపరేషన్లలో ఢిల్లీ పోలీసులు 1,700 కిలోలకు పైగా నిషేధిత బాణసంచా స్వాధీనం చేసుకుని, ఏడుగురిని అరెస్టు చేశారని ఆదివారం ఒక అధికారి తెలిపారు. ద్వారక, రోహిణి, ఉత్తమ్ నగర్, శాస్త్రి నగర్, ముకుంద్‌పూర్, షాహ్దరాలో ఢిల్లీ పోలీసుల క్రైమ్ బ్రాంచ్ నిర్వహించిన దాడులను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పంకజ్ కుమార్ తెలిపారు. వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి, ప్రజల భద్రత కోసం బాణసంచా నిల్వ, అమ్మకాలను అరికట్టడానికి సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈ ఆపరేషన్లు జరిగాయని ఆయన అన్నారు. ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామని, 1,645 కిలోల బాణసంచా, ఒక పికప్ ట్రక్కును స్వాధీనం చేసుకున్నామని డిసిపి తెలిపారు. ఈశాన్య ఢిల్లీలోని మండోలిలో మరో దాడిలో ఒక కిరాణా దుకాణం యజమాని నుండి 106 కిలోల నిషేధిత బాణసంచా స్వాధీనం చేసుకోగా, అక్రమ బాణసంచా మొత్తం 1,751 కిలోలకు చేరుకుంది. మొదటి ఆపరేషన్‌లో, ద్వారక, రోహిణి, ఉత్తమ్ నగర్‌లలో జరిపిన దాడుల్లో 916 కిలోలకు పైగా నిషేధిత బాణసంచా నిల్వను ఒక బృందం కనుగొన్నట్లు అధికారి తెలిపారు. సమాచారం మేరకు, ఒక బృందం కిరాణా దుకాణం యజమాని ఆకాష్ గుప్తా (24)ను అతని ఇంటి నుండి 13 కార్టన్లు, వివిధ రకాల నిషేధిత బాణసంచా సంచిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు డిసిపి తెలిపారు. విచారణ సమయంలో, గుప్తా పికప్ డ్రైవర్ చందర్ కాంత్ (36) నుండి బాణసంచా కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు, తరువాత అతను రోహిణిలో తన వాహనంలో మరో 400 కిలోల అక్రమ బాణసంచాతో పట్టుబడ్డాడు. చందర్ కాంత్ వెల్లడించిన వివరాల ఆధారంగా, ఉత్తమ్ నగర్‌లోని రిషి రాజ్ (37) అనే మరో వ్యక్తి ఇంట్లో పోలీసులు దాడులు నిర్వహించి, అదనంగా 182 కిలోల నిషేధిత బాణసంచా స్వాధీనం చేసుకున్నారని అధికారి తెలిపారు. మరో ఆపరేషన్‌లో, శాస్త్రి నగర్ నివాసి రాహుల్ సాగర్ (34)ను అరెస్టు చేసి, అతని ఇంటి నుండి 412 కిలోల అక్రమ బాణసంచా స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. సాగర్‌పై గతంలో నాలుగు క్రిమినల్ కేసులు ఉన్నాయని, వాటిలో నేరపూరిత హత్యాయత్నం, గాయపరచడం, ఢిల్లీ ఎక్సైజ్ చట్టాన్ని ఉల్లంఘించడం వంటి కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ముకుంద్‌పూర్‌లోని భలాస్వా డైరీ ప్రాంతంలో మరో దాడి నిర్వహించి, సోను (30)ను అరెస్టు చేసి, ఎల్ఇడి బల్బుల తయారీ యూనిట్ పేరుతో నివాస భవనంలో దాచిపెట్టిన 311 కిలోల నిషేధిత బాణసంచా స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. షాదారాలోని అశోక్ నగర్ మార్కెట్‌లో నిషేధిత బాణసంచా విక్రయిస్తున్న విశాల్ శర్మ (34)ను కూడా ఒక బృందం పట్టుకుంది. అతని వద్ద నుండి 106 కిలోల అక్రమ నిల్వను స్వాధీనం చేసుకుంది. ఢిల్లీ పోలీసులు ఒక కిరాణా దుకాణం నుండి 106 కిలోల అక్రమ బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. ఈశాన్య ఢిల్లీలోని మండోలిలో ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. సమాచారం మేరకు, మెయిన్ మండోలి రోడ్‌లోని బిబ్లాక్ వద్ద ఒక బృందం దాడి చేసింది. విచారణ సమయంలో నిందితుడు తన ప్రమేయాన్ని అంగీకరించాడని, జ్యోతి నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడిందని పోలీసులు తెలిపారు.

# తక్కువ ఖర్చుతో క్షయ నిర్ధారణకు తెలంగాణ 'హ్యూవెల్ లైఫ్ సైన్సెస్' సంస్థ కృషి

ఫాస్ట్ డిటెక్షన్ కిట్‌కు ఐసిఎంఆర్ గుర్తింపు

న్యూఢిల్లీ: దేశంలో క్షయవ్యాధి నిర్మూలించాలంటే వీలైనంత ముందరి దశలోనే ఆ రోగ లక్షణాలను కనిపెట్టాలి. క్షయ వ్యాధి లక్షణాలను ముందు దశలోనే నిర్ధారించడానికి తక్కువ ధరల దేశీయ పద్ధతులకు ఐసిఎంఆర్ ఆమోదం తెలియజేసింది. ఇలా తక్కువ ధరలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి రోగాన్ని నిర్ధారిస్తే ఈ వ్యాధికి చికిత్సచేసి అంత తొందరగా నిర్మూలించడం సాధ్యపడుతుంది. ఈ విధంగా దేశంలో క్షయ వ్యాధి నిర్మూలనలో ఒక పెద్ద ముందు అడుగు పడింది. తెలంగాణకు చెందిన హ్యూవెల్ లైఫ్ సైన్సెస్ తక్కువ ధరలో క్షయ వ్యాధి రోగ నిర్ధారణకు సంబంధించిన పరికరాలను కనుగొంది. వైద్యపరికరాల తయారీసంస్థ ''హ్యూవెల్ లైఫ్ సైన్సెస్'' అభివృద్ధి చేసిన క్వాంటమ్ ఫ్లక్స్ 'ఎంటిబి ఫాస్ట్ డిటెక్షన్ కిట్'కు ఐసిఎంఆర్ (భారత వైద్య పరిశోధనా మండలి) గుర్తింపు ఇచ్చింది. నిర్దిష్టమైన మొండివ్యాధులు, ఆరోగ్యవిషయాలపై పరిశోధనలు చేసి పరిష్కారాలు సాధించే దేశ అత్యున్నత సంస్థ ఐసిఎంఆర్. శ్వాసకోశాలకు సంబంధించిన క్షయరోగ క్రిములను కనుగొనేందుకు అత్యాధునిక క్వాంటమ్ పద్ధతులలో చేయవచ్చు. దేశంలోని 96 శాంపిల్స్‌ను క్వాంటమ్ ఫ్లక్స్ ద్వారా పరీక్షలు చేయవచ్చు. క్షయ క్రిములను కనిపెట్టే ప్రక్రియకు దీనిని ఉపయోగిస్తే ఖర్చు తగ్గుతుంది. భారీగా యంత్రాలకోసం పెట్టుబడులు కూడా దీనికోసం సమకూర్చాల్సిన అవసరం ఉండదు. దేశీయంగా యూనిఎఎంపి ఎంటబి నూక్లియక్ యాసిడ్ టెస్ట్ కార్డును కూడా దేశీయంగా తయారు చేశారు. దీనికి కూడా ఐసిఎంఆర్ గుర్తింపు లభించింది. దీనిని కూడా హ్యూవెల్ లైఫ్‌సైన్సెస్ తయారు చేసిందని ఐసిఎంఆర్ ఒక ప్రకటనలో తెలియజేసింది. రోగులకు ఎలాంటి మానసిక,శారీక కష్టాలు లేకుండా వారికి సులభంగా ఉండేవిధంగా ఈ క్షయవ్యాధి రోగ నిర్ధారణ కిట్‌ను హ్యూవెల్ లైఫ్‌సైన్సెస్ తయారు చేసింది. ఇదొక మైలురాయి ఘట్టం. సంక్లిష్టమైన పరీక్షలు లేకుండా చాలా సులభంగా ఈ పరీక్షల విధానం ఉంటుంది. ఇప్పటివరకూ సంప్రదాయబద్ధంగా క్షయరోగికి రోగ నిర్ధారణ చేయడానికి చాలా సంక్లిష్టమైన పరీక్షలు ఉండేవి. ఇకమీదట రోగులు అలాంటి ఇబ్బందులు లేకుండా ఈ రోగ నిర్ధారణ పరీక్షలు చేసుకోవచ్చునని ఐసిఎంఆర్ వ్యాధి సంక్రమణ నియంత్రణ విభాగం అధిపతి డాక్టర్ నివేదితా గుప్తా చెప్పారు. ఈ కిట్‌వల్ల టిబి రోగులకు ప్రయాస తగ్గుతుంది. వ్యాధి నిర్ధారణ విషయంలో ఖర్చు తగ్గుతుంది.

బార్బడోస్‌లో కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు...

# లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రతినిధి బృందం

న్యూఢిల్లీ : బార్బడోస్‌లో జరుగుతున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ (సిపిసి)కు హాజరయ్యే 35మంది ప్రిసైడింగ్ అధికారుల ప్రతినిధి బృందానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సారథ్యం వహించనున్నారు. వారం రోజుల పాటు ఈ సిపిసి జరుగనుంది. 'కామన్వెల్త్ ఒక ప్రపంచ భాగస్వామి'అనే అంశంపై సమావేశం సాధారణ సభలో ఓం బిర్లా ప్రసంగించనున్నారు. లెవరేజింగ్ టెక్నాలజీడిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్స్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని మెరుగుపర్చడం మరియు డిజిటల్ అంతరాయాన్ని ఎదుర్కోవడం అనే అంశంపై నిర్వహించనున్న వర్క్‌షాప్‌కు కూడాఅధ్యక్షత వహించనున్నారు. లోక్‌సభ సెక్రటేరియట్ విడుదల చేసిన ఒక ప్రకటన వెల్లడించిన ప్రకారం 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ అక్టోబరు 5 నుంచి 12 వరకు జరుగనున్నాయి. ఈ పర్యటన సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కామన్వెల్త్ దేశాలకు చెందిన తన సహచర స్పీకర్లతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తారని, పరస్పర ఆసక్తి, పార్లమెంటరీ సహకారం గురించి చర్చిస్తారని ప్రకటన తెలిపింది. లోక్‌సభ సభ్యులు, బిజెపి నాయకురాలు దగ్గుబాటి పురంధేశ్వరి కామన్వెల్త్ ఉమెన్ పార్లమెంటేరియన్ల (సిడబ్ల్యుపి) సమావేశానికి హాజరయ్యేలా షెడ్యూల్ ఖరారైంది. 'కామన్వెల్త్ వ్యాప్తంగా లింగసున్నితమైన పార్లమెంట్‌లను గ్రహించడానికి మంచి పద్ధతులు మరియు వ్యూహాలు' అనే అంశంపై జరుగనున్న కామన్వెల్త్ ఉమెన్ పార్లమెంటేరియన్ల సదస్సులో ఆమె ప్యానలిస్టుగా కూడా ఉన్నారు. భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందం సభ్యులు ఏడు థెమటిక్ వర్క్‌షాప్‌లలో పాల్గొంటారు. వాటిలో 'ప్రజాస్వామ్యానికి మద్దతు ఇవ్వడానికి మన ప్రయత్నాలను బలోపేతం చేయడం' సహా 'సాంకేతికతను పెంచడం' : 'డిజిటల్ పరివర్తనలను మెరుగుపచడం మరియు డిజిటల్ అంతరాన్ని ఎదుర్కోవడం' సిహెచ్‌ఓజిఎం (చోగమ్) 2026కు ముందు ప్రజాస్వామ్యంలో పారదర్శకత మరియు విశ్వాసాన్ని నిర్మించడం, పార్లమెంట్స్ మరియు ఎన్నికలల్లో ఆర్థికపరమైన పారదర్శకత తదితర వర్క్‌షాప్‌లలో పాల్గొంటారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి భాగస్వాములైన ప్రిసైడింగ్ అధికారులు, రాష్ట్ర కార్యదర్శులు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన లెజిస్టేచర్లతో కూడిన భారత ప్రతినిధి బృందానికి సారథ్యం వహిస్తారు.

## చట్టాలపై ప్రజలకు అవగాహన

ప్రజాపక్షం/మోటకొండూర్ : రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ ఆదేశానుసారం సాయంత్రం సమయంలో పోలీస్ అధికారులు సైకిళ్లపై పెట్రోలింగ్ చేస్తూ గ్రామంలోని కాలనీలో తిరుగుతూ ప్రజల్ని గ్యాథరింగ్ చేసి ప్రజలకు చట్టాలపైన ప్రస్తుతం జరుగుతున్నటువంటి ఆన్లైన్ మోసాల పైన, బ్యాంక్స్ మోసాల పైన, చీటింగ్‌ల పైన, సైబర్ నేరాలు పైన అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర సమయంలో 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అలాగే నేరాల నియంత్రణకు ప్రజల యొక్క సహాయ సహకారాలు వారి నుంచి సమాచారం అవసరమని మోటర్ కొం దూరు మండలం హెడ్ కోట లో ఎస్ఐ , తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తూ ప్రజల్ని చైతన్య పరుస్తూ ప్రజలకి చట్టాల పైన అవగాహన చేశారు.



## సిపిఐ అభ్యర్థులను గెలిపించుకుందాం

ప్రజాపక్షం/మర్రిగూడ: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ అభ్యర్థులను గెలిపించుకోవడానికి పార్టీ నిర్ణయం మేరకు కార్యకర్తలు పని చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్ కోరారు. కొండూరు గ్రామంలో ఆదివారం జరిగిన సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలలో ఎంపిటిసి,జడ్పిటిసి లు గా సిపిఐ అభ్యర్థులను,గ్రామ సర్పంచ్,వార్డు మెంబర్ గా సిపిఐ మద్దతుదారులను గెలిపించుకోవాలని ఆయన అన్నారు.ఈ సమావేశానికి గ్రామ నాయకులు ఆకల వెంకట్రామ్ పటేల్ అధ్యక్షత వహించగా సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఆకుల రఘుమయ్య పటేల్, గ్రామ కార్యదర్శి వడ్డేమాన్ వెంకటయ్య,సహాయ కార్యదర్శి జరుపుల రామరాజు నాయక్, నాయకులు ఈద మారయ్య,బడేటి పెద్దయ్య,ఉప్పునూతల సత్త య్య, ఆంబోతు నవీన్ నాయక్ పాల్గొన్నారు.



## 10వరకూ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల తుది గడువు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి డిగ్రీ అడ్మిషన్లు ఈనెల 10 వరకు ఉన్నట్లు ఎల్.ఎస్.ఎస్.బి డైరెక్టర్ డా. వై వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ ఫీజుకే నాణ్యమైన విద్యను అందిస్తూ ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. బిఏ, బికాం, బిఎస్సిలో చేరే విద్యార్థులు ఇంటర్ లేదా ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ 10+2 ఉత్తీర్ణులు కావాలన్నారు. విద్యార్థులు దరఖాస్తుల కోసం www.braouonline.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. రిటైల్ రంగంలో ఉపాధి కల్పించడానికి ఆర్.ఏ.ఎస్.సి.ఐ సంస్థతో యూనివర్సిటి ఒప్పందం చేసుకుందన్నారు. విద్యార్థులు ఒకేషనల్ ట్రైనింగ్‌లో ఆసక్తి ఉంటే రామానందతీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ కల్పిస్తున్నామన్నారు. సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు పీజీలో సామాజిక శాస్త్రాలు చదువుకునే అవకాశం ఉందన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పిజి కోర్సులను చదువుకోవచ్చన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు : కలెక్టర్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : గ్రామ పంచాయితీ, జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయితీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తరువాత ప్రజావాణి కార్యక్రమాన్ని యదావిధిగా నిర్వహించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. అందువల్ల జిల్లాలోని ప్రజలు ఫిర్యాదులను సమర్పించేందుకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఆయన కోరారు.

## సర్వీసుల్లో ఉన్న ఉపాధ్యాయులకు 'టెట్' మినహాయిపు ఇవ్వాలి





ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: సర్వీసుల్లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయిపు ఇవ్వాలని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎస్‌టియుటిఎస్ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు కొణకంచి వీర,రాఘవులు అధ్యక్షతన ఎస్‌టియు భవన్ లో జరిగింది.ఈ సమావేశానికి హాముఖ్య అథిదిగా హాజరైన సదానందం గౌడ్ ప్రసంగిస్తూ పెండింగ్‌లో ఉన్న డిఎ లను తక్షణమే విడుదల చేయాలని, పిఆర్‌సి ని వెంటనే అమలు చేయాన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యకులుగా కొణకంచి వీరరాఘువులు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తండు భిను భానుప్రకాశ్ గౌడ్, రాష్ట్ర కౌన్సిలర్న్ గాకె. నరెందర్ రెడ్డి,జి. విజయప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా కె. వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులుగా కారింగు దతేశ్వర్, ఉపాధ్యక్షులుగా జాన్ ఖాన్, బి. నాగేశ్వర రావు,కె.లింగయ్య,మహిళ ఉపాధ్యక్షులుగాజి ఉదయరాణి,ఎస్‌కె సమీన అదనపు ప్రధాన కార్యదర్శిగా కార్యదర్శిగా ఎం. రమేష్, కార్యదర్శులుగా పుట్ట శ్రీలత, ఆర్.లాలు, శంకరయ్య, హరిస్మిత,ఆర్థిక కమిటి సభ్యులుగా వి. లాజర్, రేణుక, రేణుకా దేవిలను ఏకగ్రివంగా ఎనుకున్నారు.

## అకాల వర్షాలతో.... పత్తి రైతుల ఆశలు గల్లంతు

దిక్కుతోచని స్థితిలో పత్తి రైతు...ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నపం



ప్రజాపక్షం/గుండాల : అకాల వర్షాలతో ఈ ఏడు పత్తి రైతుల ఆశలు గల్లంతు అయ్యాయి. పత్తి పంట పూత పూసి కాయ కాసి కాయ పగిలే సమయానికి పత్తి పంటపై వరుణుడు కన్నెర్ర చేసి పత్తి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గుండాల మండల వ్యాప్తంగా రైతులు పత్తి సాగువైపు మొగ్గుచూపి పంట పిండిస్తున్న వేళ మంచి పంట పండి లాభాలు మిగులస్తుందన్న సమయంలో అకాల వర్షాలకు రైతులు వేసిన పత్తి పంట కాయక ముందే తీవ్ర నష్టాలను మిగిల్చింది. అకాల వర్షాలకు తోడుగా పత్తిలో వచ్చే తెగుళ్ళతో రైతుకు తీరని నష్టాల భారీన పడుతున్న పరిస్థితి నెలకొంది. గత మూడు సంవత్సరాల నుండి నష్టాల భారీన పడుతున్న పత్తి రైతుకు ఈ ఏడు కూడా వర్షాల వలన నష్టం వాటిల్లడం జరగడంతో ఎటు పాలుపోలేని పరిస్థితిలో రైతన్న దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఒక వైపు పంటలను కౌలుకు తీసుకొని అప్పులు తెచ్చి పంట వేసుకుని పండించిన పంటను మార్కెట్లో అమ్ముకొని డబ్బులు సంపాదించుకుందామని కౌలు రైతులు ఎంతో ఆశతో ఉన్న తరుణంలో వర్షాలు, తెగుళ్ల వల్ల తీవ్ర నష్టం వాటిల్లి రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు క్షేత్ర స్థాయిలో అధికారులను రైతుల వద్దకు పంపి పంట నష్టాలను పరిశీలించి నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మాజీ ఇండియన్ క్రికెటర్, చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డు క్రికెట్ గ్రౌండ్‌లో ఎంఎస్‌కె ప్రసాద్ ఇంటర్నేషన్ క్రికెట్ అకాడమీ సూర్యాపేట ఆధ్వర్యంలో ఎంఎస్‌కె ఐసిఏ అండర్ 16 క్రికెట్ టోర్నమెంట్‌ను గత పది రోజుల పాటు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫ్రీడమ్ క్రికెట్ అకాడమీ నల్లగొండ వారికి ప్రథమ స్థానం రాగా, ఎంఎస్‌కె ప్రసాద్ క్రికెట్ అకాడమీ సూర్యాపేట వారికి ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్జున్ అవార్డు గ్రహీత నాగపురి మరేష్, నల్లగొండ జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీన్ బాబా, డాక్టర్ సందీప్, మున్సిపల్ ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ భరత్, హెడ్‌కోచ్ ఉస్మద్ పాల్గొన్నారు.

# సాగర్ మొత్తం గేట్లు మూసివేత



ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు శ్రీశైలం నుంచి వస్తున్న వరద ప్రవాహం బాగా తగ్గిపోవడంతో ఆదివారం అధికారులు ప్రాజెక్ట్ మొత్తం గేట్లు మూసివేశారు. గత కొన్ని రోజులుగా రెండు లక్షలకు పైగా ఉన్న ఇన్ ఫ్లో క్రమంగా తగ్గుతూ ఆదివారానికి 63398 క్యూసెక్కులుగా ఉండటంతో మొత్తం గేట్లను మూసివేశారు.ఆదివారం ఉదయం 10 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల హఠాత్తుగా వరద ప్రవాహం తగ్గిపోవడంతో రెండు గేట్లకు కుదించారు ఆతరువాత వెంటనే మొత్తం గేట్లను మూసివేశారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను ఆదివారం సాయంత్రానికి 587.50 అడుగులుగా ఉన్నది. కుడి ఎడమల కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తూ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 63398 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వస్తూఉంటే 55537 క్యూసెక్కుల నీటిని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు.

### సాగర్‌లో క్రిక్కిరిసి నపర్యాటకులు ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం..

సాగర్ అందాలను తిలకించడానికి వచ్చిన పర్యాటకులతో సాగర్ పరిసర ప్రాంతాలలో ఆదివారం సెలవు రోజు కావడంతో పర్యాటకుల సందడి నెలకొంది. గత కొన్ని రోజులుగా 26 గేట్ల ద్వారా కొనసాగించిన నీటి విడుదల ఆదివారం మొత్తం గేట్లను మూసివేసిన కూడా పరిసర ప్రాంతాలు పర్యాటకులతో అత్యంత రద్దీగా మారటం గమనార్హం. వాహనాల రద్దీ భారీగా పెరగడంతో స్థానికంగా ఉ న్న లాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త , పాత వంతెనల వద్ద పర్యటకులతో కిక్కిరిసిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు ట్రాఫిక్ ను పునరుద్ధరిస్తూ ఉన్నారు. అయితే ప్రాజెక్ట్ మొత్తం గేట్లు మూసివేయడంతో పర్యాటకులు నిరాశతో వెను తిరుగుతున్నారు.



# బీమా ఉద్యోగుల పోరాట ఫలితమే జిఎస్‌టి రద్దు

ఐసిఇయు సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి డి.యస్.రఘు




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియే షన్ పోరాట ఫలితమే అని సంఘం సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి డిఎస్ రఘు అన్నారు. ఐసిఇయు నల్లగొండ 1,2, ఎల్‌ఐసీ శాఖల సాధారణ సర్వసభ్య సమావేశం నల్లగొండ పట్టణంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డిఎస్ రఘు మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజ్ఞప్తులు ఇవ్వడంతోపాటు ఎన్నో ఆందోళనలు చేశామన్నారు. ఎల్ ఐసీలో ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చే న్యూ లేబర్ కోర్టులను రద్దు చేయాలని, 100 యఫ్.డి.ఐ. పెంపుదలను ఉపసహరిం చుకోవాలని ఈ సందర్భంగా డి.ఎస్ రఘు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐసిఈయు డివిజన్ కోశాధికారి జావీద్,జిల్లా సంయుక్త కార్యదర్శి పెరుమాళ్ళ బాల స్వామి, డివిజన్ నాయకులు గడ్డం నవీన్ దాస్, బి.రాములు యాదవ్, బెల్లంకొండ కన్నయ్య, బ్రాంచ్ 1,2 అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు వెంకన్న, పోలె లింగయ్య, వేముల కృష్ణయ్య వేముల శ్రీను తదితర లు పాల్గొన్నారు. బ్రాంచ్ మేనేజర్లు గౌరు శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వర రెడ్డి, ఎంతో శ్యాంబాబు, లియాఫీ నాయకులు నరేందర్ రెడ్డి, రావుల వీరయ్య, ఏఓఔ నాయకులు నలపరాజు సైదు లు, దారం వెంకన్న, క్లియా ఏజెంట్లు నాయకులు బి.రామలింగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ వన్ టూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొప్పు వెంకన్న తదిరులు పాల్గొన్నారు.

## బిసిల రిజర్వేషన్‌ను అడ్డుకోవడం సిగ్గుచేటు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్ర జనాభాలో 60శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటే కొంతమంది రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టుల ద్వారా అడ్డకోవాలని చూడడం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలు బీసీలు వారి జనాభా కంటే అన్ని రంగాల్లో తక్కువ శాతం అనుభవిస్తున్నారని, బీసీలు ఉంది 60శాతం అయితే వారికి కల్పిస్తామన్న 42శాతంలో కూడా కొంతమంది కుట్రలు పన్ని అడ్డుపడుతున్నారని అన్నారు. కొందరు అగ్రవర్ణాల నాయకులు సుప్రీంకోర్టులో దాఖలు వేశారని, ఇన్ని సంవత్సరాలు బీసీలకు రావాల్సిన వాటాను అగ్రకులాల వారు అనుభవించడం లేదా అని ప్రశ్నించారు. రిజర్వేషన్ వ్యతిరేకులన తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రానికి చెందిన ఆల్ఫా పబ్లిక్ స్కూల్ లో 2004/05 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు పట్టణంలోని మనోరమ హోటల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆల్ఫా స్కూల్ కరస్పాండెంట్ కరస్పాండెంట్ బాధిని నరసింహా మాట్లాడుతూ 20 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక స్టేజి మీద కలపడం గొప్ప విశేషమని అన్నారు.నాటి ఉపాధ్యాయులను కూడా గుర్తించుకొని విద్యార్థులు వారిని సన్మానించడం చాలా అభినందనీయమని అన్నారు.ఆల్ఫా స్కూల్లో చదివి ప్రస్తుతం గొప్ప స్థానంలో ఉన్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను పూర్వ ఉపాధ్యాయులను విద్యార్థులు సాలువలతో పూలమాలలతో సన్మానించి మెమొంటోలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాస్, లింగయ్య,రమవాణి, నసీం, శంకరయ్య, రవీందర్, అహ్మద్ అలీ ఖాన్, సురేష్ రెడ్డి, ప్రసాద్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు సందీప్, ప్రియాంక,ఉష, మహేష్, అనిల్,ఫణ్ణి తదితరులు పాల్గొన్నారు.

## కాకా సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/యాదాద్రి : మాజీ కేంద్ర మంత్రి, పార్లమెంట్ సభ్యులు గడ్డం వెంకట స్వామి 96వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాసవి సేవా సమితి ద్వారా సామాజిక సేవలు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేట జిల్లాలో మొట్టమొదటి సారిగా శ్రీవాసవి సేవా సమితి ద్వారా సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్లు శ్రీవాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో గల శ్రీవాసవి ఎన్‌క్లైవ్‌లో గల శ్రీవాసవి సేవా సమితి జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల క్రితం వనపర్తిలో పూరి సురేష్ ఏర్పాటు చేసిన సేవాసమితి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కరోనా సమయంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో సుమారు 50వేల మందికి ఆనందయ్య మందు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. పేద ఆర్యవైశ్యులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు సేవలు సూర్యాపేట జిల్లాలో అందించనున్నట్లు తెలిపారు. నేటి యువత స్వచ్ఛంద సంస్థలో సభ్యులుగా చేరి సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సోమా ప్రవీణ్, శ్రీరంగం రమేష్, తోట అరుణ్‌కుమార్, అనంతుల రాజేశ్వర్, దేవరశెట్టి నాగరాజు, కొండ అనిల్ కుమార్, చందా రాజశేఖర్, కుంచపర్తి రాజశేఖర్, తాటిశెట్టి హనుమంతు, కలకోటి నర్సయ్య పాల్గొన్నారు.

## మానవతా స్పృహ కలిగిన ఆర్తి కవి బైరెడ్డి కృష్ణారెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఆర్తి, ఆవేశం, మానవీయ స్పృహ తో కూడిన కవిత్వం తో బైరెడ్డి కృష్ణారెడ్డి రాసారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కె. కనకాచారి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్పిఆర్ స్కూల్లో జరిగిన బైరెడ్డి కృష్ణారెడ్డి ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెరుమాళ్ళ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కనకాచారి మాట్లాడుతూ ఆర్తి కవిగా బైరెడ్డి కృష్ణారెడ్డి తెలుగు సాహిత్యంలో లబ్ద ప్రతిష్టుడు అన్నారు. ఇటీవల సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం బైరెడ్డి కృష్ణారెడ్డికి కవిత్వంలో కీర్తి పురస్కారం ప్రకటించిన సందర్భంగా నల్లగొండ సాహిత్య సంస్థలు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మేరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఆర్తి పేరుతో కవిత్వ సంపుటాలు వెలువరిస్తూ తనదైన ముద్ర వేశారన్నారు. మునాసు వెంకట్ మాట్లాడుతూ తన కవిత్వాన్ని తానే పదేపదే పునర్మూల్యాంకనం చేసుకుంటూ స్వచ్ఛమైన కవిత్వాన్ని వెలువరించిన కవి గా బైరెడ్డి కృష్ణారెడ్డిని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో డా. తండు కృష్ణ కౌండిన్య, కోమటి మధుసూదన్, మాదగాని శంకరయ్య, డాక్టర్ పగడాల నాగేందర్, ఎలికట్టె శంకర్రావు, డాక్టర్ హిమవంత రెడ్డి, బండారు శంకర్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, భీమార్జున్ రెడ్డి, దాసరి శ్రీరాములు, డాక్టర్ మేక ఉమారెడ్డి, గంటెకంపు గణేష్, డాక్టర్ దైద రవి, సంధ్య, అంబటి వెంకన్న, దేవులపల్లి రామచంద్రయ్య, డాక్టర్ చింతోజు మల్లికార్జున చారి, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మా గోడు పట్టదా?



జూలూరు-రుద్రవెల్లి మూసీనది వరద ఉద్ధృతి..

బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాక ప్రయాణికులు అష్టకష్టాలు

ఏళ్లు గడుస్తున్నా వంతెన నిర్మాణానికి గ్రహణం

దాదాపు రూ.10 కోట్లతో బ్రిడ్జి 2016లో పనులకు శ్రీకారం..నేటికీ అసంపూర్తి

ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం న్యాయ పరమైన చిక్కులతో అవస్థలు

లో లెవెల్ బ్రిడ్జితో నది ఒప్పొంగిన ప్రతీసారి జిల్లా కేంద్రానికి పోచంపల్లికి రాక పోకలు బంద్



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : ప్రతీ యేట తుఫానులు, అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకూ,మూసీ ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేతతో భువనగిరి జిల్లా జూలూరురుద్రవెల్లి మూసీనదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక లో లెవెల్ వంతెన పై తరచుగా వరద ఉధృతితో రాకపోకలు నిలిచిపోతుండటంతో మా ప్రయాణికులకు ఏమీ ఈ గతి? సమస్య తీవ్రతను గుర్తించే వారే కరువయ్యారా? మా గోడు పట్టదా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోచంపల్లి, బీబీనగర్ మండల వాసులు. జిల్లా కేంద్రానికి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పట్టు చీరల కేంద్రం వరల్ ది బెస్ట్ టూరిజం ప్లేస్ భూదాన్ పోచంపల్లికి ప్రధాన రహదారి.. దక్షిణ మధ్య రైల్వే స్టేషన్ బీబీనగర్‌కు పోచంపల్లి, చౌటుప్పల్ మండల ప్రజలకూ పరిపాలనపరంగా అధికారులకు అనుసంధానంగా ఒకే ఒక్క దగ్గరి ప్రధాన మార్గం. ఈ మధ్యలోని రుద్ర వెల్లి జూలూరు మూసీలో లెవెల్ వంతెనపై వర్షాలు పడిన ప్రతీ సారి నదీ ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ప్రవహించి రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. తాజాగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గత రెండు రోజులుగా లో లెవెల్ వంతెనపై నదీ ప్రవాహం తీవ్రరూపం దాలుస్తోంది. వరద ధాటికి బ్రిడ్జి కూడా ఓ మోస్తారు ధ్వంసం అయింది. ప్రమాదాలు ప్రాణ నష్టం జరగకుండా అధికారులు భారీ కేడ్లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ కాపలా కాస్తున్నారు. గతంలో వాహనాలు, మనుషులు కొట్టుకు పోయిన సందర్భాలు ఉన్నాయి. తుఫానుల సమయాల్లో రోజుల తరబడి కురిసే వర్షాలకు ఈ నదీ ఉప్పొంగి ప్రవహించడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఏళ్లుగా ఈ సమస్య జటిలమౌతుందే తప్ప వంతెన పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. నేతలు రాజకీయ ప్రముఖులు తమ గెలుపుకు ఈ సమస్యను పావుగా చూపి హామీలు గుప్పించి గెలిచినా కూడా బ్రిడ్జి నిర్మాణం పనులు మొదలు పెట్టక పోవడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.ఈ రహదారి గుండా వెళ్లే ప్రతి పౌరుడుని ప్రతి ప్రజా ప్రతినిధిని నాయకుడిని ఉన్నతాధికారులను, ఈ అసంపూర్తి బ్రిడ్జి! నేతలు మారినా నాతలరాత మారలేదని ప్రశ్నిస్తున్నట్టుగా వెక్కిరిస్తున్నట్లుగా సమర్థులకు సవాలు విసురుతోంది. అసాధ్యాన్ని సుసాధ్యం చేయాలనే సంకల్పం ఉన్న ఎన్నికైన నాయకులు కూడా శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారని ఘాటుగా విమర్శలు గుప్పిస్తున్నారు.

నిజానికి గతంలో దాదాపు రూ.10 కోట్లతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులకు 2016లో శంఖుస్థాపన చేసి పనులు మొదలు పెట్టారు కూడా. దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డు పడినట్లు పనులు జరుగుతుండగా భూసేకరణ న్యాయపరమైన చిక్కులు ఎదురు కావడంతో బ్రిడ్జి పిల్లర్లు వేసి మధ్యలోనే ఆగి పోయి పనులకు బ్రేక్ పడింది. లీగల్ ఇష్యూస్ అన్నింటిని పరిష్కరించుకునే సమయానికి 9 ఏళ్లు గడిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నిర్మాణ పనులను చేపట్టేలా చర్యలు తీసుకున్నప్పటికీ ప్రస్తుత రేట్స్ ప్రకారం గుత్తేదారుకు బడ్జెట్ పెరిగిపోవడంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయటానికి ముందుకు రావడం లేదని అందరి మాట..దీంతో భువనగిరి ఎమ్మెల్యే గెలిచిన తర్వాత చొరవ ఆగిపోయిన నిర్మాణ పనులను మొదలు పెట్టాలని అధికారులను కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆ మధ్య ఏవో మొక్కుబడిగా బ్రిడ్జి పనులు జరుగుతున్నట్లుగా దర్శనమిచ్చాయి. కానీ అదంతా ప్రజల దృష్టిని మరల్చడానికి మాత్రమే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట. మూసి నది బ్రిడ్జి సమస్య పెను సమస్య గానే మిగిలిపోయింది.వర్షాలు,తుఫాను పడిన ప్రతీ సారి చూడాలి ప్రయాణికుల కష్టాలు వర్ణణాతీతం.కళ్ళముందే భారీ వర్షాలు ఉండటంతో మూసీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రాంతాలలో ఇదే రకమైన దుస్థితి కనబడుతోంది. వీటన్నిటికీ తెరలేపి పాలకులు చిత్తశుద్ధితో అన్ని అడ్డంకులు తొలగిస్తారా? పెద్ద ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరిగితే కానీ బ్రిడ్జి పనులు మొదలు పెట్టరా ? అనే సందేహాలు అందరిలో మెదులుతున్నాయి.ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలనీ అఖిల పక్షం, ప్రజల సహకారంతో చొరవ చూపి అధికారులతో కలిసి ప్రజా ప్రతినిధులతో సమస్యను పరిష్కరించాలని బలంగా కోరుతున్నారు అవస్థలు పడుతున్న ప్రజలు. ప్రజల పక్షాన నిలిచి రోజువారి జీవనంలో రవాణా సౌకర్యాలు ఎంత కీలకమో ఆలోచించి బ్రిడ్జిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలనీ ఇరు మండలాల ప్రజలు రవాణా సౌకర్యాలకు అంతరాయం కలవకుండా చూడాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# క్రీడ

## విదర్భదే ఇరానీ కప్

రంజీ ట్రోఫీ ఛాంపియన్ విదర్భ తమ జోరును చూపిస్తూ ఇరానీ కప్‌నూ పట్టేసింది. బ్యాటర్లతో పాటు స్పిన్నర్ దూబే చెలరేగడంతో రెస్ట్ ఆఫ్ ఇండియాకు షాకిస్తూ మూడోసారి ట్రోఫీని అందుకుంది. 2018, 2019లో ఇరానీ కప్ విజేత అయిన విదర్భ ఈసారి కూడా ఛాంపియన్‌గా నిలిచింది. దూబే నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థిని కూల్చడంతో 93 పరుగుల తేడాతో గెలు పొందింది. శతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన అథర్వ తైడే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. విదర్భ నిర్దేశించిన 361 పరుగుల ఛేదనలో రెస్ట్ ఆఫ్ ఇండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. 35/2తో ఐదో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు ఐదో ఓవర్లోనే కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ కోల్పోయింది. రుతురాజ్ గైక్వాడ్ ఇషాన్ కిషన్‌లు సైతం త్వరగా వెనుదిరగడంతో 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది రెస్ట్ ఆఫ్ ఇండియా. అనంతరం యశ్ ధుల్(92), సరాన్ష్ జైన్(29)లు ఆరో వికెట్‌కు 53 పరుగులు జోడించి ఆదుకున్నారు. కానీ, జైన్ ఎల్బీగా ఔట్ కావడంతో 156/6తో లంచ్‌కు వెళ్లింది రెస్ట్ ఆఫ్ ఇండియా. ఆ తర్వాత మానవ్ సుతార్ (56), ధుల్ ద్వయం 103 పరుగుల భాగస్వామ్యంలో విదర్భను భయపెట్టారు. కానీ,సెంచరీకి చేరువైన ధుల్‌ను, అన్షుల్ కంబోజ్‌ను యశ్ ఠాకూర్ ఔట్ చేయడంతో ఆ జట్టు ఆశలు ఆవిరయ్యాయి. టీ బ్రేక్ లోపే రెస్ట్ ఆఫ్ ఇండియాను 267కు ఆలౌట్ చేసిన విదర్భ హ్యాట్రిక్ ట్రోఫీతో చరిత్ర సృష్టించింది. నాగ్‌పూర్‌లోని వీసీఏ స్టేడియంలో విదర్భ బౌలర్ల ధాటికి రెస్ట్ ఆఫ్ ఇండియా కుప్పకూలింది. తొలి వికెట్‌కు 52 పరుగుల శుభారంభం లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. కెప్టెన్ రజత్ పాటిదార్(66), అభిమన్యు ఈశ్వరన్(52)లు రాణించగా.. యశ్ ఠాకూర్ విజృంభణతో ఆ జట్టు214కే ఆలౌట్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో అథర్వ తైడే(143) మారథాన్ ఆటతో ఆదుకోగా.. యశ్ రాథోడ్ (91) మెరవగా విదర్భ 312 రన్స్ చేసింది. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో ఆకాశ్ దీప్ (3–51), సరన్ష్ జైన్(2–94)లు రాణించారు.





## పాకిస్థాన్‌ను చిత్తుచేసిన భారత్

### 88 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ



మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టు రెండో విజయం నమోదు చేసింది. తొలిపోరులో శ్రీలంకకు షాకిచ్చిన టీమిండియా ఈసారి పాకిస్థాన్‌ను మట్టి కరిపించింది. బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో పోరాడగలిగే స్కోర్ చేసిన హర్మన్‌ప్రీత్ సేన ఆ తర్వాత దాయాది పని పట్టింది. క్రాంతి గౌడ్ (320) స్నేహ్ రానా(238)లు చక్కని బౌలింగ్‌తో వికెట్ల వేట కొనసాగించారు. దీప్తి శర్మ(345) చివరి వికెట్ తీయడంతో 88 పరుగుల తేడాతో భారత్ జయభేరి మోగించింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో చిరకాల ప్రత్యర్థిపై 12 విజయాలతో పైచేయి సాధించింది. తొలి వరల్డ్ కప్ వేటలో భారత జట్టు దూసుకెళ్లుతోంది. ఆరంభ మ్యాచ్‌లో కో హోస్ట్ శ్రీలంకకు చెక్ పెట్టిన టీమిండియా.. రెండో గేమ్‌లో పాకిస్థాన్ భరతం పట్టింది. హర్లీన్ డియోల్ (46), రీచా ఘోష్ (35 నాటౌట్) మెరుపులతో ప్రత్యర్థికి కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించి భారత్.. బంతితో పాక్ బ్యాటర్లను వణికించింది. ఛేదనలో ఆది నుంచి తడబడిన పాక్.. ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు.

ఆరు పరుగులకే ఓపెనర్ మునీబా అలీ(2) రనౌట్ కాగా.. ఆకాసేపటికే సడాఫ్ షమాస్ (6) రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. అనంతరం.. రేణుకా సింగ్ ఓవర్లో సిద్రా అమిన్ (9 నాటౌట్) ఇచ్చిన సులువైన క్యాచ్‌ను రీచా వదిలేసింది. డైవ్ చేయడంతో బంతి ఆమె మణికట్టుకు తగిలి కింద పడింది. లేదంటే పాక్ మూడో వికెట్ పడేది. పది ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయిన పాక్ ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుంది. అలియా రియాజ్ (2) వెనుదిరిగాక నటాలియా పర్వేజ్(33), సిద్రా అమిన్(81)లు క్రీజులో పాతుకుపోయారు.

### 69 రన్స్ జోడించి

భారత బౌలర్లను విసిగిస్తూ నాలుగో వికెట్‌కు హాఫ్ సెంచరీకి పైగా భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే 69 రన్స్ జోడించిన పర్వేజ్‌ను క్రాంతిగౌడ్ వెనక్కి పంపి పాక్‌ను కష్టాల్లోకి నెట్టింది. రాధా యాదవ్ చక్కగా క్యాచ్ అందుకోవడంతో పాక్ నాలుగో వికెట్ పడింది. కాసేపటికే అమిన్ సింగిల్‌లో ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. కానీ, మరో ఎండ్‌లో ఆమెకు సహకరించే వాళ్లు కరువయ్యారు. సిద్రా నవాజ్ (14)ను రిటర్న్ క్యాచ్‌తో స్నేహ్ రానా డగౌట్ చేర్చగా.. ఆ వెంటనే షమీమ్(0)ను దీప్తి బౌల్డ్ చేసింది. ఒంటరిపోరాటం చేస్తున్న అమిన్ స్వీప్ షాట్ ఆడి మిడ్ వికెట్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ చేతికి చిక్కడంతో పాక్ ఓటమి ఖాయమైంది. దీప్తి వేసిన 43 ఓవర్లో దయానా (9) రనౌట్ కాగా.. చివరి బంతికి సడియా (0) ఔట్ కావడంతో పాక్ 159 పరుగులకే ఆలౌటయ్యింది. వరుసగా రెండో విజయంతో నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది టీమిండియా.

### డియోల్, రీచా రాణించగా

శ్రీలంకపై చెలరేగిన మ్యాచ్‌లో భారత టాపార్డర్ పాకిస్థాన్‌పై విఫలమైంది. టాప్ గన్స్ అయిన మంధాన, ప్రతీక, హర్మన్‌ప్రీత్‌లు దాయాది బౌలర్లపై ఎదురుదాడి చేయలేకపోవడంతో జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించేందుకు మిడిలార్డర్ చెమటోడ్చాల్సి వచ్చింది. ఓపెనర్ ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్ (46) రాణించగా.. జెమీమా రోడ్రిగ్స్ (32), దీప్తి శర్మ(25)లు విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పారు. జట్టు స్కోర్ 230 దాటడమే గగనం అనుకున్న దశలో రీచా ఘోష్(35 నాటౌట్) బౌండరీలతో విరుచుకుపడింది. కానీ, చివరి ఓవర్లో రెండు వికెట్లు పడడంతో భారత్ 247 పరుగులకు ఆలౌటయ్యింది.


# ఫోకస్ ఆరోగ్యం

ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, లేదా ప్రసవానంతరం శిశువు మెదడు లేదా అసాధారణ మస్తిష్క అభివృద్ధి లేదా మెదడు దెబ్బతినడం వల్ల శరీర కదలికలు, శరీర భంగిమలపై కలిగే దుష్ప్రభావం వల్ల వచ్చే రుగ్మతలను సెరిబ్రల్ పాల్సీ లేదా మస్తిష్క (మెదడు) పక్షవాతం అని పిలుస్తారు.



## సెరిబ్రల్ పాల్సీపై అవగాహన అవసరం

నేడు ప్రపంచ మస్తిష్క (లేదా మెదడు) పక్షవాత దినం




మస్తిష్క పక్షవాతంలో బాధ పడుతున్న అభాగ్యుల్లో కండరాల నియంత్రణ, సమతుల్యత, సమన్వయాలకు సంబంధించిన సవాళ్ల ఫలితంగా సాధారణ జీవితం గడపడం చాలా కష్టం అవుతుంది. ఈ రుగ్మత వల్ల అతి సాధారణ సమస్యలతో పాటు దినచర్యలో ఇబ్బందులు, శరీర కదలికల్లో లోపాలు పట్టి పీడిస్తాయి. ఈ రుగ్మతను త్వరగా గుర్తించడం వల్ల ఉపశమన చికిత్సలు, ఫిజియోథెరపీ, పునరావాసం లాంటి చర్యలు తీసుకుని జీవన నాణ్యతలను పెంచుకునే వీలుంది.

### ప్రపంచ మస్తిష్క పక్షవాత దినం – 2025 :

ప్రపంచవ్యాప్తంగా మస్తిష్క పక్షవాతం బారిన పడిన మిలియన్ల చిన్నారులు, పెద్దలు ఉన్నారు. మెదడు పక్షవాత రుగ్మతతో సతమతం అవుతున్న అభాగ్యుల సమస్యలను అర్థం చేసుకోవడం, వారిని అక్కున చేర్చుకోవడం, రుగ్మత ఉపశమన చర్యలు తీసుకోవడం, పూర్తి అవగాహన కల్పించడం, కుటుంబ సభ్యులకు బాసటగా నిలవడం, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవడం, రుగ్మత చికిత్స పరిశోధనలు కొనసాగించడం, వీరి సంక్షేమానికి పునరావాస కేంద్రాలు నడపడం లాంటి పలు అంశాలను చర్చించడానికి వేదికగా ప్రతి ఏట 06 అక్టోబర్ రోజు ప్రపంచ మస్తిష్క పక్షవాత దినం (వరల్డ్ సెరిబ్రల్ పాల్సీ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రసవ సమయంలో ఎదురయ్యే సమస్యలు, ముందస్తు లేదా అకాల ప్రసవాలు, మెదడు దెబ్బతినడం, ప్రసవ సమయంలో మెదడుకు సరిపోయే ఆక్సీజన్ అందకపోవడం వల్ల ఈ రుగ్మత వస్తుంది. 2025 ప్రపంచ మస్తిష్క పక్షవాత దినం ఇతివృత్తంగా ప్రత్యేకం ఐక్యత (యూనిక్ అండ్ యునైటెడ్) అనబడే అంశాన్ని తీసుకొని ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్యలు ఎదుర్కొంటున్న రోగులను ప్రత్యేకంగా చూసుకుంటూ, ఐక్యతతో పోరాడడం జరుగుతుంది. ఈ రోజు ఆకుపచ్చ వర్ణ బ్యాడ్జిలు, రిబ్బన్లు ధరించి ఈ వర్గం అభాగ్యుల పట్ల బాసటగా నిలవడం జరుగుతుంది.



### మస్తిష్క పక్షవాత రోగ లక్షణాలు, సవాళ్లు:

మస్తిష్క పక్షవాత రుగ్మతతో బాధపడుతున్న రోగులు కూర్చోవడం, పాకడం, నడవడంలో ఇబ్బంది పడతారు. వీరిలో కండరాలు గట్టిపడడం వల్ల శరీర కదలికల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ రుగ్మత ఫలితంగా శరీర అవయవాల సమన్వయ లోపాలు కలిగి నడవడంలో ఇబ్బందులు, తరుచుగా పడిపోవడం, అడుగులు వేయడంలో అవస్థలు, మాటాల్లో స్పష్టత లోపాలు, నమలడంలో సమస్యలు, ఆహారం మింగడంలో ఇబ్బందులు కలుగుతాయి. శరీర కదలికల సమస్యలు, సంభాషణల్లో అవరోధాలు, విద్యార్జనలో పరిమితులు, ఉద్యోగాలు చేయడంలో అవరోధాలు, సామాజిక వివక్షలు లాంటి సవాళ్లు ఎదురవుతాయి. మస్తిష్క పక్షవాత ఉపశమన చికిత్సలు, పునరావాసాల కల్పనకు ఫిజియోథెరపీ, అక్కుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, ఔషధ చికిత్స, పలు విధాల సహాయ కార్యక్రమాలు లాంటివి అందుబాటులో ఉన్నాయి.

ప్రపంచ మస్తిష్క పక్షవాత దినం వేదికగా అవగాహన, నిధుల సేకరణ, కార్యశాలలు, సదస్సులు, ఎన్‌జిఓల సహకారాలతో ఈ వర్గ ప్రజలకు బాసటగా నిలుస్తూ వారి అభ్యున్నతికి కృషి నిరంతరం కొసాగాలని కోరుకుందాం. మెదడు పక్షవాత రోగులను అక్కున చేర్చుకొని ఉనరావాస కేంద్రాల ద్వారా ఉపశమన చర్యలు తీసుకుందాం. వీరి కుటుంబాలకు మేం మీతో ఉన్నామనే ధైర్యాన్ని అందిద్దాం. మస్తిష్క పక్షవాతం రాకుండా ప్రసవ సమయాల్లో తగు జాగ్రత్తలు తీసుకుందాం.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## సిపిఐ కార్యాలయానికి పువ్వాడ





ప్రజాపక్షం/ ఖమ్మం : సిపిఐ సీనియర్ నాయకులు, ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పువ్వాడ నాగేశ్వరరావు ఆదివారం సిపిఐ కార్యాలయానికి వచ్చారు. కొద్ది విరామం తర్వాత వచ్చిన పువ్వాడకు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆయన శత వసంత ముగింపు సభల గురించి నాయకున్ని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన కార్యకర్తలను పేరు పేరున పలకరించారు. ఆదివారం సాయంత్రం జరిగిన శత వసంత ముగింపు సభ సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ, సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకటరెడ్డి, చాడ వెంకటరెడ్డి, అజీజ్‌పాషా తదితరులతో ఆయన సంభాషించారు.

## మొక్కజొన్న రైతులను ముంచుతున్న దళారులు : పెద్దారపు రమేష్

ప్రజాపక్షం/నర్సంపేట : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్నలను మధ్య దళారులు, వ్యాపారులు మద్దతు ధర కన్న క్వింటాకు 500 రూపాయల తక్కువ ధర కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారని, ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఎంసిపిఐ(యు), ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ ను ఆదివారం సందర్శించి మొక్కజొన్నలను అమ్మకానికి తీసుకువచ్చిన రైతుల ఇబ్బందులను, ధరల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రైతాంగం ఆరుగాలం కష్టించి అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని మొక్కజొన్నలను పండిస్తే ప్రభుత్వాలు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించకుండా దళారులకు వ్యాపారులకు వత్తాసు పలుకుతున్నదని, ఈ క్రమంలో కనీస మద్దతు ధర క్వింటా రూ.2400లు అమ్మాల్సిన మొక్కజొన్నలు రూ.1600 నుంచి రూ. 2100లు దాటడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలోనే మొక్కజొన్న పంట మొదట దిగుబడి వచ్చే వరంగల్ జిల్లాలో ఇంతవరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. కుంటి సాకులతో ధర తగ్గించడానికే కొనుగోలు జరగకపోవడం అన్యాయమన్నారు.పార్టీరాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్ , సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, ఏఐకేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేశెట్టి సదానందం,కలకోట్లయాదగిరి,రాజేందర్,వీరన్న, రైతులున్నారు.

## సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డికి సన్మానం

ప్రజాపక్షం/ ఖమ్మం : సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికై తొలిసారి ఖమ్మం వచ్చిన సిపిఐ నాయకులు పల్లా వెంకటరెడ్డిని భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చండీఘర్‌లో గత నెల 21 నుంచి 25 వరకు జరిగిన జాతీయ మహాసభల్లో పల్లా వెంకటరెడ్డి జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. శాసన సభ్యునిగా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యులుగా గతంలో పల్లా వెంకటరెడ్డి పనిచేశారు. సన్మానించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, జాతీయ సమితి సభ్యులు ఎస్‌కె సాబీర్‌పాషా, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ముత్యాల సత్యనారాయణ, కల్లూరి వెంకటేశ్వరరావు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, అజ్మీర రామ్మూర్తి, శ్రీనివాస్, మున్నా లక్ష్మి కుమారి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## 'జూలూరుపాడు'లో ఒంటరిగా పోటీ

### సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుండెపిన్ని వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/జూలూరుపాడు:స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుండె పిన్ని వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జూలూరుపాడులో మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండలంలో ప్రజల పక్షాన సిపిఐ నిలబడి పరిష్కారం కోసం పోరాడుతుందని, పార్టీ శ్రేణులు అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. మండలంలో అన్ని ఎంపీటీసీ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని, జెడ్పిటిసి స్థానానికి కూడా పోటీ చేస్తామని తెలిపారు. కలిసొచ్చే పార్టీల పొత్తుల అవగాహనతో ముందుకు వెళ్తామన్నారు. డిసెంబర్‌లో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాల సందర్భంగా ఖమ్మంలో భారీ సభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, గుండె పిన్ని, మధు, యాస రోశయ్య, వలమల్ల సామేలు, కిలారి ముత్యాలు, గుడిమెట్ల సీతయ్య, తూము కోటయ్య, చిమట ముత్తయ్య, కంపసాటి నాగేశ్వరారావు, కొండా వీరయ్య, బరగడ రమేష్, పాలెపు ప్రభాకర్, చీమకుర్తి సంతోష్, కొండల్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## పాలకుల మోసాలను గ్రహించండి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్

ప్రజాపక్షం/ములుగుః స్థానిక సంస్థల ఎన్నికలలో కార్మిక వర్గం సత్తా చా టాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఏఐటియూసి వెంకటాపూర్ మండల కమిటీ సమావేశం బండి నర్సయ్య అధ్యక్షతన మండల కేంద్రంలోని స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐటి యూసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ హాజరై మాట్లాడుతూ పాలకుల మోసాలను కార్మికులు గ్రహించి గుణపాఠం చెప్పాలంటే సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని, అందులో భాగంగా ప్రస్తుతం జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కార్మిక వర్గం సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైనందున వెంటనే స్పందించి వంట కార్మి కులకు కనీస వేతనాలు రూ.10వేలు చెల్లించాలని, స్కీం వర్కర్స్ అందరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని, భవననిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు, ప్రయివేట్ పరం చేసారని వెంటనే ఉపసంహరించు కోవాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, థర్డ్ పార్టీ కార్మికులు అందరికి కనీస వేతనాలు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. స్కావెంజర్స్ వేతనాలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో బండి నర్సయ్య, కొక్కుల రాజేందర్, గాలి సమ్మయ్య, తోట సంపత్, గుర్రం రమేష్, జనగాం శోభ, సారయ్య, నవీన్, మధుకర్, సమ్మయ్య, పోషాలు, సామల దేవేందర్, వేణు, చిన్న మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటుదాం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య




ప్రజాపక్షం/చండూరుః త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటేందుకు గెలుపే లక్ష్యంగా సైనికుల్లా కష్టపడి పనిచేయాలని పార్టీ శ్రేణులకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మా భవనపంలో నిర్వహించిన మండల పార్టీ కార్యవర్గ సభ్యుల సమావేశానికి రామలింగయ్య ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ చండూరు మండలంలో భారత కమ్యూనిస్టు పార్టీ బలమైన పార్టీ అని అన్నారు. మండలంలో బలమున్న గ్రామాలలో పోటీ చేయుటకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని అన్నారు. కాంగ్రేస్ తో పొత్తు ఉన్న లేకున్న ఎంపిటీసి ,సర్పంచ్ లుగా ఒంటరిగా పోటీ చేయుటకు సిద్దంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. నిత్యం పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న సిపిఐని గెలిపించుటకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, మండల పార్టీ సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు , మండల పార్టీ కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేష్, కర్నాటి వెంకటేశం , దోటి వెంకన్న, బండమీది వెంకన్న , సిహెచ్ ఊషయ్య , గంట రమేష్ , ఇరిగి సంజీవ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా కిషోర్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా కిషోర్‌ను మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అనంద్ పట్టణ బిసి నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టణ అధ్యక్షుడుగా యంఐజి కాలనీకి చెందిన కిషోర్‌ను నియామించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బిసి రిజర్వేషన్ల అమలులో అనుసరిస్తున్న వైఖరి, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా బీసీలకు చేస్తున్న ద్రోహం వంటి అనేక అంశాలపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పెట్టుకుని కాలయాపన చేస్తోంది అని అన్నారు. 42శాతం రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచరులతో కోర్టులో కేసు వేయించి ఎన్నికలు వాయిదా వేయించాలని పక్క ప్రణాళికతో ముందుకు పోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గోపాల్ ముదరాజ్, మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, విజయ్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి, రామస్వామి. సురేష్ , మల్లికర్జున్, సుభాన్‌రెడ్డి, ముర్తుజా అలీ, మల్లేషం, రమణ, అనంత్‌రెడ్డి, ఫరిద్ పాల్గొన్నారు.

## యువతకు ఆదర్శనీయం మారథాన్ నాగభూషణం

ఎమ్మెల్యే బండారి

74 ఏళ్ల వయస్సులో బోస్టెన్ మారథాన్ రేసులో అర్హత



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** 130వ బోస్టెన్ మారథాన్ రేసులో మరో సారి అర్హత సాధించిన 74 ఏళ్ల మారథాన్ రన్నర్ చాల మలశెట్టి నాగభూషణం యువతకు ఆదర్శనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ నివాసైన నాగభూషణంను ఆదివారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కల్సి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆయన పలు మారథాన్‌లలో పాల్గొని ఘనత సాధించారని, ఇప్పటికీ వయోభారాన్ని సైతం లెక్క చేయకుండా మరింత ఉత్సాహంతో మారథాన్ రేసుల్లో పాల్గొనేందుకు ముందుకు రావటం గర్వకారణమన్నారు. అంతర్జాతీయ వేదికలపై దేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేసేలా మరిన్ని మారథాన్ రేసుల్లో ఆయన పాల్గొనాలని ఆంకాంక్షించారు.

## ముస్లింల గౌరవానికి కబ్రస్థాన్ కేటాయింపు

రేవంత్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముస్లింల గౌరవానికి కబ్రస్థాన్ (శ్మశానవాటిక) స్థలాలను కేటాయించడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మతానికి గౌరవం, మానవత్వానికి ప్రాధాన్యతే ధ్యేయమని నిరూపించుకుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి, మైనారిటీల పట్ల తమకున్న కట్టుబాటుకు నిదర్శనమన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, మైనారిటీ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, కార్పొరేషన్ చైర్మన్లు, మత పెద్దల సమక్షంలో కబ్రస్థాన్ స్థలం కేటాయింపుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేశారు.

**దశాబ్దాల సమస్యకు పరిష్కారం..**

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముస్లింలకు జీవన గౌరవం ఉన్నట్లే మరణానంతర గౌరవం కూడా ఉండాలన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమాధి భూముల సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించిందంటే అది ప్రజల విశ్వాసానికి ఇచ్చిన గౌరవమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో సామాజిక న్యాయం, మైనారిటీల అభ్యున్నతి దిశగా స్పష్టమైన మార్గాన్ని అనుసరిస్తోందని తెలిపారు. దేశంలో బలహీన వర్గాలకు అండగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, షేక్‌పేట్, గోల్కొండ పరిసర ప్రాంతాల్లో స్థలాభావం ఉన్నప్పటికీ న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకున్నామని, హెచ్‌ఎండిఏ, కలెక్టర్‌ల సమన్వయంతో న్యాయ పరమైన అడ్డంకులను తొలగిస్తున్నామని చెప్పారు.

**కబ్రస్థాన్‌ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు..**

పాత కబ్రస్థాన్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని మంత్రి ప్రకటించారు. వీటిలో లైటింగ్, డ్రైనేజీ, రోడ్లు, నీటి సదుపాయాల పనులు చేపడతామని తెలిపారు. ఆక్రమణలు జరగకుండా ప్రహారీగోడలు నిర్మాణం చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక సమాధి భూమిని గుర్తించడమే లక్ష్యమన్నారు. ధార్మిక హక్కులను కాపాడటమే నిజమైన సెక్యులరిజమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. గత బిఆర్‌ఎస్ పాలనలో మైనారిటీల సమస్యలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని తిరిగి గెలుచుకుందన్నారు. మాట ఇస్తే పని చేస్తుంది, అదే కాంగ్రెస్ పార్టీ విశ్వసనీయత అన్నారు. తాను మైనారిటీ శాఖ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆరు మైనారిటీ కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం జరగడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

## సిటీ బస్సు చార్జీల పెంపు..

సామాన్యుడిపై రూ.300-500 అదనపు భారం

టిడిపి నేత సాయిబాబా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌లో ఇప్పటికే విపరీతంగా పెరిగిన జీవన వ్యయంతో బతుకలేని పరిస్థితుల్లో ఉన్న ప్రజలపై ఆర్‌టిసి బస్సుల ఆధునికరణ పేరుతో చార్జీల భారం పెంచడం దారుణమని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. ప్రభుత్వం బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని సాయిబాబా తీవ్రంగా ఖండించారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 'ప్రజలకు ఇది దసరా పండుగ బహుమతి' అంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చార్జీల పెంపుతో బస్ పాస్‌లు, డే పాస్‌లతో ప్రయాణించే విద్యార్థులపై, అలాగే ప్రతి ప్రయాణికుడిపై నెలకు రూ.300 నుండి రూ.500 వరకు అదనపు భారం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో, ప్రజా రవాణా సౌకర్యాల లేమితో అనేక కష్టాలు ఎదుర్కొంటున్న వేళ, చార్జీల పెంపు 'గోరుచుట్టుపై రోకలి పోటు' వంటిదని సాయిబాబా మండిపడ్డారు. ఇది ప్రజా ధనం దోపిడీకి పాల్పడడమేనని విమర్శించారు. పెంచిన బస్సు చార్జీల ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలోనే ప్రజల నుంచి తిరుగుబాటు ఎదురయ్యే పరిస్థితి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, బాల్‌రాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓయో హోటల్ మూసివేయాలి

సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పోచారం మున్సిపల్ పరిధిలో నివాస గృహాల మధ్య అసాంఘిక కార్యకలాపాలతో నిర్వహిస్తున్న కాకతీయ గ్రాండ్ ఓయో హోటల్ (లాడ్జి)ని వెంటనే మూసివేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేసారు. అన్నోజిగూడలోని భగత్‌నగర్ కాలనీ గ్రేటెడ్ కమ్యూనిటి ప్రాంతంలో గత కొద్ది కాలంగా నడుస్తున్న లాడ్జిని ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని, ఇక్కడి కార్యకలాపాల వల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్, పోలీసు అధికారులను ఆయన కోరారు.

## ఓయో నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** నిబంధనలకు విరుద్ధంగా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్,అన్నోజిగూడ భగత్ నగర్ కాలనీ గేటెడ్ కమ్యూనిటిలో కాకతీయ గ్రాండ్ హోటల్ పేరుతో ఓయో లాడ్జ్ నిర్వహిస్తున్నా వారిపైన చర్యలు తీసుకోవాలని పోచారం మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు నానావత్ సురేష్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూ సంస్కృతి టౌన్షిన్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని రెసిడెన్షియల్ ఏరియాలో ఓయో పేరుతో అసాంఘిక కార్యకలాపాలను జరగడంతో సమీప కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.గత 25/9/2025 తేదీన మేడ్చల్ కలెక్టర్కు,మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేసిన ఇప్పటివరకు ఓయో నిర్వాహకులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.రాత్రి సమయంలో ఆప్రాంతంలో అనుమానిత వ్యక్తుల రాకపోకలు పెరగటముతో స్థానిక వాసులు భయాందొలనాకు గురి అవుతున్నారు. అర్ధరాత్రి దాటాక ఓయో గదుల్లో పార్టీలు,వంటి సెలబరేషన్లు నిర్వహిస్తుండటంతో పక్కన నివసించే కాలనీ ప్రజలు నిద్రకు తీవ్ర భంగం కలుగుతుందని ఓయో లాడ్జి ప్రక్కనే స్కూల్ ఉండడంతో విద్యార్థులకు శాంతి స్వచ్ఛతపై భంగం కలుగుతుందని దయచేసి ఓయోలాడ్జి అనుమతిని రద్దు చేసి ఇటు మున్సిపల్,పోలీస్ అధికారులు ఓయో నిర్వాహకులపై చట్టపరమైన్య చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో చోరీ... పోలీస్‌స్టేషన్ గోడదూకి పరారీ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో దూరిన ఓ దొంగ దర్జాగా దూరి కంప్యూటర్ పరికరాలు, సిసి కెమెరాల వంటి ఎలక్ట్రానిక్ వస్తువలను చోరీకి యత్నించి ఓ జర్నలిస్టుకు చిక్కి అదే దర్జాతో పోలీస్ స్టేషన్ గోడ దూకి పరారయ్యాడు. చోరీకి పాల్పడిన దృశ్యాలన్ని ఇక్కడి సిసి కెమెరాల్లో దర్శనమిస్తున్నాయి. నిత్యం జనసంచారం ఉండే ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులు తమ పనులు ముగించుకొని తాళాలు వేసి వెళ్లారు. ముందస్తు పథకం ప్రకారం ఓ దుండగుడు రాత్రి 10గంటల సమయంలో దర్జాగా ప్రెస్‌క్లబ్ చేరుకొని తాళం పగుల గొట్టి లోపలికి ప్రవేశించాడు. లోపల ఉన్న కంప్యూటర్ పరికరాలు, సిసి కెమెరాలు డివిఆర్ మైక్, టివి, ఆప్లిఫైయర్‌లను చోరీ చేసాడు. వీటిని తీసుకొని దర్జాగా వెళుతుండటాన్ని గమనించిన జర్నలిస్టు దాసరాజు ఆ దొంగను చాకచక్యంగా పట్టుకొని సమీపంలోని ఉప్పల్ పోలీస్‌స్టేషన్ వరకు తీసుకొని వెళ్లి జరిగిన విషయమంతా చెప్పి పోలీసులకు అతడిని అప్పగించారు. అక్కడి పోలీసులు ఆదమరచి ఉన్న విషయాన్ని గమనించిన ఆ దొంగ అదే దర్జాతో తనకు ఎస్పై తెలుసునంటూ పక్కన ఉన్నవారితో చెబుతూ మాయ మాటలతో పోలీసుల కళ్లు కప్పి అక్కడి నుండి పరారవటం కొసమెరుపు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధితో కార్పొరేట్ వైద్యం

మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహయాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ముఖ్యమంత్రి సహాయ నిధితో నిరుపేదలు కార్పోరేట్ హస్పటల్‌లో ఖరిదైన వైద్యం చేయించుకోవచ్చని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కేశవరం గ్రామానికి చెందిన ఇద్దరి లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాసుల మల్లేష్‌కు రూ.27,500 ఉప్పెన కృష్ణవేణికి రూ.60వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలకు, అర్హులైన వారికి అనేక సంక్షేమ పథకాలు చేపట్టి వారి అభివృద్ధికి బంగారు బాటలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు శేఖర్‌యాదవ్, మైనార్టి నాయకుడు యూసుఫ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.


## బతుకమ్మ కుంట 'ఆపరేషన్ క్లీనింగ్'

చెత్త కలెక్షన్ ఆటోలకు ప్రత్యామ్నాయ పార్కింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బతుకమ్మకుంటలో ఆదివారం 'ఆపరేషన్ క్లీనింగ్' కార్యక్రమాన్ని హైడ్రా చేపట్టింది. హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్ ఆధ్వర్యంలో డిఆర్ఎఫ్, ఎంఈటి సిబ్బంది బతుకమ్మ ఆటల అనంతరం కుంటలో వదిలిన బతుకమ్మలను బయటకు తీశారు. చెరువులో కుళ్లిపోకుండా పూలను తొలగించారు. అలాగే బతుకమ్మలను రూపొందించడానికి పూలను పేర్చిన ట్రేలను బయటకు తీశారు. బతుకమ్మ కుంటను గత ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన విషయం తెల్సిందే. ఆదివారం నుంచి మంగళవారం వరకు వరుసగా మూడు రోజులు పెద్దఎత్తునంబతుకమ్మ కుంట చెంత బతుకమ్మ ఆటలు ఆడారు. పెద్ద మొత్తంలో పూలు కుంటలో పడ్డాయి. ఎప్పటికప్పుడు వాటిని బయటకు తీసినా కొన్ని మునిగిపోయాయి. ఆదివారం 'ఆపరేషన్ బతుకమ్మ కుంట' క్లీనింగ్ మాదిరి పూల వ్యర్థాలను తొలగించారు. కుంట క్లియర్‌గా కనిపిస్తోంది.

**పెట్రోల్ బంక్ వెనుక ఆటోల పార్కింగ్..** బతుకమ్మ కుంట ఆక్రమణలకు గురై నిర్మాణవ్యర్థాలతో నిండి, కబ్జాదారుల చెరలో ఉన్నప్పుడు అక్కడ జిహెచ్‌ఎంసికి చెందిన చెత్త సేకరణ ఆటోలను పార్కింగ్ చేసేవారు. కానీ బతుకమ్మ కుంటను హైడ్రా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఆ పరిసరాల రూపురేఖలను హైడ్రా మార్చింది. బతుకమ్మ కుంట ఇప్పుడు పిక్నిక్ స్పాట్‌గా మారింది. ఇంటింటికీ తిరిగి చెత్త కలెక్షన్ చేసిన ఆటోలను గతంలో మాదిరే కుంట ప్రధానద్వారం వద్ద ఆపడం ఇబ్బందిగా మారింది. ప్రత్యామ్నాయం చూపాలని వాహనదారులు కోరడంతో ఆ దగ్గరలోనే పెట్రోల్ బంక్ దగ్గర పార్కింగ్ సౌకర్యం హైడ్రా కల్పించింది. బతుకమ్మ కుంట ప్రధాన ద్వారం వద్ద ప్రశాంతమైన వాతావరణం నెలకొంది.

## కారు కోసం సెర్చ్ చేసి.. డబ్బు మొత్తం పోగొట్టుకున్నాడు



**హైదరాబాద్ :** ఆన్‌లైన్‌లో సైబర్ కేటుగాళ్లు అమాయకులను మోసం చేసేందుకు కొత్త మార్గాలు తయారు చేస్తున్నారు. రకరకాలుగా కుట్రలు పన్ని డబ్బులు కాజేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కారు అద్దెకు తీసుకొనేందుకు ప్రయత్నించి డబ్బులు పొగొట్టుకున్నాడు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ లాలాగూడకు చెందిన ఓ వ్యక్తి కోయంబత్తూరులో కారు అద్దెకు తీసుకునేందుకు గూగుల్‌లో సెర్చ్ చేశాడు. శివశక్తి కార్ రెంటల్స్ అనే పేరు చూసి.. అందులో ఉన్న ఫోన్ నెంబర్‌ని సంప్రదించాడు. రిజిస్ట్రేషన్ కింద రూ.149 చెల్లించాలని, ఎపికె ఫైల్ పంపి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అది నిజమేనని నమ్మిన బాధితుడు రిజిస్ట్రేషన్ చేసుకొని రూ.149 చెల్లించాడు. ఎపికె ఫైల్‌ని కూడా డౌన్‌లోడ్ చేసుకోవడంతో అందులోని మాల్వేర్ ద్వారా ఒటిపిలు రాకుండా సైబర్ మాయగాళ్లు ఫార్వర్డ్ చేసుకున్నారు. దీంతో అతని ఖాతాలోని రూ.1.98లక్షలు కాజేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సికింద్రాబాద్ అధ్యక్షుడు పి.ఎల్.శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గురువులే భావి భారత నిర్మాతలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యాక్షులు పి.ఎల్.శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సికింద్రాబాద్ జిల్లా తరపున ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పి.ఎల్. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల విశిష్ట సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు భవిష్యత్ తరాల భవిష్యత్తులను తీర్చిదిద్దడంలో కృషి చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు మన విద్యా వ్యవస్థకు మూలస్తంభాలన్నారు. వారు జ్ఞానం, విలువలు, నైపుణ్యాలను అందించి, విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి సహాయపడతారని అభినందించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ విలువలను గుర్తుచేస్తూ, సంస్థ ముఖ్యంగా వ్యక్తిత్వ నిర్మాణం, క్రమశిక్షణ, సమాజ సేవకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దయ, ధైర్యం కలిగి, ఇతరులకు సేవ చేయడానికి కట్టుబడి ఉన్న వ్యక్తులను అభివృద్ధి చేయడానికి తాము కృషి చేస్తామన్నారు. స్కౌట్ నియమంలో పాతుకుపోయి, నిజాయితీగా, విధేయతతో అందరికీ సహాయకారిగా ఉండటానికి మాకు మార్గనిర్దేశం చేస్తారన్నారు. ఉపాధ్యాయులందరి శ్రీనివాస్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల బోధనల ప్రభావం తరగతి గది నుంచి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతోందన్నారు. భవిష్యత్ తరాల మార్గదర్శకులన్నారు. సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్ర కీలకమన్నారు. విద్యను అందించడంలో వారి కృషిని, నిబద్ధతను అభినందించాలపి పి.ఎల్. అన్నారు.

## డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తంగా ఉండాలి

మహిళలకు హైదరాబాద్ కొత్త సిపి సజ్జనార్ కీలక సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిజిటల్ ప్రపంచం ఓ మాయాజాలం... ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అంతే స్థాయిలో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి... ముఖ్యంగా మహిళలు ఆన్‌లైన్ వేదికలపై వ్యక్తిగత ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో పొంచి ఉన్న ముప్పు గురించి వివరిస్తూ, మహిళలు మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని ఆయన కీలక సూచనలు చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) కనెక్ట్ 2025 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవలే నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, ఈ వేదికగా మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో ఈ విషయంపై ఆయన పోస్ట్ చేశారు. చాలామంది మహిళలు తమ ప్రైవేట్ ఫోటోలను, వ్యక్తిగత విషయాలను ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. కానీ వాటిని దుండగులు సులభంగా దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. నకిలీ గుర్తింపులతో పరిచయం చేసుకొని, నమ్మించి మోసం చేసే వారి సంఖ్య పెరిగిపోతోంది అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.మోసపోయారని గ్రహించిన తర్వాత కూడా కొందరు వారితో సంభాషణలు కొనసాగిస్తున్నారని, ఇది మరింత ప్రమాదకరమని సజ్జనార్ స్పష్టం చేశారు. అలాంటి చర్యలు బ్లాక్‌మెయిలింగ్‌కు ఆస్కారం కల్పిస్తాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఎవరినైనా గుడ్డిగా నమ్మవద్దు. ఏదైనా సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ధృవీకరించుకోవాలి. డిజిటల్ ప్రపంచాన్ని అందరికీ సురక్షితంగా మార్చేందుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి అని ఆయన పిలుపునిచ్చారు.ఇదే కార్యక్రమంలో సజ్జనార్ మహిళల శక్తి సామర్థ్యాలను కొనియాడారు. హైదరాబాద్ పోలీస్ విభాగంలో తన బృందంలో దాదాపు 50 శాతం మంది మహిళా ఐపీఎస్ అధికారులే ఉండటం గర్వకారణంగా ఉందని అన్నారు. వారు ఒకవైపు ఇంటి బాధ్యతలను, మరోవైపు కఠినమైన వృత్తిపరమైన విధులను ఎంతో అంకితభావం, క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. నేటి భారతదేశానికి మహిళలు ప్రతిఘటన, నాయకత్వం, ఆవిష్కరణలకు నిజమైన ప్రతీకలు. వారు మొత్తం ప్రపంచానికే స్ఫూర్తి, బలం అని ఆయన ప్రశంసించారు.ఈ నెల 3న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించిన ఈ జిటో కనెక్ట్ 2025 ప్రదర్శన మూడు రోజుల పాటు సాగనుంది. ఇందులో 600కు పైగా స్టాళ్లు, ఆరు భారీ అరీనాలు ఏర్పాటు చేశారు. బిల్డ్ మార్ట్, బిజినెస్ బే, ప్రాపర్టీ పెవిలియన్ వంటి విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో బాబా రాందేవ్, కమలేశ్ పటేల్ (దాదాజీ), సినీ నటుడు బొమన్ ఇరానీ, క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ వంటి పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

## శ్రమజీవుల అభ్యున్నతే సురవరం ఆశయం

యువతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకం

సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో

కేంద్రమంత్రి పెమ్మసాని



**మంగళగిరి :** శ్రమజీవుల అభ్యున్నతి కోసం పుట్టిన స్వరం సురవరం సుధాకర్‌రెడ్డి అని కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సిపిఐ పూర్వ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభను మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని విటిజెఎం అండ్ ఐవిటిఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సభకు హాజరైన పెమ్మసాని మాట్లాడుతూ... ఎంతో మంది రాజకీయ నాయకులు వస్తూ ఉంటారూ... పోతూ ఉంటారు. కానీ సమాజాన్ని ప్రభావితం చేసే నాయకులు కొందరే ఉంటారని, అటువంటి నాయకుల్లో సురవరం సుధాకర్ రెడ్డి ముందు వరుసలో నిలుస్తారని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్థాపించింది టిడిపి అయినప్పటికీ ఆయన లోపల ప్రవహించేది కమ్యూనిస్టు రక్తమే అన్నారు. పేదవాడు బాగుండాలనుకునే వ్యక్తి ఎన్టీఆర్ ... సిపిఐ, సిపిఎంలతో కలిసి నడిచిన పార్టీ టిడిపి అని తెలిపారు. సురవరం కానీ ఇతర కమ్యూనిస్టు పార్టీల నాయకులు కానీ చంద్రబాబును రాజకీయంగా విమర్శిస్తారు తప్ప వ్యక్తిగతంగా ఏనాడు విమర్శించలేదని తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి నమ్ముకున్న సిద్ధాంతాల కోసం నిలబడి పోరాడారని... నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై సోషల్ మీడియా వేదికగా కమ్యూనిస్టు పార్టీలు గళం వినిపించాలని, యువతను చైతన్యవంతుల్ని చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ మాట్లాడుతూ సంఘటిత ప్రజా ఉద్యమాల నిర్మాణమే అమరులకు మనం ఇచ్చే ఘన నివాళి అన్నారు. పీడిత వర్గాల గొంతుకగా సురవరం సుధాకర్ రెడ్డి నిలిచారన్నారు. పార్లమెంటులో పేద ప్రజల పక్షాన పోరాడారని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ ప్రజలు, గ్రామీణ రైతులు, కార్మికులు, దళిత, పేద, మైనార్టీ, బలహీన వర్గాలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సమర్థంగా పార్లమెంటులో వినిపించేవారన్నారు. సూక్ష్మ దృష్టితో విషయాన్ని పరిశీలించడమే కాకుండా సముచిత సూచన చేయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ... ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత్వం కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహానేత సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈమని అప్పారావు మాట్లాడుతూ మతోన్మాదానికి, మూఢత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. జనసేన నాయకుడు గంజి చిరంజీవి మాట్లాడుతూ కమ్యూనిస్టుల పురిటిగడ్డ మంగళగిరి అని అన్నారు. విద్యార్థి దశలో కమ్యూనిస్టులుగా ఉండని విద్యార్థి ఉండడని చెబుతూ... కమ్యూనిజానికి చావు లేదన్నారు. వైసిపి మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి, జిడిఎంసి చైర్మన్ వడ్రాణం హరిబాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రసంగిచారు. ముందుగా ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్, జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, నాయకులు కంచర్ల కాశయ్య, దేవరకొండ శ్రీనివాసరావులు అభ్యుదయ గేయాలను ఆలపించారు. తొలుత అమరజీ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారి దివ్యశ్రీ విప్లవ గీతాలకు శాస్త్రీయ నత్యం ప్రదర్శించి అందరి అభినందనలను చూరగొంది.

దివ్యశ్రీని కేంద్ర గ్రామీణ అభివద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శాలువాతో సత్కరించారు. ఈ సభలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, టిడిపి నాయకులు గుత్తికొండ ధనుంజయ రావు, గాదె పిచ్చిరెడ్డి, సిపిఐ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, అభ్యుదయవాదులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పోలే చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు పరామర్శ



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: అమెరికా డల్లాస్‌లో గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపిన వారి చేతుల్లో మృతి చెందిన బిఎన్‌రెడ్డి నగర్ టీచర్స్ కాలనీ వాసి పోలే చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను ఆదివారం బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వంలో మాట్లాడి మృతి దేహాన్ని కుటుంబ సభ్యులకు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు. బిజెపి పార్టీ కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండా ఉంటుందన్నారు. బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## 'ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులకే పదోన్నతులివ్వాలి '




ప్రజాపక్షం / ఖైరతాబాద్ : విద్యాశాఖలోని పర్యవేక్షక పోస్టులన్నీ ప్రభుత్వ యాజమాన్య ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే అర్హులని, వారికి మాత్రమే ప్రమోషన్లు కల్పించాలని గవర్నమెంట్ గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షులు విక్రమాదిత్య, ప్రధానకార్యదర్శి కె.సైదానాయక్ కోరారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని రకాల ప్రమోషన్లను గత 30 ఏళ్లుగా పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంఘాలు అనేకరకాల జివోలు తెప్పిస్తూ అడ్డుకొంటున్నారని తెలిపారు. ఫలితంగా విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమవుతుందని తెలిపారు. న్యాయస్థానాన్ని తప్పుదోవపట్టిస్తూ న్యాయస్థానంలో కేసులు వేస్తూ తమకు రావాల్సిన డి.ఇఒ, గ్రేడ్–1 హెచ్‌ఎం, ఎంఇఒ ప్రమోషన్లను అడ్డుకొంటున్నారని పేర్కొన్నారు. తమకు రావాల్సిన పదోన్నతులిచ్చి ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని వారు కోరారు. సమావేశంలో గెజిటెట్ టీచర్ల సంఘం అధ్యక్షులు కిశోర్‌కుమార్, కార్యదర్శి సైదులు రెడ్డి, ప్రభాకర్, సైదులు హరిశంకర్, మాధవీదేవి, ఊర్మిళ, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులకు దసరా కానుక

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/సరూర్‌నగర్: లోక కల్యాణం కోసం ఆ భగవంతుని పూజించే అర్చకుల సేవలు వెలకట్టలేనివని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌కెపురం డివిజన్‌లోని అన్నీ దేవాలయాల అర్చకులకు దసరా కానుకగా నూతన వస్త్రాలను చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కొత్త బట్టలు పెట్టడం అనవాయితీగా ఇస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా వారికి కొత్త బట్టలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఒక బాధ్యతగా తీసుకోని రాబోయే రోజులలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకుపోతామని తెలిపారు.

## ఘనంగా 'అమృత మంజరి' పుస్తకావిష్కరణ



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : హిందీలో జ్ఞాన మకరంద్, తెలుగులో అమృత మంజరి భాగం–2 (తన ప్రేమగల చేతుల నైపుణ్యం) పుస్తకాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది. రచయిత దేవశీన్ అంకాడీయా రచించిన ఈ పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం హైదరాబాద్ ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగింది. మోహన్‌గాంధీ అధ్యక్షత వహించగా కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, రిటైర్డ్ ఐపిఎస్‌అధికారిశ్రీరామ్‌తివారీ,సినీనటి కృష్ణవేణి, మాధవి, చంద్రకాంతరావుముఖ్యఅతిథులుగా జ్ఞానమకరంద్, అమృత మంజరి పుస్తకాలను ఆవిష్కరించారు. ఒకే దేవుడు, ఒకే దేశం సిద్ధాంతాన్ని విశ్వవ్యాప్తం చేయడమే తమ లక్ష్యమని శ్రీ లహరి కృష్ణ సుత్తి ధ్యానకేంద్రం హైదరాబాద్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ తెలిపారు. ధ్యానకేంద్రం ప్రతినిధులు నాగరాజు,అప్పారావు,చంద్రకాంత్,వంగరవీందర్‌రెడ్డి,దైవజ్ఞశర్మఉన్నారు.

## నేడు ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నూతన భవనం ప్రారంభం

### పాల్గొననున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఎంఎల్‌ఎ దానం నాగేందర్






ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని ఎర్రమంజిల్‌లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నారు.ప్రస్తుతంనూతనంగా నిర్మిస్తున్న నిమ్స్‌కు కేటాయించిన ప్రాంతంలో ఈ పాఠశాల పాత భవనంలో ఇప్పటి వరకు కొనసాగేది. నిమ్స్ విస్తరణలో భాగంగా నూతన బ్లాక్స్ నిర్మిస్తున్న నేపథ్యంలో పాఠశాలకు కూడా నూతన భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా 40 గదులతో రెండు అంతస్తులలో నూతన భవనాన్ని ఎంఈఐఎల్ నిర్మించింది. ఈ భవనాన్ని సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎంఎల్‌ఎ దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్ విజయారెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఎంఈఐఎల్ ప్రాజెక్ట్స్ విభాగం అధ్యక్షులు కె.గోవర్ధనరెడ్డి, ఎంఈఐఎల్ ప్రాజెక్ట్స్ మేనేజర్ బాలబొమ్ము నాగేంద్రబాబు తదితరుల సమక్షంలో ప్రారంభిస్తారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక గదులు, గ్రంథాలయం, ల్యాబ్ మొదలైనవి రెండు అంతస్తులలో నిర్మించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో నాలుగు వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. మరో మూడు వందల మంది విద్యార్థులు పెరిగినా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ నూతన భవనాన్ని నిర్మించారు. అదనంగా మరో రెండు అంతస్తులు భవిష్యత్తులో నిర్మించుకునేందుకు అనువుగా దీని డిజైన్ రూపొందించారు. ఇదే ప్రాంతంలో ఉన్న రవీంద్ర నికేతన్ ఎయిడెడ్ పాఠశాలకు కూడా నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాఠశాలలో రెండు వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో విద్యార్థులు పెరిగినా భవిష్యత్‌లో మరో రెండు అంతస్తులు నిర్మించుకునేందుకు అనువుగా డిజైన్ రూపొందించారు. నిర్మాణ దశలో ఉన్న దీనిని త్వరలో ప్రారంభించనున్నారు.

## బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటే రాష్ట్రంలో అగ్గి రాజేస్తం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటే రాష్ట్రంలో అగ్గి రాజేస్తమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బిసి రిజర్వేషన్లను రక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పూలే అంబేద్కర్ విగ్రహాల ముందు శాంతియుతంగా నిరసనలు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్లు పెంచడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో ఏ సామాజిక వర్గానికి నష్టం లేనప్పటికీ బీసీ రిజర్వేషన్లను ఎలాగైనా అడ్డుకొని తీరాలని తెరవెనుక ఎంతోమంది అగ్రకుల శక్తులు కుటీల ప్రయత్నాలు మొదలు పెట్టారన్నారు. అందులో భాగంగానే రెడ్డి జాగృతికి చెందిన మాధవరెడ్డి గోపాల్ రెడ్డి లను ముందు పెట్టి బిసి రిజర్వేషన్లకు గండిగొట్టి బిసిలను రాజకీయంగా అణిచివేయాలని పథకం పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు కామారెడ్డి డిక్లరేషన్లు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించినప్పుడు గానీ రాష్ట్రంలో కులగణన చేసినప్పుడు గాని అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టం చేసినప్పుడు గాని ఎప్పుడూ నోరు ఎత్తని రెడ్డి సంఘం వారు తీరా 42 శాతం రిజర్వేషన్లు పెంచుతు జీవోను విడుదల చేయగానే రాత్రికి రాత్రే కోర్టులను వేదికగా చేసుకొని బీసీలకు అన్యాయం తలపెట్టాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. బిసిల పక్షాన ధర్మం న్యాయం ఉందని హైకోర్టులో సుప్రీంకోర్టులో బిసిలకు న్యాయం జరుగుతుందని విశ్వాసం తమకుందని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ బిసి రిజర్వేషన్లు తగ్గితే చరిత్రలో మాధవరెడ్డి గోపాల్ రెడ్డిలు బిసి ద్రోహులుగా మిగిలిపోతారని వారిని చరిత్ర క్షమించదన్నారు. బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటున్న రెడ్డి సంఘంపై అఖిలపక్ష పార్టీలు తమ వైఖరి వెల్లడించాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

## నేడు ప్రజావాణి రద్దు

ప్రజాపక్షం/రంగారెడ్డి: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ నందు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపిటిసి,జెడ్ పిటిసి,సర్పంచ్ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతోందని పేర్కొన్నారు.జిల్లా ప్రజలు, ఫిర్యాదుదారులు ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## 'స్థానికం'లో 42శాతం బిసి రిజర్వేషన్లను దక్కించుకుందాం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎంపి ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం / హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లను దక్కించుకొందామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఇందుకు యావత్ బిసి సమాజం పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కోలా జనార్ధన్ సంయుక్త అధ్యక్షతన బిసి ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, అఖిలపక్ష నేతల రౌండ్ టేబ్ల్ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ అగ్రకులాల జనాభా 6శాతం ఉంటే 10శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. కానీ, 56శాతం ఉన్న బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తుంటే అగ్రవర్ణాల వారు కోర్టుకెళ్లడం దారుణమన్నారు. అగ్రకులాలకు 10శాతం ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇస్తున్నప్పుడు 50శాతం సీలింగ్ గుర్తు కురాలేదా అని ప్రశ్నించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లు సాధించాలనే కోరిక ప్రతి ఒక్కరి నరనరాల్లో ఉన్నదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బిసి బిల్లు ప్రవేశపెట్టి ఐదు నెలలు గడస్తున్నా కేంద్రం నుంచి ఎలాంటి స్పందనరాలేదన్నారు. భవిష్యత్తు తరాలకు బాటలు వేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ గవర్నర్ బం డారు దత్తాత్రేయ, శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, ఎంఎల్‌ఎ గంగుల కమలాకర్, ఎంఎల్‌సిలు అద్దంకి దయాకర్, మల్కా కొమురయ్య, మాజీ ఎంపిలు వి.హనుమంతరావు, రాపోలు ఆనందభాస్కర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంఎల్‌ఎలు బొల్ల యాదయ్య, పుట్ట మధు మాట్లాడారు. సమావేశంలో బిసి సంఘం నేతలు అనంతయ్య, రామకృష్ణ, సి.రాజేందర్, పగిళ్ల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక డ్రంక్, డ్రైవ్.. 416 మంది అరెస్ట్



ప్రజాపక్షం/రంగారెడ్డి: సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వారాంతంలో ప్రత్యేక డ్రంక్ డ్రైవింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ 321,త్రిచక్ర వాహనాలు నడిపే వారు 13 కాగా మరో 80 మంది నాలుగు చక్రాల వాహనాల వారి తోపాటు భారీ వాహనాలు నడిపే ఇద్దరుతో కలిపి మొత్తం 416 మంది నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితులను సోమవారం న్యాయస్థానం ముందు హాజరు పరుచనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. ఎవరైనామద్యం మత్తులో వాహనం నడుపుతూ ప్రాణాంతక ప్రమాదానికి కారణమైతే, అటువంటి వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత,2023 (హత్యకు సమానం కాని నేరపూరిత నరహ) సెక్షన్ 105 కింద కేసు నమోదు చేయబడుతుంది.ఈ సెక్షన్ కింద గరిష్ట శిక్ష 10 సంవత్సరాల జైలు శిక్ష ,జరిమానా విధించడం జరుగుతుందన్నారు.సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పౌరులందరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని,అందరికీ రోడ్డు భద్రతను నిర్ధారించాలని కోరారు. గత వారం న్యాయస్థానంలో మొత్తం 51 డిడి కేసులు పరిష్కరించబడ్డాయని, వీటిలో 45 మందికి జరిమానా విధించగా మరో ఆరుగురికి జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

## డైలమాలో ఆశావహులు

### కోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ
### అందరిచూపు 8వ తేదీ వైపే..
### స్థానిక ఎన్నికల రిజర్వేషన్‌లపై చర్చ

ప్రజాపక్షం/వికారాబాద్: స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ ఆశావహుల్లో ఇంకా డైలమా కొనసాగుతోంది. న్యాయపరమైన చిక్కులను దాటి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా.. లేదా అనే గ్రామాల్లో ,పట్టణల్లో చర్చ సాగుతుంది. ఈనెల 8వ తేదీన హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందోనని బరిలోనే నిలిచే వారు ,అధికారులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు కలిప్నించింది. వార్డు సర్పంచు ,ఎంపీటీసీ ,ఎపీపీ ,జేడ్పీటీసీ ,జేడ్పీ చైర్మన్ స్థానం రిజర్వేషన్ గెజిట్‌ను జిల్లా యం త్రాంగం విడుదల చేసింది. 2018, 2019 జరిగిన స్థానికల్లో బీసీ లకు 22.79 శాతం ఎస్పీలకు 20.53 ,ఎస్సీలకు 6.68 శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించారు. ప్రస్తుత రిజర్వేషన్లు కేటాయించారు. ప్రస్తుత రిజర్వేషన్ల ప్రకారం ఈ మూడు వర్గాలకు కలిపి69.21 చొప్పున రిజర్వేషన్లు కేటాయించారు. ప్రస్తుత రిజర్వేషన్లు పెడిగాయి. దీంతో 50శాతానికి మించవద్దని హైకోర్టును పలువురు ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీన హైకోర్టు విచారణ ఉంది న్యాయస్థానం ఏమి అదేశిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది ఎక్కడ నలుగురు కలిసినా ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు. పల్లేల్లో అభివృద్ధి కుంటుపడిదని వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే బిఆర్ఎస్ తమ అభిప్రాయం వ్యక్తం చేసింది. అదికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు జరుగుతాయని క్షేత్రస్థాయి. నాయకులకు అప్రమత్తం చేస్తోంది. ఎన్నికలపై సందిగ్ధతను పక్కనబెట్టి సమయత్తం కావడమే మంచిదనే అభిప్రాయాన్ని అయా పార్టీల ముఖ్యనేతలు ఇప్పటి క్షేత్రస్థాయిలో నాయకులు కార్యకర్తలకు సూచిస్తున్నారు. స్థబ్దుగా ఉంటే ప్రత్యేర్థిపార్టీకి పరిస్థితులు అనుకులంగా మారే ప్రమాదం లేకపోలేదని శేణులు జాగ్రత్తంగా ఉండాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. కోర్టు ఆదేశాలతో రిజర్వేషన్లు మళ్లీ మారుతయా... అనే చర్చ అన్ని పార్టీల నాయకుల్లో సాగుతోంది. మరోవైపు 9న ఎంపీటీసీ ,జేడ్పీటీసిల మొదటి విడుత ఎన్నికల నోటిపికేషన్ విడుదల నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ మొదలు పెట్టేందుకు అధికారులు అన్ని సిద్ధం చేస్తున్నారు. హైకోర్టు అదేశాలతో రిజర్వేషన్లు మారితే ఎంపీటీసీలు ,జేడ్పీటిసీలు ,ఎంపీపీలు ,సర్పంచులు ఏవి అన్ రిజర్వ్ ,మహిళా అవుతాయో తెలియని పరిస్థితి ఉండగా ,ఆశావహులంతా మీమాంసతో కొట్టుమిట్టాడుతున్నారు. ముందుకు పోవాలా .... వద్దా అనే అంశంపై తమ సన్నిహితులతో మాట్లాడుకుంటున్నారు. కోర్టు అదేశాలతో మార్చాల్సి వస్తే అందుకు సైతం అధికారులు సిద్దంగా ఉన్నట్లు తెలుస్తుంది. రెండు రోజుల్లో మళ్లీ కొత్త రిజర్వేషన్లు మార్చేందుకు సైతం సిద్దంగా ఉన్నారు. ఆసక్తిగా 8వ తేదీ ఉన్నత న్యాయస్థానం తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు.

## శంషాబాద్‌లో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/శంషాబాద్; శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మహిళా మండలి ప్రాంగణంలో ఈరోజు ముదిరాజ్ బంధుమిత్రుల ఆత్మీయ సమ్మేళనం, ధూంధాం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని శంషాబాద్ మున్సిపాలిటీ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బొబ్బిలి మనోజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సమ్మేళనం సందర్భంగా కళాకారుల ఆటపాటలు, ధూంధాం దప్పు చెప్పులు, సంగం పిల్లల సంస్కృతి ప్రదర్శనలు, బతుకమ్మ సంబరాలు మొదలైన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వందలాదిమంది ముదిరాజ్ మహిళలు, యువత, పెద్దలు పాల్గొనడం తో కార్యక్రమం అట్టహాసంగా సాగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనమండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ మాట్లాడుతూ 'ముదిరాజ్ యువత సామాజిక సేవతో పాటు రాజకీయ రంగంలో కూడా చురుకుగా పాల్గొనాలి. ఆపదలో ఉన్న ముదిరాజ్ కుటుంబాలను ఆదుకోవడం సమాజ బలాన్ని ప్రతిబింబిస్తుంది. కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధ్యమే. మన సమాజ అభివృద్ధికి ఐకమత్యం ఎంతో ముఖ్యం" అని పిలుపునిచ్చారు. తదనంతరం సంఘ అధ్యక్షుడు బొబ్బిలి మనోజ్ ముదిరాజ్ మాట్లాడుతూ "ముదిరాజ్ సమాజం ఏకమై ఉంటే మహా బలం ఏర్పడుతుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ అభ్యర్థులు నిలబడేలా సంఘం పూర్తి స్థాయిలో సహకరిస్తుంది. మన సమాజ సత్తా ఏమిటో రాజకీయంగా నిరూపిద్దాం. ఐకమత్యం ద్వారానే విజయం సాధ్యమవుతుంది"అనిపేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు, మహిళా ప్రతినిధులు, యువత, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన అతిథులకు, కృషి చేసిన సభ్యులకు, కమిటీ సభ్యులకు సన్మానాలు నిర్వహించారు. అనంతరం వనభోజనాలు ఏర్పాటు చేయగా, అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సమ్మేళనం విజయవంతమవడంతో బంధుమిత్రులందరిలో ఆనందం నెలకొంది.ప్రధాన అతిథులు డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ (తెలంగాణ కౌన్సిల్ వైస్ చైర్మన్) బొబ్బిలి మనోజ్ ముదిరాజ్ (శంషాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షులు) ముదిరాజ్ సంఘ నాయకులు, మహిళా మండలి సభ్యులు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గడ్డిఅన్నారం కురుమ సంఘం నూతన అధ్యక్షుడిగా భైర శంకర్



ప్రజాపక్షం/సరూర్‌నగర్: గడ్డిఅన్నారం మున్సిపాలిటీ కురుమ సంఘం అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తానని, సంఘం నూతన అధ్యక్షులు భైర శంకర్ అన్నారు. అదివారం గడ్డిఅన్నారం డివిజన్‌లోని కురుమ సంఘం ప్రాంగణంలో నూతన సభ్యుల ప్రమాణస్వీకారం సంఘ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పెద్దల ఆశీర్వాదలతో ప్రమాణం స్వీకారం చేసి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సంఘం అభివృద్ధి, సభ్యులందరం కలిసికట్టుగా ఉంటూ పెద్దల సలహాలు సూచల మేరకు సంఘంను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకుపోతానని సభ్యులు హామీ ఇచ్చారు. తమపై నమ్మకంతో తమ ప్యానల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘం సభ్యులందరి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో అధ్యక్షులు భైర శంకర్‌తో పాటు ఉపాధ్యక్షులు మేకల ఒదయ్య, ప్రధాన కార్యధర్శి తుప్పటి శ్రీకాంత్, ఉప ప్రధాన కార్యధర్శి సమ్ము శ్రీనివాస్, కోశాధికారి సమ్ము రాజులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గల్లీకో బెల్ట్ దుకాణం.. జోరుగా మద్యం విక్రయాలు




ప్రజాపక్షం /కొడంగల్: మద్యం.. వైన్స్ షాపులో కాకుండా బయట ఎక్కడబడితే అక్కడ మద్యం విక్రయించరాదని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. అయినా నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని స్పష్టమవుతోంది. ప్రతి పల్లెలోమద్యంవిక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయి. మొన్నటి గాంధీ జయంతి నాడు బెల్టు షాపులు జోరుగా కొనసాగడమే కాకుండా అధిక ధరలతో మూడింతల గిరాకి జరగడం ఆశ్చర్యపరిచింది. సామాన్యులు సైతం మద్యం సేవించడం వల్ల పచ్చని సంసారాలను పాడు చేసుకుంటున్నారని కూడా ఆరోపణలు వస్తున్నాయి. సంపాదన సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను విధిన పడేస్తున్నారు. దీంతో కుటుంబాలు రోజులు గడవక పస్తూలు ఉండాల్సిన దుస్థితి నెలకొంటుందని వాపోతున్నారు.గ్రామాలలోఉదయం 5గంటల నుంచి మద్యం అందుబాటులో ఉండటంతో ఇటు కిరాణ షాపుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అధికారులకే సవాల్ చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

### పేరుకే కిరాణం... అమ్మేది మద్యం

కిరాణ దుకాణాలు నిర్వహిస్తూ లోపలు మాత్రం మద్యం వ్యాపారం మూడు పువ్వులుఆరు కాయలుగా సాగిస్తున్న వైనం కొడంగల్ నియోజకవర్గంలో జరుగుతున్న తతంగం. ఒక్కో బాటిల్ దగ్గర 30 నుంచి 50 రూపాయల వరకు అదనంగా వసూళ్లు చేస్తు మద్యం ప్రియుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. ఎవరైన అధికారులు వచ్చి దాడులు చేసి బెదిరింపులకు గురి చేస్తే తాము ఒక్కరిమే అమ్ముతున్నామా మిగత వాళ్లు అమ్మడం లేదా.. దమ్ముంటే అందరిని బంద్ చేయించూ లేదంటే ఎంతకా వాల్నో చెప్పు ఇస్తాం.. బెల్ట్ షాపుల యజమానులు కొందరు అంటున్నట్టు సమాచారం. ఇప్పటికైనా బెల్టు షాపుల ఆటలను కట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

# రీల్



## ఓంకార్ దర్శకత్వంలో శ్రీచక్రం

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తాజాగా ఓంకార్ తో ఓ సినిమా చేస్తోంది. రాజు గారి గది 4: శ్రీచక్రం పేరుతో సినిమా నిర్మించబోతోంది. ఓంకార్ దర్శకత్వంలో వచ్చిన రాజుగారి గది సీరీస్‌లో భాగంగా శ్రీచక్రం పేరుతో సినిమా రూపొందించనున్నారు. 'ఎ డివైన్ హర్రర్ బిగిన్స్' అనే పవర్ ఫుల్ ట్యాగ్‌లైన్‌తో శ్రీచక్రం ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టనున్నారు. పురాణ విశ్వాసాలు, హిడెన్ సీక్రెట్స్, మరచిపోయిన వార సత్వాలపై ఆధారంగా రూపుదిద్దుకున్న డివైన్ హారర్‌కామెడీ 'శ్రీచక్రం'. రహస్యాలతో నిండిన 'కాలికాపురం' అనే గ్రామం నేపథ్యంగా నడిచే ఈ కథ ఇది. ఆధ్యాత్మిక యాత్రలా సాగుతూ, మిస్టిసిజంతో నిండి, సస్పెన్స్ థ్రిలల్స్, మాస్ హ్యూమర్ మూమెంట్స్ తో ఓంకార్ ఈ సినిమాను తీర్చిదిద్దనున్నారు. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటర్. శ్రీ నాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్ కాగా, అజ్జు మహాకాళి డైలాగ్ రైటర్. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది దసరాకు విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## డిసెంబర్ 5న అఖండ-2

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను డైన మిక్కాంబినేషన్ లో వస్తున్న సీక్వెల్ 'అఖండ –2: తాండవం' పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది.14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమాను తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. అఖండ–2: తాండవం డిసెంబర్ 5 న రిలీజ్ కానుంది. బాలకృష్ణ పొడవాటి జుట్టు, మెడ నిండా పవిత్ర మాలలు, ఆభరణాలు, చేతిలో భారీ త్రిశూలం, కాషాయం, గోధుమరంగు సంప్రదాయ దుస్తులు ఆయన లుక్‌కి మైథాలజికల్, డివైన్ వైబ్ జోడించాయి. మంచుతో నిండిన బ్యాక్‌డ్రాప్‌లో కనిపించిన లుక్ అదిరిపోయింది. ఎస్. థమన్ అందిస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్త ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు.



## అందాల తారలంతా ఒకే చోట!

### యైటీస్ హీరో, హీరోయిన్ల ఆత్మీయ కలయిక

దక్షిణ భారత సినిమా పరిశ్రమలో ప్రతి సంవత్సరం ఎంతో అద్భుతంగా జరిగే యైటీస్ స్టార్స్ రీయూనియన్ న చెన్నైలో జరిగింది. మూడు సంవత్సరాల విరామం తర్వాత జరిగిన ఈ సమావేశంలో చాలా మంది హీరో హీరోయిన్లు పాల్గొన్నారు.గతేడాదే నిర్వహించాలనుకున్నా, చెన్నైలో జరిగిన భారీ వర్షాలు, వరదల కారణంగా ఆ రీయూనియన్ వాయిదా పడింది. ఈసారి ఆ వేడుక ఆనాటి హీరో, హీరోయిన్ల ఆత్మీయ కలయికకు వేదికైంది.స్నేహం, ఐక్యత, హృదయపూర్వకమైన సమావేశం విజయవంతంగా జరిగింది. రాజ్‌కుమార్ సేతుపతి, శ్రీప్రియ దంపతులు తమ ఇంట్లోనే ఈ ఈ స్టార్స్ కు ఆతిథ్యం ఇచ్చారు. లిస్సీ లక్ష్మి, పూర్ణిమ భగ్యరాజ్, ఖుష్బూ సుందర్, సుహాసిని మణిరత్నం ఈ కార్యక్రమాన్ని కోఆర్డినేట్ చేశారు. మొత్తం 31 మంది నటులు ఈ రీయూనియన్‌లో పాల్గొన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తో పాటు హిందీ పరిశ్రమ నుండి కూడా స్టార్స్ వచ్చారు. జ్ఞాపకాలు, అనుభవాలు పంచుకుంటూ ఆత్మీయంగా గడిపారు. యైటీస్ స్టార్స్ రీయూనియన్ గురించి మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియాలో పోస్ట్ షేర్ చేశారు. 80 నాటి స్నేహితులతో ప్రతి రీయూనియన్ మధుర జ్ఞాపకాల వీధిలో ఒక నడకలా ఉంటుంది. నవ్వులు, ఆప్యాయత, పాత జ్ఞాపకాలు తలుచుకుంటూ ఆనందం, ప్రేమతో గడుస్తుంది. ఎన్ని సార్లు కలిసినా, ప్రతి సారి కొత్తగా, మొదటిసారి కలిసినట్టే సంతోషంగా అనిపిస్తుంది అని చిరంజీవి పేర్కొన్నారు. చిరంజీవి, వెంకటేష్, జాకీ ష్రాఫ్, శరత్‌కుమార్, రాజ్‌కుమార్ సేతుపతి, శ్రీప్రియ, నదియా, రాధ, సుహాసిని, రమ్య కృష్ణన్, జయసుధ, సుమలత, రెహమాన్, ఖుష్బూ, భాగ్యరాజ్, పూర్ణిమా భాగ్యరాజ్, లిస్సీ, నరేష్, సురేష్, శోభన, మేనక, రేవతి, ప్రభు, జయరామ్, అశ్వతీ జయరామ్, సరిత, బాను చందర్, మీనా, లత, స్వప్న, జయశ్రీ పాల్గొన్నారు.

## మహాశక్తిగా నయనతార



నయనతార లీడ్ రోల్‌లో సుందర్ సి దర్శకత్వంలో తమిళ చిత్ర పరిశ్రమలోని నిర్మాణ సంస్థలలో ఒకటైన వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి బిగ్గెస్ట్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌లలో ఒకటైన 'మూకుతి అమ్మన్ 2'ను నిర్మిస్తోంది. అవ్ని సినిమాక్స్ (పి) లిమిటెడ్ రౌడీ పిక్చర్స్ సహ నిర్మాతలు. మూకుతి అమ్మన్ పార్ట్ 1 భారీ విజయాన్ని సాధించింది, తెలుగు డబ్బింగ్ వెర్షన్ అమ్మోరు తల్లికి బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ లభించింది.మూకుతి అమ్మన్ 2' తెలుగు టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి మహాశక్తి అనే టైటిల్ పెట్టారు. నయనతారని అమ్మవారి రూపంలో ఫస్ట్ లుక్ పవర్‌ఫుల్‌గా వుంది. సుందర్ సి, నయనతార తొలిసారి కలిసి నటిస్తున్నారు. ఈ చిత్రానికి హిప్ హాప్ ఆది సంగీతం అందిస్తున్నారు. గోపీ అమర్‌నాథ్ సినిమాటోగ్రాఫర్, ఫెన్నీ ఆలివర్ ఎడిటర్. వెంకట్ రాఘవన్ సంభాషణలు అందిస్తున్నారు, గురురాజ్ ఆర్ట్ వర్క్‌లను పర్యవేక్షిస్తున్నారు. రాజశేఖర్ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ చిత్రం అన్ని దక్షిణ భారత భాషలు, హిందీలో పాన్ ఇండియా విడుదల కానుంది.

## 31న 'ఆర్యన్' విడుదల

విష్ణు విశాల్ స్టూడియోస్, శుభ్ర ఆర్యన్ రమేష్ లతో కలిసి నిర్మించిన 'ఆర్యన్' అనే అనే సినిమా విడుదలకు సిద్ధమైంది . విష్ణు విశాల్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ప్రవీణ్ కె దర్శకత్వం వహించారు. ఆర్యన్ చిత్రం అక్టోబర్ 31న విడుదల కానుంది. హీరో నితిన్ తండ్రి ప్రముఖ పంపిణి దారుడు సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో శ్రేష్ట్ మూవీస్ ద్వారా విడుదల చేయనున్నారు. శ్రేష్ట్ మూవీస్ గతంలో విక్రమ్, అమరన్, థగ్ లైఫ్ వంటి చిత్రాలను విడుదల చేశారు. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్, అభిషేక్ జోసెఫ్ జార్జ్ సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. విష్ణు విశాల్ ఎఫ్ ఐ ఆర్ చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయితగా పనిచేశారు. హరీష్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, గిబ్రాన్ సంగీతం, శాన్ లోకేష్ ఎడిటర్ గా పని చేస్తున్నారు.





## హైలెస్సో ఫస్ట్ లుక్

సుధీర్ ఆనంద్ (సుడిగాలి సుధీర్) హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇటీవల షూటింగ్ ప్రారంభించుకున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటించగా, ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్రలో కనిపించనున్నారు.

## పూరి శిష్యుడి సినిమా షురూ




శ్రావణ్ కుమార్ రాందిని హీరోగా పరిచయం చేస్తూ హై జాయ్ కమర్షియల్స్ బ్యానర్ సినిమాను నిర్మిస్తోంది. ఈ సంస్థ ప్రొడక్షన్ నెం.1గా నిర్మాణమవుతున్న ఈ సినిమాతో ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన నాగ వ్యాస్ డైరెక్టర్ గా మారుతున్నారు.ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభోత్సవం జరుపుకుంది. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి ప్రముఖ యాక్టింగ్ ట్రైనర్ సత్యానంద్ అతిథిగా హాజరై కెమెరా స్విచ్ఛాన్ చేశారు.



## 10న శశివదనే విడుదల

రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా నటించిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిలమ్స్ కంపెనీ, ఎస్.వి.ఎస్ స్టూడియోస్ బ్యానర్స్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల సినిమాను నిర్మించారు. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. అక్టోబర్ 10న రిలీజ్ కానున్న ఈ మూవీ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ కోమలి ప్రసాద్ మాట్లాడుతూ కథలో సన్నివేశాల డిమాండ్ ను బట్టే లిప్ కిస్ ఇచ్చానని శశివదనే హీరోయిన్ కోమలి ప్రసాద్ చెప్పారు. ఈ సినిమాలో హీరోకు ఇచ్చే లిప్ కిస్ లో ఓకే అర్థం ఉంటుందని, అసలు ఎందుకు లిప్ కిస్ ఇచ్చాను అనేది సినిమా చూస్తేనే స్పష్టంగా తెలుస్తుందని అనే పేర్కొన్నారు. లిప్ కిస్ అనేది భూతద్దంలో చూడాల్సిన పనిలేదని, లిప్ కిస్ గురించి ఇంత కంటే ఎక్కువ చెప్తే కథను రివీల్ చేసినట్టు ఉంటుందని తెలిపారు.




## 'కాకా' స్ఫూర్తితోనే.. ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోంది

### బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర మాజీమంత్రి జి.వెంకటస్వామి(కాకా) స్ఫూర్తితోనే ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలోనే గొప్ప కార్మిక నాయకుడిగా నిలిచిపోయారని కొనియాడారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, ఎంపి వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్, పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయ చరిత్రలో కొందరి పేర్లు చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. అందులో కాకా పేరు అగ్రస్థానంలో ఉంటుందన్నారు. కార్యకర్తగా మొదలై కేంద్రమంత్రిగా ఎదిగారని తెలిపారు. కార్మిక రంగంలో కాకా తీసుకొచ్చిన సంస్కరణలు ఎవరు తేలేదన్నారు. బడుగు, బలహీన వర్గాల గొంతుకగా కాకా నిలిచారని కొనియాడారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో పోరాటం చేసి, స్వరాష్ట్రంలోనే ప్రాణాలు వదిలిన గొప్ప వ్యక్తి కాకా అని కొనియాడారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కాకా వెంకటస్వామి అంబేద్కర్ బాటలో నడిచి పేద ప్రజలకు సేవ చేస్తే, ఆయన వారసులు మంత్రి వివేక్, వినోద్‌లు కాకాబాటలో ప్రజాసేవ చేస్తున్నారని అన్నారు. పేదవాళ్లపైన తపన, మక్కువతో ఆయన ఎంతో సేవ చేశారన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాకా నిరంతరం కార్మికుల గురించే ఆలోచించే వారని అన్నారు. కాంగ్రెస్‌లో కాకా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో పెన్షన్ స్కీం తీసుకొచ్చింది కాకానే అని తెలిపారు. ఆయన వల్లే సింగరేణి బతికి బయటపడిందన్నారు. రూ.400 కోట్ల రుణాలు ఇప్పించి సింగరేణిని కాపాడారని చెప్పారు. వైఎస్ఆర్‌తో మాట్లాడి ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టును తీసుకొచ్చారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహితను పక్కన పెట్టేసిందని విమర్శించారు. పేద పిల్లల విద్యకు అంబేద్కర్ విద్యాంస్థలు అందించారన్నారు. ఎంపి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ కాకా వెంకటస్వామి స్ఫూర్తితో ఆయన అడుగుజాడల్లో నడుస్తానని అన్నారు. కాకా మాటిస్తే తప్పలేదని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతానని తెలిపారు.

## రాష్ట్రంలో సొంత పథకాలకు కేంద్రం నిధులు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అందిస్తున్న నిధును రాష్ట్ర పాలకులు తమ సొంత పథకాలకు మళ్లించుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం బిజెపి పదాధికారుల సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థుల ఎంపికపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కూడా కేంద్రం నుంచి వచ్చిన నిధుల విషయంలో ప్రజలను మళ్లించారన్నారు. ఇప్పుడు కూడా రాష్ట్రంలో నిధులు లేక కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. సడక్ యోజనలో రోడ్లు, వనమహోత్సవానికి నర్సరీల ఏర్పాటు, శ్మశాన వాటికలకు కేంద్ర ప్రభుత్వ నిధులు అందించిందని తెలిపారు. ప్రధాని మోదీ వచ్చిన తరువాత రూరల్ తెలంగాణ ఎలా అభివృద్ధి అయ్యిందో బిజెపి కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు.



## కార్యాచరణ రూపకల్పన

(మూడవ పేజీ తరువాయి)

సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె. నారాయణ ఆరోపించారు. బీహార్‌తో సహా పలు రాష్ట్రాల్లో ప్రోత్సాహాలను అందిస్తూ ప్రజలను వంచించేందుకు ప్రయత్నిస్తుందని ఇందు కొరకు వేల కోట్ల రూపాయలను డంపు చేసిందని ఆయన తెలిపారు. ఇప్పటికే బిజెపి దొల్లతనం దొంగ ఓట్లతో బయటపడిందన్నారు. బిజెపి అంతా బాగున్నట్లు భ్రమింపజేస్తుందని వాస్తవానికి క్షేత్రస్థాయిలో బిజెపి బలహీనపడుతుందని నారాయణ తెలిపారు. ప్రజల్లో ప్రజాస్వామ్యత భావజాలం బలంగా ఉందని బిజెపి ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను ప్రజలు నిరసిస్తున్నారని ఆయన తెలిపారు. జిఎస్టి తగ్గింపు వ్యవహారం కార్పొరేట్ కంపెనీల పండుగ ఆఫర్ లాంటిదని కంపెనీలు ధర పెంచి తగ్గిస్తుదంటాయని జిఎస్టి తగ్గింపు కూడా అటువంటిదేనన్నారు. జిఎస్టి పేరుతో తొమ్మిదేళ్ల కాలం రూ.15లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం ప్రజల నుంచి లూటీ చేసిందని నారాయణ తెలిపారు. రూ.16లక్షల కోట్లు దోపిడీ చేసిన 29 మంది కార్పొరేట్ అధిపతులకు కేంద్ర ప్రభుత్వానికి పెద్ద తేడా లేదన్నారు. దేశంలో డిజిటల్ దోపిడీ పెరిగి పోతున్నదని ఏఐ మాయాజాలం పెరిగిపోతున్నదని ఆయన తెలిపారు. ఏఐ పేరుతో ఒక మాయా ప్రపంచాన్ని సృష్టించి దోపిడీకి పాల్పడుతుందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేరుతోనే ఒక ప్రకటన విడుదల చేసి వందల కోట్ల రూపాయలు దోపిడీ చేసేందుకు ప్రయత్నం జరుగుతుందన్నారు. కమ్యూనిస్టులుగా ఈ సాంకేతిక పరిజ్ఞానం గురించి ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాను విరివిగా వినియోగించుకోవాలని నారాయణ తెలిపారు. దేశంలో కమ్యూనిస్టులకు సామాజిక పునాది సానుకూలం కాకపోయినా కమ్యూనిస్టుల ద్వారానే సమాజ మార్పు జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లలో దోపిడీ వ్యవస్థను పదిలం చేసిందని తన భావజాలాన్ని ప్రచారం చేస్తుందని కాని కమ్యూనిస్టు పార్టీ దోపిడీ వ్యవస్థ అంతం కోసం ప్రయత్నిస్తున్నదని ఆర్ఎస్ఎస్ సిపిఐ పరస్పర విరుద్ధ భావాజాలం కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు. మార్పు అనివార్యమని అది కమ్యూనిస్టుల ద్వారానే జరుగుతుందన్నారు. పార్టీ శత సంవత్సరాల సంబరాల సందర్భంగా దేశ వ్యాప్తంగా జన సేవాదళ్ కార్యక్రమాలను విస్తృత పర్చాలని వేల మంది కార్యకర్తలను తయారు చేయాలని నారాయణ పిలుపునిచ్చారు.

## రణనినాదం

(మూడవ పేజీ తరువాయి)

ఉందని ఆంధ్రా మహాసభ ద్వారా నైజాం పతనానికి నాంది పలికిన ఖమ్మంలో శత వసంత వేడుకల ముగింపు సభ జరగడం అభినందనీయమన్నారు. పలు చారిత్రిక ఉద్యమాలకు, పోరాటాలకు నిలయమైన ఖమ్మం శ్రామిక జనవాణిని వినిపించడంలో ముందువరుసలో నిలిచిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ 1925లోనే దున్నే వానికే భూమి అనే నినాదంతో భూసమస్యను ఎజెండా మీదకు తెచ్చిందని నారాయణ తెలిపారు. భారతదేశ వ్యాప్తంగా జరిగిన బహు పోరాటాలకు వేదికగా కమ్యూనిస్టు పార్టీ నిలిచిందన్నారు. బ్రిటిష్‌కు వ్యతిరేకంగా పోరాడి సంపూర్ణ స్వాతంత్ర్య నినాదాన్ని ఇచ్చిందే కమ్యూనిస్టులని అటువంటి పార్టీ ఇప్పుడు దేశంలోని ప్రజాస్వామ్యక వ్యవస్థల పరిరక్షణకు పునరంకితమవుతుందని ఛండీఘడ్ మహాసభ ఇదే పిలుపునిచ్చిందని నారాయణ గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆ తర్వాత సామాజిక చైతన్యం కోసం జరిగిన ఏ పోరాటంతో సంబంధం లేని దేశ ద్రోహులు దేశభక్తులుగా చెలామణి అవుతున్నారని ఆయన ఆరోపించారు. బ్రిటిష్‌లో అనుకూలురు దేశంలో అధికారంలో కొనసాగుతుంటే బ్రిటిష్ వ్యతిరేకులు బ్రిటిష్ అనుకూలురపై విపక్షంలో ఉండి పోరాటాలు సాగిస్తున్న ప్రత్యేక పరిస్థితి ఇప్పుడు దేశంలో నెలకొందన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను ఆక్షేపిస్తున్న గవర్నర్లను చూస్తున్నామని వీళ్ల ప్రజాస్వామ్యక వ్యవస్థలను కాపాడతారా అని నారాయణ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని బిజెపి ధ్వంసం చేస్తుందని ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు ఇచ్చిందని ఆయన తెలిపారు. 12 మందిని చంపితే కానీ నిర్దోషిగా బయటకు రాలేని అమిత్‌షా మావోయిస్టులను తుదముట్టిస్తామని అంటున్నాడని మావోయిస్టులు అంతం కావచ్చు కానీ ఆ సిద్ధాంతం అంతం కాదని నారాయణ తేల్చి చెప్పారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో మోడీ పాలన సాగిస్తున్నారని ఈ దేశంలో ప్రభుత్వ రంగంలో ఒక సంస్థను నెలకొల్ప లేదని ఒక ప్రాజెక్టు నిర్మించ లేదని వంచనతోనే అధికారంలో కొనసాగుతున్నారన్నారు. డెకాయిట్లకు, దోపిడీదారులకు బెయిల్ వచ్చినా వరవరరావులాంటి వ్యక్తులకు రాకపోవడం శోచనీయమన్నారు. దేశాన్ని ముక్కలు కానివ్వం అనే నినాదంతో పాటు గ్రామ గ్రామానికి కమ్యూనిస్టు పార్టీ విస్తరణే లక్ష్యంగా శత వసంత సభను నిర్వహించడం జరుగుతుందని నారాయణ తెలిపారు.

అధ్యక్షత వహించిన సాంబశివరావు మాట్లాడుతూ త్యాగాల చరిత్రతో కమ్యూనిస్టులు ముందుకు సాగుతుంటే స్వార్థ చింతనతో ఆర్ఎస్ఎస్ అధికారమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కమ్యూనిస్టులు ప్రజలను ఐక్యం చేస్తుంటే ఆర్ఎస్ఎస్ ప్రజలను విచ్ఛిన్నం చేసే దిశగా ముందుకు సాగుతుందన్నారు. గొప్ప మానవతా సిద్ధాంతం కమ్యూనిజమని దీనికి మరణం లేదన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు తదితరులు ప్రసంగించగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆహుతులను వేదిక మీదకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, అజీజ్‌పాషా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, అక్కినేని వనజ, ముప్పాల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, రావుల వెంకయ్య, ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యులు ఎస్‌కె సాబీర్‌పాషా ఖమ్మం నగర ప్రముఖులు ఎంఎఫ్ గోపినాథ్, డాక్టర్ పి.గోర్కీ, డాక్టర్ వై.ప్రసాద్, రవి మారుత్, రమణారావు, కేసా వీరన్న, సాంబశివారెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నర్సింహా, కార్యదర్శి వర్గ సభ్యులు కె.శంకర్, బోస్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మౌలానా, ఏఐటియుసి నాయకులు సీతారామయ్య, యూసుఫ్, బాలరాజు, రాజ్‌కుమార్, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ముగింపు సభను పురస్కరించుకుని పలువురు భారీగా విరాళాలు సమర్పించారు.




### పుదుచ్చేరి, తమిళనాడు నుంచి జన సమీకరణ



పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు ప్రజలను సమీకరించనున్నట్లు ఆయా రాష్ట్రాల బాధ్యులు, జాతీయ కార్యవర్గ సభ్యులు టిఎం మూర్తి, పుదుచ్చేరి రాష్ట్ర కార్యదర్శి సలీంలు తెలిపారు. తెలంగాణ ప్రాంతంతో పుదుచ్చేరికి ఉద్యమ సారూప్యత ఉందని సలీం తెలిపారు. తెలంగాణ మాదిరే పుదుచ్చేరిలోనూ సాయుధ పోరాటం జరిగిందని సిపిఐ నాయకులు సుబ్బయ్య పుదుచ్చేరి జాతిపితగా పేరొందారన్నారు. టిఎం మూర్తి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి తగిన రీతిలో ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం జరుగుతుందని తమిళనాడు రాష్ట్రం నుంచి 10వేల మందికి పైగా కార్యకర్తలను తరలిస్తామని ఆయన తెలిపారు.


### సభ విజయవంతానికి సంపూర్ణ సహకారం : రామకృష్ణ



డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగే సభకు ఆంధ్రప్రదేశ్ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ కార్యదర్శి వర్గ ఆహ్వానితులు కె. రామకృష్ణ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని అవసరాలకు అనుగుణంగా ఉద్యమ కార్యాచరణతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 26 సభకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి ప్రజలను పెద్ద ఎత్తున కదిలిస్తామని బహిరంగ సభకు సంబంధించి అన్ని విషయాల్లోనూ పాలు పంచుకుంటామని రామకృష్ణ స్పష్టం చేశారు.

### ఆర్ఎస్ఎస్‌ది అధికార కాంక్ష

**– పల్లా వెంకటరెడ్డి**



ఆర్ఎస్ఎస్‌ది అధికార కాంక్ష అని వందేళ్ల చరిత్రలో ప్రజల గురించి ఏనాడు పనిచేసిన దాఖలాలు లేవని ఆర్ఎస్ఎస్ అంటే విభజన, విధ్వంసం మాత్రమేనని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి తెలిపారు. సన్నాహక సమావేశంలో పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉద్యమ గుమ్మం ఖమ్మంలో శత వసంత ముగింపు సభ జరగనుండడం గొప్ప విశేషమని ఆయన అన్నారు. కమ్యూనిస్టులు ఒక సైద్ధాంతిక నిర్మాణంతో రాజకీయ లక్ష్యం కోసం పనిచేస్తున్నారని బలహీన పడవచ్చు కానీ పునరుత్తేజం తథ్యమని వెంకటరెడ్డి తెలిపారు. కమ్యూనిస్టులు ఉంటేనే ఈ సమాజానికి, ఈ దేశానికి రక్షా అని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న దశలో మరింత ఐక్య ఉద్యమాలు అవసరమన్నారు. కొంత మంది అలవికాని హామీలు ధన ప్రభావం ఇతరత్రా కారణాలతో ఎన్నికల్లో సానుకూల ఫలితాలు సాధించి ఉండవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టులే ఈ దేశానికి రక్ష, రాజకీయ ప్రత్యామ్నాయం అని వెంకటరెడ్డి తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com